


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 70

గురువారం 1-6-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




వరల్డ్ మిల్క్ డే

# విజయంలో సగపాలు


● అక్షాలి షా

'పాడి రంగంలో మన దేశంలో మూడొంతుల మంది స్త్రీలే పని చేసి విజయం సాధిస్తున్నారు' అని గత సంవత్సరం 'వరల్డ్ డెయిరీ సమ్మిట్'లో ప్రధాని నరేంద్రమోడి అన్నారు. పశు పోషణ చేసి, పాలు పితికి, ఆదాయ మార్గాలు వెతికి విజయం సాధిస్తున్న మహిళలు ఎందరో నేడు ఆ మాటను నిజం చేస్తున్నారు. నేడు 'వరల్డ్ మిల్క్ డే' 'ఎంజాయ్ డెయిరీ ప్రాడక్ట్' అనేది థీమ్. 'పరాగ్ మిల్క్ ఫుడ్స్' పేరుతో డెయిరీ ప్రాడక్ట్స్ దేశంలోనే అగ్రశ్రేణిగా నిలిచింది అక్షాలి షా.

32 ఏళ్ల అక్షాలి షా నేడొక దేశంలో ఉంటే రేపు మరో దేశంలో ఉంటుంది. ఏ దేశంలో పాడి రంగం ఎలా అభివృద్ధి చెందుతున్నదో, పాడి ఉత్పత్తులలో ఎలాంటి సాంకేతికత చోటు చేసుకుంటున్నదో నిత్యం అధ్యయనం చేస్తూ ఉంటుంది. ఆ మార్పులను తాను అధినాయకత్వం వహిస్తున్న 'పరాగ్ మిల్క్ ఫుడ్స్' సంస్థలో ప్రవేశపెడుతూ ఉంటుంది. అందుకే ఇవాళ ప్యాకేజ్డ్ పాల రంగంలో, డెయిరీ ఉత్పత్తుల రంగంలో పరాగ్ సంస్థ అగ్రగామిగా ఉంది. అందుకు పూర్తి క్రెడిట్ అక్షాలి షాకు దక్కుతుంది.

## గడప చెంతకు ఆవుపాలు

అక్షాలికి పూణెలో గోక్షేత్రం ఉంది. 2011 నాటికి అక్కడి ఆవుల నుంచి పాలు పితికి, కేవలం ఆవుపాలు కోరే 172 మంది ఖాతాదారులకు అందించేవారు. అక్షాలి రంగంలోకి దిగాక శ్రేష్ఠమైన ఆవు పాల కోసం దేశంలో కోట్ల మంది ఖాతాదారులు ప్రయత్నిస్తుంటారని అర్థం చేసుకుంది. 'ప్రైడ్ ఆఫ్ కౌస్' పేరుతో ప్రీమియమ్ ఆవుపాలను అందించడానికి ముందుకు వచ్చింది. మానవ రహితంగా ఆవుల నుంచి పాలను పితికి, ప్యాక్ చేసి, విమానాల ద్వారా గమ్యస్థానాలకు చేర్చి తాజాగా ఖాతాదారుల గడప దగ్గరకు ప్యాకెట్లు పడేలా నెట్‌వర్క్ సిద్ధం చేసింది. ఇంత శ్రేష్ఠత పాటించడం వల్ల మార్కెట్‌లో ఆవు పాల కంటే ఈ పాలు రెట్టింపు ధర ఉంటాయి. అయినా సరే కష్టమర్లు తండోప తండాలుగా ఈ పాలను కోరుకున్నారు. ఇవాళ అక్షాలి సరఫరా చేస్తున్న ఆవుపాలు ఢిల్లీ, ముంబై, పూణె, సూరత్‌లలో విశేషంగా అమ్ముడు పోతున్నాయి. 2027 నాటికి కేవలం ఈ ఆవుపాల టర్నోవర్ 400 కోట్లకు చేరుకుంటుందని అక్షాలి అంచనా.

## 2010లో పగ్గాలు చేపట్టి

ఎం.బి.ఏ.లో బిజినెస్ మేనేజ్‌మెంట్ చదివిన అక్షాలి షా తన తండ్రి దేవేంద్ర షా స్థాపించి నిర్వహిస్తున్న పాడి పరిశ్రమ రంగంలో 2010లో అడుగుపెట్టింది. అయితే తండ్రి ఆమెకు వెంటనే సంస్థ పగ్గాలు అప్పగించకుండా పెరుగు తయారు చేసే ఒక చిన్న ప్లాంట్‌ను ఇచ్చి దానిని డెవలప్ చేయమన్నాడు. అక్షాలి విజయం సాధించేసరికి మెల్ల మెల్లగా సంస్థలో ఆమె స్థానం, స్థాయి పెరుగుతూ పోయాయి. 'భారతీయుల సంస్కృతిలో పాలు, గోవు చాలా విశిష్టమైన స్థానంలో ఉంటాయి. మన పురాణాల్లో క్షీరం ప్రస్తావన ప్రముఖంగా ఉంటుంది. అందుకే నేను ఈ రంగాన్ని ఆషామాషీగా నిర్వహించదలుచుకోలేదు. నాణ్యమైన పాల ఉత్పత్తులు అందించగలిగితే కనుక సెంటిమెంట్ కనెక్ట్ అవుతుందనుకున్నాను' అంటుంది అక్షాలి.

## ప్రొటీన్ ఉత్పత్తులు

శాకాహారంలో 84 శాతం, మాంసాహారంలో 65 శాతం ప్రొటీన్ లోపం ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. 'ఆరోగ్య, క్రీడా రంగంలో ప్రొటీన్ ప్రాడక్ట్స్‌కు నేడు దేశంలో ఏటా 2000 కోట్ల మార్కెట్ ఉంది. ప్రొటీన్ పౌడర్లు తీసుకునే ఫిట్‌నెస్ ప్రియులు చాలామంది ఉంటారు. అందుకే పాల నుంచి సేకరించిన ప్రొటీన్ ప్రాడక్ట్‌లను తయారు చేసి విక్రయిస్తున్నాం. అవతార్, గో ప్రొటీన్ పేరుతో మా ప్రాడక్ట్‌లు ఉన్నాయి' అంటుంది అక్షాలి. పరాగ్ సంస్థ నుంచి 'గోవర్ధన్' పేరుతో నెయ్యి దొరుకుతోంది. ఇక చీజ్ అమ్మకాల్లో అక్షాలి సంస్థ దేశంలోనే రెండో స్థానంలో ఉంది. ఫ్లేవర్డ్ మిల్క్, పెరుగు... ఈ అన్ని ఉత్పత్తుల్లో సంస్థ మంచి అమ్మకాలు సాధిస్తోంది.

పూర్వం పాలు, పెరుగు స్త్రీలే అమ్మేవారు. వారికి పాలను ఎలా ఆదాయవనరుగా చేసుకోవాలో తెలుసు. అక్షాలి లాంటి నవతరం డెయిరీ లీడర్లు అదే నిరూపిస్తున్నారు.

ఫస్ట్ టైమ్

# పర్వతాలు పిలిచాయి


● శాలిని సింగ్

'అదిగో పర్వతాలు పిలుస్తున్నాయి. నేను తప్పక వెళ్లాలి' అంటాడు ప్రకృతి ప్రేమికుడు, తత్వవేత్త జాన్ మ్యూర్. ఒకానొక సమయంలో శాలిని సింగ్‌కు కూడా పర్వతాల పిలుపు వినిపించింది. పర్వతాలు ఆప్యాయంగా పలకరిస్తాయి. సాహసాలు చేయమంటాయి. అనురక్తి ఉన్నచోట ధైర్యం ఉంటుంది. ఆ రెండు ఉన్నచోట అపురూపమైన సాహసం ఆవిష్కారం అవుతుంది. ఉత్తరఖండ్‌లోని హిమాలయప్రాంతం ఉత్తరకాశీలో అధునాతనమైన మౌంటెనీరింగ్ కోర్సు పూర్తి చేసిన తొలి మహిళా ఎన్‌సీసీ క్యాడెట్‌గా చరిత్ర సృష్టించింది లక్నోకు చెందిన శాలిని సింగ్....

లక్నోకు చెందిన బప్పశ్రీ నారాయణ్ పీజీ కాలేజీలో శాలిని సింగ్ బీఏ స్టూడెంట్.

పాఠాలే కాదు పర్వతారోహకుల గురించి ఎన్నో విషయాలు విన్నది శాలిని.

19 శతాబ్దానికి చెందిన ప్రపంచ ప్రసిద్ధ పర్వతారోహకుల గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలు విన్నది. బచేంద్రిపాల్, ప్రేమలత అగర్వాల్, అరునిమ సిన్హా, శివాంగి పాఠక్, మాలావత్ పూర్ణ....వరకు ఎంతో మంది సాహసికులు తనలో ఉత్తేజం నింపారు.

ఎన్‌సీసీలో చేరిన తరువాత శాలిని సింగ్ ప్రపంచం విస్తృతం అయింది. కొత్త దారులు ఎన్నో కనిపించాయి.

యూపీ బెటాలియన్‌లో శాలిని సింగ్ సీనియర్ వింగ్ ఎన్‌సీసీ క్యాడెట్. అడ్వాన్స్‌డ్ మౌంటెనీరింగ్ కోర్సు పూర్తి చేసి సత్తా నిరూపించుకోవాలనేది ఎంతో మంది కల. అయితే అది అంత తేలికైన విషయం కాదు.

దానికి ముందు బేసిక్ మౌంటెనీరింగ్ కోర్సులో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

జమ్ములోని పహల్‌గామ్‌లో గత సంవత్సరం బేసిక్ మౌంటెనీరింగ్ కోర్సు పూర్తి చేసిన శాలిని అడ్వాన్స్‌డ్ కోర్సుకు అర్హత సంపాదించింది. మౌంటెనీరింగ్ కోర్సులో భాగంగా ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది శాలిని. అవి తన జీవితంలో విలువైన అనుభవాలు.

మరిన్ని సాహసాలకు దారి చూపే అరుదైన పాఠాలు.

దట్టమైన మంచుతో ఉండే హుర్రా శిఖరాన్ని అధిరోహించడం అనేది సాధారణ విషయం కాదు.

కోర్సులో భాగంగా ప్రతికూలమైన వాతావరణ పరిస్థితులను తట్టుకొని డ్రింజ్ వ్యాలీలోని 15,000 అడుగుల ఎత్తయిన హుర్రాను అధిరోహించింది శాలిని.

ఉత్సాహం, అంకితభావం, సాహసాలను మేళవించి ఎన్నో సవాళ్లతో కూడిన అధునాతనమైన మౌంటెనీరింగ్ కోర్సు పూర్తి చేసి, తొలి మహిళా ఎన్‌సీసీ క్యాడెట్‌గా చరిత్ర సృష్టించింది శాలిని సింగ్.

'నువ్వు చేయగలవు. కచ్చితంగా చేస్తావు' అంటూ శాలినిలో ఉత్సాహాన్ని నింపాడు కల్నల్ పునీత్ శ్రీవాస్తవ.

'శాలిని విజయం ఎన్‌సీసీకి మాత్రమే పరిమితమైన విజయం కాదు. ఆమెలా కలలు కనే ఎంతోమందికి స్ఫూర్తిని ఇచ్చే విజయం' అంటున్నాడు పునీత్ శ్రీవాస్తవ.

'నా విజయం ఎంతమంది అమ్మాయిలకు స్ఫూర్తినిస్తే అంతగా సంతోషిస్తాను' అంటుంది శాలిని సింగ్.

'మనం యాంత్రికంగా జీవిస్తున్నామా, జీవనోత్సాహంతో ఉన్నామా అనే దానికి సాహసాలే ప్రమాణం అనే మాట ఎన్నో సార్లు విన్నది శాలిని.

ఆ మాటలే సాహస బాటను ఎంచుకోవడానికి తనకు ప్రేరణ ఇచ్చాయి.

సివిల్ సర్వీసెస్‌లో చేరాలనేది శాలిని సింగ్ కల.

అయితే అంతకంటే బలమైన కల....

ప్రపంచంలోని ప్రతి శిఖరాన్ని అధిరోహించాలని!

బ్యూటిప్స్

## ముఖకాంతికి

ఎండాకాలం చెమట వల్ల ముఖ చర్మం జిడ్డుగా అవుతుంది. ముఖకాంతి పెరగాలంటే...

● మూడు టీ స్పూన్ల దోస రసం, రెండు టీ స్పూన్ల అలోవెరా జెల్, టీ స్పూన్ పెరుగు కలిపి ముఖానికి, మెడకు పట్టించి, పదిహేను నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఎండవల్ల కందిపోయిన, రసాయనాల వల్ల ర్యాష్ ఏర్పడిన చర్మానికి సహజమైన ఫేస్‌ప్యాక్‌లా పనిచేస్తుంది.

● దోస లేదా కీరా రసంలో పచ్చి పాలు కలిపి చర్మానికి రాయాలి. ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఎండ వల్ల కమిలిన చర్మం వెంటనే సాధారణ రంగులోకి వస్తుంది.



రంగస్థలం

# అమావాస్య పున్నముల అరుదైన కళ

సంవత్సరాలు గడిచినా రంగస్థలం పులకరించే పేరు..... బినోదిని దాసి. బెంగాలీ నాటకకళకు కొత్త అడుగు నేర్పిన పేరు అది. బినోదినీ జీవితం నాటకాల నుంచి సినిమాల వరకు ఎన్నో సృజనాత్మక రూపాల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తాజాగా...మ్యూజిక్ బేస్డ్ డ్రామా 'బినోదిని ఒపెరా' సాహిత్య,సంగీత, దృశ్య సమ్మేళనంగా ప్రేక్షకుల ముందుకు వచ్చి అలరిస్తోంది. అలనాటి కాలానికి తీసుకెళ్లి 'ఔరా' అనిపిస్తోంది...


● బినోదినీ పాత్రలో సుదీప్త చక్రవర్తి...

బినోదిని దాసి పన్నెండవ ఏట నుంచే నటన మొదలు పెట్టింది. 1874లో కోల్‌కత్తా నేషనల్ థియేటర్ తరపున తొలిసారిగా ఒక సీరియస్ డ్రామాలో నటించింది. ఈ డ్రామా కంపెనీ వ్యవస్థాపకుడైన గిరీష్ చంద్ర ఘోష్ మాటలనే పాఠాలుగా చేసుకొని యూరోపియన్ థియేటర్ నుంచి ఇండియన్ థియేటర్ వరకు ఎన్నో విషయాలు నేర్చుకుంది. నటనలో తనను తాను మెరుగుపరుచుకుంది. పన్నెండవ యేట మొదలు పెట్టిన నటనకు 23వ యేట స్వస్తి పలికినప్పటికీ ఎన్నో అపురూపమైన పాత్రలు పోషించింది. నటనకు సంబంధించి ఎన్నో విలువైన అనుభవాలను సొంతం చేసుకుంది.

జీవిత చరిత్ర రాసుకున్న దక్షిణ ఆసియాకు చెందిన తొలి నటిగా చరిత్రకెక్కింది. సంప్రదాయ బెంగాలీ నాటకరంగానికి ఆధునిక ధోరణులను పరిచయం చేసిన నటిగా పేరు తెచ్చుకుంది.

తన జీవిత చరిత్ర 'అమర్ కథ' ఒక సంచలనం. బినోదినీ ఉన్నట్టుండీ నాటకాలకు ఎందుకు దూరమైంది అనే దాని గురించి రకరకాల కారణాలు వినిపిస్తున్నప్పటికీ అసలు సిసలు కారణం ఏదో తెలియాల్సి ఉన్నది అనిపిస్తుంది.

కాలాతీతుల గురించి ఎప్పుడూ మాట్లాడుకున్నా, ఏంమాట్లాడుకున్నా అమిత ఆసక్తిగా ఉంటుంది. బినోదినీ ఈ కోవకు చెందిన నటి. 'నటి బినోదినీ' పేరుతో బెంగాలీ సినిమా వచ్చింది. ఆమె జీవిత చరిత్ర ఆధారంగా నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా(ఎన్ఎస్‌డీ) రూపొందించిన 'నటి బినోదినీ' బాగా పాపులర్ అయింది.

తుహినభ మజుందార్ బినోదిని జీవితచరిత్ర ఆధారంగా 'అమర్‌కథ: స్టోరీ ఆఫ్ బినోదినీ' పేరుతో డాక్యుమెంటరీ తీశారు.

తాజాగా... బినోదినీ జీవితంపై అబంతి చక్రవర్తి మ్యూజిక్ బేస్డ్ డ్రామా 'బినోదిని ఒపెరా' రూపొందించారు. ఈ ఒపెరాకు ప్రేక్షకుల నుంచి అనూహ్యామైన ఆదరణ లభిస్తోంది. దీనిలో బినోదినీ ప్రేమ, వివాహం, బంధాలు...ఇలా ఎన్నో అంశాలు కనిపిస్తాయి.


● బినోదినీ దాసి

150 నిమిషాల ఈ ఒపెరా మంత్రముగ్ధులను చేస్తోంది. బినోదినీ పాత్రకు సుదీప్త చక్రవర్తి ప్రాణం పోసింది.

ఈ ఒపెరాను ప్రేక్షకులు సృజనాత్మక ప్రక్రియగా మాత్రమే చూడడం లేదు. గత, వర్తమానాల సామాజిక, సాంస్కృతిక విశ్లేషణకు ఒక వేదికలా చూస్తున్నారు.

**'ఎన్ని సుడిగుండాలు దాటుకొని నిలబడితే.... ఒక నటి**

**చిమ్మ చీకట్లో ఎన్ని తేజాలతో వెలిగిపోతే... ఒక నటి!' అనే మాటలను కళ్లకు కట్టే కళా రూపం.... బినోదినీ ఒపెరా.**

సైబర్ టాక్

# ఫేక్ ఇన్‌ఫ్లుయెన్సర్లతో జాగ్రత్త!

మెరిసేవన్నీ బంగారం కానట్టే, మనం చూసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లలో అందరూ నిజమైన వారు కాకపోవచ్చు. వారు చూపే ఉత్పత్తులు నమ్మదగినవి అయిఉండకపోవచ్చు. ఎందుకంటే. రూ.100 పెట్టి, వంద అంతకంటే ఎక్కువ మంది ఫాలోవర్లను కొనుగోలు చేసే కొత్త మార్కెట్ ప్లేస్‌గా ప్రస్తుత సోషల్‌మీడియా తయారైంది. సరైన అవగాహన లేకపోతే పెయిడ్ పోస్ట్-వ్యక్తిగత అభిప్రాయం మధ్య తేడాను గుర్తించడం కష్టం. సెలబ్రిటీలు, ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నవారు చెబుతున్నారు కదా అని నాసిరకం వస్తుసేవలను కొనుగోలు చేసి మోసపోవద్దు.

ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేయడానికి కంపెనీలు ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్ వైపు మళ్లుతున్నాయని ఆన్‌లైన్ ట్రెండ్ నివేదికలు చూపుతున్నాయి. ఇన్‌ఫ్లుయెన్సర్ ఎండార్స్‌మెంట్ పెరగడానికి ప్రధాన కారణాలి ..

- ఇన్‌ఫ్లుయెన్సర్ సపోర్ట్ చేసే ఉత్పత్తులను వినియోగదారులు కొనుగోలు చేసే అవకాశాలు ఎక్కువ.
- వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఇన్‌ఫ్లుయెన్సర్ అకౌంట్ చూపించే వ్యూస్, కామెంట్స్‌ను చూసి నమ్ముతారు.
- ఎక్కువ షేర్ అయిన కంటెంట్‌ను చదవడానికి అధిక సమయం కేటాయిస్తారు. అలాగే ఆ సమాచారాన్ని వినియోగదారులు నమ్మే అవకాశాలు ఎక్కువ.
- ఇన్‌ఫ్లుయెన్సర్లు వారి ఫాలోవర్స్ కామెంట్స్‌కు ప్రతిస్పందించడం, ఉత్పత్తులు, సేవలపై వారి అభిప్రాయాలను చెప్పడం.. మొదలైన వాటితో వినియోగదారుడు నమ్మకం పెంచుకుంటాడు. ఇన్‌ఫ్లుయెన్సర్లు వారి ఫాలోవర్స్‌తో ఎప్పుడూ మాట్లాడుతూ ఉండటం కూడా దీనికి ఒక కారణం.

## ఇలాంటి వాటిలో ఎక్కువ...

- నకిలీ కంపెనీలు ముఖ్యంగా ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, పెట్టుబడి, మల్టీ లెవల్ మార్కెటింగ్, క్రిప్టో కరెన్సీ .. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల సహాయంతో ఇంటర్నెట్‌లో గుర్తుతెలియని విధంగా పనిచేస్తాయి. వారి యాప్‌లలో పెట్టుబడులు పెట్టడానికి సగటు మధ్యతరగతిని ప్రలోభ పెట్టడానికి ఖరీదైన మార్కెటింగ్ ప్రచారాలను ప్రారంభించాయి.
- ఆపిల్ స్టోర్ లేదా ప్లే స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేయని యాప్‌లు చాలా వరకు చట్టబద్ధమైనవి కావు. వీటి ఉద్ధృతికి అడ్డుకట్ట వేయాలంటే మన దేశంలో చట్టబద్ధత తీసుకురావాల్సిన అవసరం ఉంది. అందుకు పట్టే సమయం ఎంతో తెలియదు కాబట్టి మనమే జాగ్రత్త వహించడం ముఖ్యం.


ప్రతీకాత్మక చిత్రం

## సోషల్ మీడియాను ప్రభావితం చేసేవారు..

- నకిలీ ఉత్పత్తులు/సేవలు/ యాప్‌లు అందించే డబ్బును చూసి ఆశపడవద్దు. వాటి వల్ల మీపైన కూడా యూజర్లకు నమ్మకం పోయే అవకాశం ఉంది.
- ఉత్పత్తులకు సంబంధించిన సమాచారాన్ని ముందుగా గూగుల్‌లో శోధించండి. చట్టబద్ధమైన సమాచారం ఉందో లేదో రివ్యూలు చదివి నిర్ధారించండి.
- మీ ఫోన్ నెంబర్ లేదా చిరునామాను సోషల్ మీడియాలో ఉంచవద్దు. ఎందుకంటే వీటిని వ్యాపార ఉపయోగాల కోసం ఇతరులు సేకరించే అవకాశం ఉంది.
- యాప్‌లకు ఇచ్చిన యాక్సెస్‌ను ఒకటికి పదిసార్లు చెక్ చేసి గాని నిర్ధారణకు రాకండి.
- ఫోన్‌లో అవసరమైన ప్రైవసీ సెట్టింగ్స్‌ను సెట్ చేయండి. అందుకు.. ఫోన్‌లో జీపీఎస్, బ్లూ టూత్, పాస్‌వర్డ్‌లు, పిన్‌లను సెట్ చేయండి.
- నమ్మకమైన ప్రొవైడర్ల నుండి మాత్రమే కావల్సినవాటిని డౌన్‌లోడ్ చేసుకోండి.
- అన్ని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పరస్పర చర్యల కోసం సమ్మతిని ఒకే విధంగా పరిగణించాలి.
- మీ వ్యక్తిగత జీవితాన్ని సురక్షితంగా ఉంచుకోవడానికి ట్రోలింగ్‌కి ఆస్కారమిచ్చే వ్యక్తిగత కథనాలు, అభిప్రాయాల వ్యక్తీకరణలు, ఫొటోలు/వీడియోల ... వంటివి పోస్ట్ చేసేటప్పుడు జాగ్రత్తపడటం మంచిది.
- అన్ని ఫొటోలపై వాటర్‌మార్క్‌లను ఉపయోగించండి.
- హద్దులను సృష్టించుకోండి. అంటే, భవిష్యత్తులో మిమ్మల్ని ఇబ్బంది పెట్టే వ్యక్తిగత కథనాల జోలికి వెళ్లకండి.
- ఎదుటివారి మనోభావాలను దెబ్బతీసేలా పోస్ట్ చేయవద్దు.
- జాత్యాహంకార, రాజకీయ, మతపరమైన వ్యాఖ్యాలను నివారించడం మంచిది.
- మీ డేటాను రక్షించుకోవడం ముఖ్యం. మాల్వేర్, ట్రాకర్లను నిరోధించే పెయిడ్ టూల్స్‌ను ఉపయోగించండి.
- పాస్‌వర్డ్‌లు, ఇమెయిల్, నగదు చెల్లింపులను రక్షించడానికి రెండు రకాల ప్రామాణీకతను పాటించాలి.
- ఫాలోవర్లను ఆకట్టుకోవడానికి నకిలీ సమీక్షలు, కామెంట్స్, లైక్స్‌ను కొనుగోలు చేయకూడదు.

## గుర్తించడం ఇలా?

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాంటెంపరరీ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్ చేసిన సర్వే ప్రకారం 50 శాతం ఫాలోవర్లు నకిలీలే అని తేలింది. చాలా మంది ప్రముఖ బాలీవుడ్ నటులు, నటీమణులు, ర్యాపర్లను కూడా నకిలీ ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మోసగాళ్లు వాడుకుంటున్నారు.

- పోస్టింగ్‌కు ఉన్న ఫాలోవర్ల ట్రెండ్‌ను చూడాలి.
- ఇన్‌ఫ్లుయెన్సర్లు తరచూ చేసే పోస్టింగ్‌లపై దృష్టి పెట్టండి. ఫాలోవర్స్ ఎక్కువ, పోస్ట్‌లు తక్కువ ఉంటే అవి రెడ్ ఫ్లాగ్స్ అని గుర్తించాలి.
- కొన్ని నకిలీ ఇన్‌ఫ్లుయెన్సర్ల అకౌంట్స్ చూస్తే ఒకే విధమైన కామెంట్స్, ఒకే విధమైన ఫాలోవర్లు ఉంటారు.
- ఇన్‌ఫ్లుయెన్సర్ల మానిటరింగ్ టూల్స్ అంటే కూపన్‌కోడ్‌లు, లింక్, బయో డిస్క్రిప్షన్‌లు... మొదలైనవి పర్యవేక్షించడం ద్వారా మోసపూరితమైన వాటిని కనిపెట్టవచ్చు.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 70

గురువారం 1-6-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



**పదేళ్లలో భారత్‌లో ఎంతో మార్పు**

అంతర్జాతీయంగా స్థానం బలోపేతం

మోర్గాన్ స్టాన్లీ సానుకూల నివేదిక -11లో



**'విచారణ కొనసాగుతోంది'**

బ్రిజ్‌భూషణ్ కేసుపై త్వరలోనే కోర్టుకు నివేదిక ఇస్తామని పోలీసుల వెల్లడి -10లో



**మోదీ మిడిసిపడుతున్నారు!**

దేవుడికంటే తమకే ఎక్కువ తెలుసని మోదీ మిడిసిపడుతున్నారని ప్రధానిపై రాహుల్ గాంధీ మరోసారి నిప్పులు చెరిగారు.

- వివరాలు 6లో




**ఓటీటీలోనూ 'పొగాకు' హెచ్చరికలు**

ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో కూడా పొగాకు వ్యతిరేక హెచ్చరికలు, ప్రకటనల ప్రసారాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది.

- వివరాలు 6లో




**మూడు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు**

నిషేధిత పీఎఫ్ఐ కుట్రలపై దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ అధికారులు బుధవారం బిహార్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో సోదాలు జరిపారు.

- వివరాలు 6లో



**కూతుర్ని పాతికసార్లు పొడిచి...**

కూతురి పెళ్లి విషయమై భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి కూతురిపైనా దాడికి దిగాడు. ఏకంగా 25 సార్లు పొడిచి పొట్టన పెట్టుకున్నాడు.

- వివరాలు 6లో

# ధూపదీప నైవేద్య భృతి రూ.4వేలు పెంపు



బ్రాహ్మణ సదనాన్ని ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో స్వరూపానందేంద్ర

- రూ.6వేల నుంచి 10వేలకు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటన
- కొత్తగా 2,796 దేవాలయాలకూ వర్తింపు
- అనువంశిక అర్చకుల సమస్యలకు త్వరలో పరిష్కారం
- వేద పండితుల భృతి రూ. 5 వేలకు పెంపు
- కొల్చారంలో సంస్కృత విశ్వవిద్యాలయం
- బ్రాహ్మణ సదనం ప్రారంభోత్సవంలో సీఎం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో బ్రాహ్మణులపై సీఎం కేసీఆర్ వరాల జల్లు కురిపించారు. ఆలనాపాలనా లేని ఆలయాల్లో నిత్య పూజల కోసం ధూపదీప నైవేద్య పథకం కింద అర్చకులకు నెలకు రూ.6 వేల చొప్పున ఇస్తున్న భృతిని రూ.10 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 3,645 దేవాలయాలకు వర్తిస్తున్న ధూపదీప నైవేద్య పథకాన్ని మరో 2,796 ఆలయాలకూ వర్తింపచేయనున్నట్టు చెప్పారు. గోపనపల్లిలో 9 ఎకరాల్లో రూ.12 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించిన విప్రహిత బ్రాహ్మణ సదనాన్ని కేసీఆర్ పలువురు పీఠాధిపతుల సమక్షంలో బుధవారం ఉదయం ప్రారంభించారు. అనంతరం ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగిస్తూ.. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కొన్ని అంశాలను పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. అనువంశిక అర్చకుల విధానాన్ని పునరుద్ధరించాలంటూ కొన్నేళ్లుగా అర్చక కుటుంబాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో దీనిపై కేబినేట్‌లో చర్చించి త్వరలో పరిష్కరించనున్నట్టు హామీ ఇచ్చారు. వేద పాఠశాలల నిర్వహణకు ఇస్తున్న రూ.2 లక్షలను ఇకనుంచి వార్షిక గ్రాంటుగా ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఐటీఎం, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో చదివే బ్రాహ్మణ విద్యార్థులకు

మిగతా 2వ పేజీలో ▶

# క్వింటాల్ పత్తి రూ.8 వేలు!

**ఖరీఫ్ పంటల మార్కెట్ ధరలపై ముందస్తు అంచనాలు**

గత కొన్నేళ్ల ధరలు విశ్లేషించిన వ్యవసాయ మార్కెట్ ఇంటిలిజెన్స్ కేంద్రం

వరి, కంది ఇతర ప్రధాన పంటల ధరలూ ప్రకటన

గ్రేడ్ ఏ రకం వరి క్వింటాల్ రూ.2,460..

మిర్చి క్వింటాల్ కనీసం రూ.20,000

ఈ ధరలను బట్టి రైతులు పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలి

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం సూచన



**సాక్షి, హైదరాబాద్:** వానాకాలం సీజన్ ప్రారంభమవుతోంది. త్వరలో రాష్ట్రానికి రుతుపవనాలు రానున్నాయి. రైతులు సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో విత్తనాలు కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే ఈ సీజన్‌లో ఏ పంటలు వేయాలన్న దానిపై రైతుల్లో కొంత గందరగోళం నెలకొంది. కొందరు అవగాహన లేకపోవడం వల్ల ఏదో ఒక పంట వేసి నష్టపోతుంటారు. కొందరు సరైన అవగాహన, ప్రణాళికతో మంచి లాభాలు పొందుతుంటారు. కోతలు ముగిసే సమయానికి ఏ పంటకు ఎంత ధర ఉండే అవకాశం ఉందో ముందుగా అంచనా వేయగలిగితే.. రైతులు ఆ ప్రకారం పంటలు సాగు చేసుకునే వీలుంది. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ మార్కెట్ ఇంటిలిజెన్స్ కేంద్రం రంగంలోకి దిగింది. రాష్ట్రంలోని ప్రధాన మార్కెట్లలో


మిగతా 5వ పేజీలో ▶

# చెప్పుడు మాటలతో దర్యాప్తా?

ఎంపీ అవినాశ్‌రెడ్డి ప్రమేయంపై ఆధారాలేవి?

రెండేళ్లుగా దర్యాప్తు చేస్తున్నారు... ఇంకా ఆరోపణలేనా?

సీబీఐ దర్యాప్తు తీరుపై తెలంగాణ హైకోర్టు ప్రశ్నల వర్షం



- ఎవరో ఏదో అనుకుంటున్నారని... అదే సాక్ష్యమంటే ఎలా?
- అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఏం చెప్పారో.. అదే దర్యాప్తా?
- హత్య వెనక రాజకీయ కోణం ఉందనటానికి ఆధారాలేవి?
- సాక్ష్యాల ధ్వంసంలో అవినాశ్ పాత్ర ఉందని ఎలా చెబుతారు?
- ఆయన విచారణకు హాజరవుతూనే ఉన్నారుగా? కస్టడీ ఎందుకు?
- అవినాశ్ రెడ్డి కస్టోడియల్ విచారణ అవసరం లేదని స్పష్టీకరణ
- షరతులతో కూడిన ముందస్తు బెయిలు మంజూరు

3లో

**ఇది మొత్తం న్యాయ వ్యవస్థను దెబ్బతీసే కుట్ర**

- ఆ చానెళ్ల కామెంట్లతో కలత చెందా.. ఏబీఎన్, మహాటీవీ వీడియోలను సేకరించండి
- తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్‌కు జస్టిస్ లక్ష్మణ్ ఆదేశం
- చర్యలపై తెలంగాణ హైకోర్టు సీజే నిర్ణయిస్తారన్న న్యాయమూర్తి - 3లో

## న్యూస్‌రీల్

**కాళేశ్వరం పంప్‌హౌస్‌లు ఎందుకు మునిగాయి?**



కాళేశ్వరం ఎత్తిపోతలు మునకపై కాగ్ మరింత దృష్టి పెట్టింది. మేడిగడ్డ, అన్నారం పంప్ హౌస్‌ల ముంపు, ప్రాజెక్టు నిర్మాణంలో తప్పిదాలకు సంబంధించి రాష్ట్ర పభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించినట్టు తెలిసింది.

- వివరాలు 5లో

**మిక్స్‌డ్ వెదర్‌తో డేంజర్!**



అటు వేడి, ఇటు చల్లదనం వంటి మధ్యస్థ వాతావరణంలో బ్యాక్టీరియా, వైరస్‌లు యాక్టివ్‌గా ఉంటాయి. మన శరీరాలు కూడా ఈ వాతావరణానికి అలవాటు పడటానికి కొంత సమయం తీసుకుంటాయి. అలాంటి సమయంలోనే వైరస్‌లు దాడిచేస్తాయి.

- వివరాలు 2లో

**మాస్ కాపీయింగ్‌తో రూ.కోటి**



టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజ్‌తోపాటు హైటెక్ మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన నీటిపారుదల శాఖ పెద్దపల్లి ఏఈ పూల రమేష్ విచారణలో కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. హైటెక్ మాస్ కాపీయింగ్ ద్వారా ఇతడు కోటిపైగా ఆర్జించినట్లు 'సిట్' తేల్చింది.

- వివరాలు 12లో

**6న శైలజా కిరణ్‌ను విచారించనున్న సీఐడీ**



మార్గదర్శి ఆర్థిక అక్రమాల కేసులో ఆ సంస్థ ఎండీ శైలజా కిరణ్‌కు సీఐడీ మరోసారి నోటీసులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే ఆ నోటీసులపై సీఐడీకి ఆమె ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

- వివరాలు 3లో





# కేంద్రం ఆధ్వర్యంలో ఆవిర్భావ ఉత్సవాలు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- రాష్ట్రంలో 'కల్వకుంట్ల' వ్యతిరేక ఓట్లు చీల్చేందుకు కాంగ్రెస్–బీఆర్ఎస్ కుట్ర
- బీజేపీ నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ



**సాక్షి, న్యూఢిల్లీ:** గతేడాది తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఢిల్లీలో నిర్వహించామని, ఈసారి గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహిస్తున్నామని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. రేపు గోల్కొండ కోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడంతోపాటు సాయుధ బలగాల పరేడ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో శంకర్ మహదేవన్, డాక్టర్ ఆనంద శంకర్ బృందం, మంజులా రామస్వామి బృందం ప్రదర్శనలు ఉంటాయన్నారు అలాగే, మంగ్లీ, మధుప్రియలు తెలంగాణ సంప్రదాయాన్ని, ఉద్యమాన్ని ప్రతిబింబించే పాటలు పాడతారని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాజ్‌భవన్లలోనూ తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు. బుధవారం ఢిల్లీలోని తన నివాసంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

**కుటుంబపాలనకు చరమగీతం**

రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ వ్యతిరేక ఓట్లు చీల్చేందుకు కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ బలపడితే తమకు నష్టమని బీఆర్ఎస్ భావిస్తోందన్నారు. అయితే, అవినీతి, నియంతృత్వ, కుటుంబపాలనకు

మిగతా 2వ పేజీలో ▶



**రెండో వారంలో రాష్ట్రానికి నైరుతి రాక!**

- రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు కాస్త ఆలస్యంగా ప్రవేశించనున్నట్లు వాతావరణ శాఖ అంచనావేస్తోంది. గత రెండు సీజన్లతో పోలిస్తే ప్రస్తుతం పది నుంచి పదిహేను రోజులు ఆలస్యంగా వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రాథమికంగా విశ్లేషిస్తోంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈనెల రెండో వారంలో రాష్ట్రాన్ని నైరుతి రుతుపవనాలు తాకనున్నాయి.

- వివరాలు 2లో



**నెలాఖరులో మోదీ మెగా ర్యాలీ?**

- బీజేపీ తొమ్మిదేళ్లలో సాధించిన విజయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఆ పార్టీ నిర్వహిస్తోన్న 'మహా జన సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ తెలంగాణలోనూ పర్యటించే అవకాశాలున్నాయి. తెలంగాణతో పాటు రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాలలో మోదీ ర్యాలీలు ఉంటాయని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి.

- వివరాలు 3లో

# నయా 'అసెంబ్లీ'పై నజర్

**అనువైన స్థలాల అన్వేషణలో నిమగ్నమైన అధికార యంత్రాంగం**

- పరిశీలనలో న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రాంగణం, పాటిగడ్డ స్థలం
- న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ స్థలంలో హెచ్‌ఓడీల ట్విన్ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి మొగ్గు
- 'ఆదర్శనగర్' కొత్త అసెంబ్లీ భవనానికి బాగుంటుందనే అభిప్రాయం

- వివరాలు 5లో



## క్లుప్తంగా...

### అల్లూరి జయంతి వేడుకలకు రాష్ట్రపతి ముర్ము



సాక్షి, హైదరాబాద్: జూలై 4న హైదరాబాద్‌లో జరిగే అల్లూరి సీతారామరాజు 125 జయంతి ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరుకానున్నారని క్షత్రియ సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేరిచర్ల నాగరాజు, నడింపల్లి నాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### రాజ్‌భవన్‌లో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను రాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నిర్ణయించారు. జూన్ 2న ఉదయం 9 గంటలకు రాజ్‌భవన్‌లో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొలుత స్వాతంత్ర్య సమరయోధులను గవర్నర్ ఘనంగా సత్కరించనున్నారు. అనంతరం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఓపెన్ హౌజ్ నిర్వహించి దర్బార్ హాల్‌లో సామాన్య ప్రజలతో శుభాకాంక్షలను ఇచ్చిపుచ్చుకోనున్నారు.

### ఈడీ కక్షపూరితంగా వ్యవహరిస్తోంది: అంజన్



సాక్షి, న్యూఢిల్లీ: యంగ్ ఇండియాకు విరాళాలు ఇచ్చిన కేసులో తాను ఎలాంటి తప్పు చేయలేదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. విచారణ పేరుతో బడుగు బలహీన వర్గాలపై ఈడీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈడీ నోటీసులు జారీ చేయడంతో బుధవారం అంజన్‌కుమార్ యాదవ్ ఢిల్లీలో ఈడీ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెండు గంటల పాటు జరిగిన విచారణలో ఈడీ అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు అంజన్‌కుమార్ యాదవ్ వివరణ ఇచ్చారు. అనంతరం అంజన్‌కుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ...యంగ్ ఇండియా సంస్థ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందనే స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చానన్నారు. అంతేగాక నేషనల్ హెరాల్డ్ కేసులో కక్షసాధింపు చర్యలో భాగంగానే ఈడీ కాంగ్రెస్ నేతలను విచారిస్తోందని అసహనం వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా సంస్థకు రూ.20 లక్షలు విరాళం ఇచ్చానని, తన వద్ద అన్ని లెక్కలు ఉన్నాయని తెలిపారు. తాను గతంలో ఎంపీగా పనిచేశానని, తనకు పెన్షన్ కూడా వస్తోందన్న విషయాన్ని ఈడీ అధికారులకు గుర్తు చేశానని చెప్పారు.

### ప్రతి ఏటా సీఎం కప్
మంత్రి శ్రీనివాస్‌గౌడ్



గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో సీఎం కప్ ఎంతో చైతన్యాన్ని నింపిందని, ఇక నుంచి ప్రతి ఏటా సీఎం కప్ క్రీడా సంబరాలను నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా జరుగుతున్న సీఎం కప్ వేడుకలు బుధవారం ఎల్బీస్టేడియంలో ముగిశాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...సీఎం కప్ పోటీలు యువతను ఛాంపియన్లుగా మలిచాయని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా 50 వేలకు పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, వచ్చే ఏడాది నుంచి సీఎం కప్‌లో క్రికెట్‌ను కూడా భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, అసలైన క్రీడాకారులకు గుర్తింపు రావడం లేదన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు.

## కేంద్రం ఆధ్వర్యంలో ఆవిర్భావ ఉత్సవాలు

▶ మొదటి పేజీ తరువాయి

చరమగీతం పాడాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. తెలంగాణలో బీజేపీ నేతల మధ్య విభేదాల్లేవని, కొందరు ఉద్దేశపూర్వకంగానే ఈ వివాదాలను సృష్టిస్తున్నారన్నారు. బీజేపీలో చేరిన నాయకులు బీజేపీలోనే ఉంటారని, పార్టీ కోసమే రోజూ పోరాడుతున్నారని స్పష్టత ఇచ్చారు. రాబోయే రోజుల్లో అనేక మంది నాయకులు తమ పార్టీలో చేరనున్నారని చెప్పారు. తొమ్మిదేళ్లలో తెలంగాణకు కేంద్రం అందించిన సహకారాన్ని వివరిస్తూ త్వరలోనే ప్రజలముందు ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగానే నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుందని.. ఈ విషయంలో విభేదాలకు తావిచ్చేలా, ప్రజలను రెచ్చగొట్టేలా ఎవరూ వ్యాఖ్యానించవద్దన్నారు. దక్షిణ భారతం-ఉత్తర భారతం అంటూ విభేదాలను ప్రోత్సహించేందుకు పనిచేస్తున్న వారికి.. కేంద్ర ప్రభుత్వం 'ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్'పేరుతో చేపడుతున్న కార్యక్రమాలు కనిపించడం లేదా? అని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. కాగా, కొత్త పార్లమెంటు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతిష్టించిన పవిత్ర రాజదండం 'సెంగోల్' రూపకల్పనలో కీలకంగా వ్యవహరించిన తమిళనాడులోని తిరువడుత్తురై ఆదీనానికి ప్రస్తుత పీఠాధిపతి శ్రీ అంబలవాన పండారా సన్నిధి స్వామి కిషన్‌రెడ్డిని కలిసి ఆశీర్వదించారు.



# మిక్స్‌డ్ వెదర్‌తో మహా డేంజర్!

- ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు వర్షాలతో మారిపోతున్న వాతావరణం
- ఇన్ఫెక్షన్లు సోకేందుకు, వైరస్‌ల వ్యాప్తికి అనుకూల పరిస్థితులు
- సీజనల్ వేరియేషన్స్‌తో పొంచి ఉన్న అనారోగ్య సమస్యలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం వేసవి కాలం చివరి రోజుల్లో ఎండలు దంచికొడుతున్నాయి. రాష్ట్రమంతా ఉదయం నుంచే 40 నుంచి 45 డిగ్రీల ఎండలు హీటెక్కిస్తున్నాయి. వడగాడ్పులతోపాటు అప్పుడప్పుడు సాయంత్రం అకస్మాత్తుగా గాలివాన కురియడంతో వాతావరణం చల్లబడుతోంది. అదీగాక వేసవి సీజన్ ముగిసిపోతుండటంతో ఎండలు చండప్రచండంగా మారుతున్నాయి. త్వరలోనే రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించవచ్చని వాతావరణ శాఖ నివేదికలున్నా.. ప్రతీ ఏడాది ఇవి ఆలస్యంగానే వస్తున్నాయి. అందువల్ల మరికొన్ని రోజుల పాటు ఇలాంటి 'మిక్స్‌డ్ వెదర్'తోనే ప్రజలు నెట్టుకురాక తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి వాతావరణంలో బ్యాక్టీరియాలు, వైరస్‌లు చురుగ్గా ఉండి దాడి చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. అందువల్ల ప్రజలు జాగ్రత్తగా మసలుకుని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని సూచిస్తున్నారు.

### వ్యాధినిరోధక శక్తి పెంచుకోవాలి

అటు వేడి, ఇటు చల్లదనం వంటి మధ్యస్థ వాతావరణంలో బ్యాక్టీరియా, వైరస్‌లు యాక్టివ్‌గా ఉంటాయి. మన శరీరాలు కూడా అటు వేడికి, ఇటు చల్లటి వాతావరణానికి అలవాటు పడటానికి కొంత సమయం తీసుకుంటుంది. అలాంటి సమయం కోసం వైరస్‌లు, బ్యాక్టీరియాలు వేచిచూసి దాడిచేస్తాయి. టైఫాయిడ్, సీజనల్ జ్వరాలు, గొంతు సంబంధిత ఇన్ఫెక్షన్లు, ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌ల వంటివి వచ్చే అవకాశాలు అధికమవుతాయి. ఇలాంటి వాటికి ఆహారాన్నే ఔషధంగా మార్చుకుని తిప్పికొట్టాలి. ఫ్రైడ్ పదార్థాలు, జంక్‌ఫుడ్ వంటివి మానేయాలి. అప్పటికప్పుడు వేడిగా తయారుచేసిన ఆహారపదార్థాలు తీసుకోవాలి. వేడి చేసి చల్లార్చిన నీరు లేదా పరిశుభ్రమైన నీటిని తాగాలి. తేలికపాటి వ్యాయామం చేయాలి. ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడే వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవాలి.



డా.ప్రభుకుమార్ చల్లగాలి, జనరల్ ఫిజిషియన్, లైఫ్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్స్



డా.హరికిషన్ గోనుగుంట్ల, చీఫ్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, యశోద ఆసుపత్రి

### నీటిని ఎక్కువగా తాగాలి

తీవ్ర ఎండ వేడిమి నుంచి చల్లటి వాతావరణానికి మారినపుడు అనేక జబ్బులు వ్యాపిస్తాయి. ఇంకా తీవ్రమైన ఎండలు కొనసాగుతున్నందున వడదెబ్బ తగులకుండా, డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువగా నీటిని తాగడంతోపాటు సహజమైన పళ్లరసాలు వంటివి తీసుకోవాలి. దోమలు, ఎలుకలు వంటి వాటి ద్వారా నీరు.. గాలి ద్వారా ఇన్ఫెక్షన్లు, వైరస్‌లు వ్యాప్తి చెందుతాయి. డెంగీ, మలేరియా వంటి తీవ్ర అనారోగ్య సమస్యలు పెరుగుతాయి. బ్యాక్టీరియల్, ఫంగల్, వైరల్ ఇన్ఫెక్షన్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం నీటిలో తడిచిన ప్రతీసారి ఫ్రెష్‌గా స్నానం చేయాలి. ఏడాదికోసారి ఫ్లూవ్యాక్సిన్‌ను తప్పనిసరిగా తీసుకోవాలి.

## డిస్కంలలో 'ఆర్ఈసీ' డైరెక్టర్లు!

- ఒక్కో డిస్కంలో ఇద్దరేసి చొప్పున నియామకం
- రాష్ట్ర ఇంధన శాఖ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్/ టీఎస్ఎన్పీడీసీఎల్)ల్లో ..రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ)కి సంబంధించిన చెరో ఇద్దరు ప్రతినిధులను నాన్ హోల్ టైమ్ డైరెక్టర్లుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్బీఐ కొత్త మార్గదర్శకాల ప్రకారం .. రుణాలు అందించిన ఆర్థిక సంస్థల ప్రతినిధులను విద్యుత్ సంస్థల్లో నాన్ హోల్ టైమ్ డైరెక్టర్లుగా నియమించాల్సి ఉంటుంది. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావుతో ఈ ప్రతిపాదనలపై చర్చించిన అనంతరం సీఎం కేసీఆర్ వీరి నియామకంపై నిర్ణయం తీసుకున్నారు. ఇకపై జరగనున్న డిస్కంల బోర్డు సమావేశంలో ఆర్ఈసీ ప్రతినిధులు సైతం డైరెక్టర్ల హోదాలో పాల్గొననున్నారు.

**యాదాద్రి ప్లాంట్‌కి మళ్లీ ఆర్ఈసీ రుణాలు బంద్**

నల్లగొండ జిల్లా దామరచర్లలో తెలంగాణ జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి మళ్లీ ఆర్ఈసీ నుంచి రుణాలు నిలిచిపోయాయి. రుణాలపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో ఆర్ఈసీ రుణాలను నిలుపుదల చేసింది.

## నిలిచిపోయిన రవాణా శాఖ రిజిస్ట్రేషన్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా రవాణాశాఖ కార్యాలయాల్లో బుధవారం నాలుగు గంటల పాటు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ద్విచక్రవాహనాలు, కార్లకు సంబంధించి ఈ సమస్య తలెత్తింది. రెండో వాహనం వివరాలను చెక్ చేసే సర్వర్‌కు సంబంధించి సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో అనివార్యంగా రిజిస్ట్రేషన్లను కూడా నిలిపేయాల్సి వచ్చింది. దాదాపు నాలుగు గంటల పాటు సమస్య పరిష్కారం కాకపోవటంతో వాహనదారులు ఆందోళనకు దిగారు. ఆఫ్‌లైన్ ద్వారా అయినా రిజిస్ట్రేషన్లు కొనసాగించాలని కోరారు. కాగా, సాయంత్రం సమస్యను పరిష్కరించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునరుద్ధరించారు.

# ధూపదీప నైవేద్య భృతి రూ.4 వేలు పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పారు. ప్రస్తుతం బ్రాహ్మణ పరిషత్ ద్వారా వేద పండితులకు ప్రతి నెలా ఇస్తున్న గౌరవ భృతిని రూ.2,500 నుంచి రూ.5,000కు పెంచుతున్నట్లు ప్రకటించారు. అలాగే, ఈ భృతిని పొందే అర్హత వయసును 75 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు తగ్గిస్తున్నట్లు చెప్పారు. తన సంజీవని వ్యాఖ్యతో మహాకవి కాళిదాసు సాహిత్య ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహామహోపాధ్యాయ కోలాచల మల్లినాథ సూరి పేరున ఆయన స్వస్థలమైన మెదక్ జిల్లాలోని కొల్చారంలో సంస్కృత విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించనున్నట్టు ప్రకటించారు.

**సర్వజన సమాదరణ**

'లోకా సమస్తా సుఖినోభవన్తు అన్నది బ్రాహ్మణుల నోట పలికే జీవనాదర్శం. సర్వజన సమాదరణ అన్నది తెలంగాణ ప్రభుత్వ విధానం, పేదరికం ఎవరి జీవితాల్లో ఉన్నా వారిని ఆదుకోవాలనే మానవీయ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. కులానికి పెద్దలైనా బ్రాహ్మణుల్లో ఎంతోమంది పేదలున్నారు. వారిని ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యతగా భావించింది. అందుకే 2017లో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను ఏర్పాటు చేసింది. ఏడాదికి రూ.వంద కోట్ల నిధులను దానికి కేటాయిస్తున్నాం. ఈ నిధులతో వివిధ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. పేద బ్రాహ్మణుల జీవనోపాధి నిమిత్తం బెస్ట్ (బ్రాహ్మణ ఎంపవర్‌మెంట్ స్కీం ఆఫ్ తెలంగాణ స్టేట్) పథకం కింద రూ.5 లక్షల చొప్పున పెట్టుబడి సాయంగా ప్రభుత్వం ఇప్పటివరకు రూ.150 కోట్లను వెచ్చించింది' అని సీఎం కేసీఆర్ వెల్లడించారు. సనాతన సంస్కృతి కేంద్రంగా 'బ్రాహ్మణ సదనం'ను నిర్మించిన తొలి రాష్ట్రం తెలంగాణనే అని పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చే పీఠాధిపతులు, ధర్మాచార్యుల విడిది కేంద్రంగా, పేద బ్రాహ్మణ వివాహాలకు ఉచిత కల్యాణ వేదికగా, కులాలతో ప్రమేయం లేకుండా పేదలు తమ ఇంట్లో శుభాశుభ కార్యక్రమాలకు పురోహితులను ఉచితంగా పంపే సేవాకేంద్రంగా విలసిల్లాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. వివిధ క్రతువులు, ఆలయ నిర్మాణాలు, ఆగమశాస్త్ర నియమాలు, దేవతా ప్రతిష్టలు వివిధ వ్రతాలకు సంబంధించిన పుస్తకాలతో సమగ్రమైన లైబ్రరీ ఈ సదనంలో ఏర్పాటు చేయాలని కోరారు. వైదిక కార్యక్రమాలకు సంబంధించిన అరుదైన పుస్తకాలు, డిజిటల్ వీడియోలు అందులో ఉంచాలన్నారు. సూర్యాపేటలో డాక్టర్ ఎ.రామయ్య ఇచ్చిన ఎకరం స్థలంలో నిర్మించిన బ్రాహ్మణ పరిషత్ భవనాన్ని త్వరలో ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. ఖమ్మం, మధిర, బీచుపల్లి ప్రాంతాల్లోనూ బ్రాహ్మణ భవనాలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. బ్రాహ్మణ సదనం ప్రారంభం సందర్భంగా శృంగేరీ పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతీ స్వామి, కంచికామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆడియో సందేశ రూపంలో ఆశీర్వదించారంటూ వారితోపాటు ప్రత్యక్షంగా విచ్చేసిన ఇతర పీఠాధిపతులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

**ధర్మస్య జయోస్తు!**
**అధర్మస్య నాశోస్తు**
**ప్రాణిషు సద్భావనాస్తు**
**విశ్వస్య కళ్యాణమస్తు..**

ఓం శాంతి.. శాంతి.. శాంతిః అన్న శ్లోకంతో సీఎం ప్రసంగాన్ని ముగించారు.



పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి సబిత, సీఎస్ శాంతికుమారి, స్వరూపానందేంద్ర స్వామి తదితరులు

### యాగంలో పాల్గొన్న సీఎం

బుధవారం ఉదయం తొలుత సదనానికి చేరుకున్న సీఎం కేసీఆర్ నేరుగా యాగశాలకు వచ్చి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతుల ఆశీర్వాదం తీసుకున్నారు. సీఎంకు శంఖనాదం, వేద పఠనం మధ్య వారు తలపాగా, శాలువాలతో ఆశీర్వదించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అఖిల భారత బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులను పలకరించారు. ప్రాంగణంలో కొనసాగుతున్న చండీయాగం, సుదర్శనయాగం పూర్ణాహుతిలో పాల్గొన్నారు. తర్వాత వాస్తుపూజ నిర్వహించారు. బ్రాహ్మణ సదనం శిలాఫలకాన్ని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి ఆవిష్కరించగా సీఎం పాల్గొన్నారు. ఆ తర్వాత భవన ప్రారంభానికి సూచికగా కేసీఆర్ రిబ్బన్ కత్తిరించి లోనికి వెళ్లి పరిశీలించారు. సభాస్థలిలో పీఠాధిపతులను సత్కరించి వారికి పాదాభివందనం చేశారు. పుష్పగిరి పీఠం విద్యానృసింహ భారతీస్వామి, మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠం సుభుధేంద్ర తీర్థస్వామి, మదనానంద సరస్వతీ పీఠం మాధవానంద స్వామి, హంపీ విరూపాక్ష పీఠం విద్యారణ్య భారతీ స్వామి, ధర్మపురి పీఠం సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి, సీతారాంబాగ్ జగన్నాథ మఠం వ్రతధర రామానుజ జీయర్ స్వామి హాజరయ్యారు. కార్యక్రమంలో మంత్రి సబిత, ఎంపీలు సంతోష్ కుమార్, రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా, వాణీదేవి, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, సతీశ్, బాల్క సుమన్, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జస్టిస్ భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

### విశాఖ శ్రీశారదా పీఠాధిపతితో సీఎం కేసీఆర్ భేటీ

మియాపూర్ (హైదరాబాద్): ముఖ్యమంత్రి కేసీఆర్ విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీతో సమావేశమయ్యారు. బుధవారం ఉదయం గోపన్‌పల్లిలో స్వామీజీలతో కలసి బ్రాహ్మణ సేవా సదన్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి కేసీఆర్, మరోసారి ప్రత్యేకంగా స్వరూపానందేంద్ర స్వామి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతిని కలిసేందుకు చందానగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి వచ్చారు. మధ్యాహ్నం 3.45 గంటలకు ఆలయానికి చేరుకొని స్వామీజీతో ఆధ్యాత్మిక అంశాలపై చర్చించినట్లు సమాచారం. స్వరూపానందేంద్ర స్వామీజీ, సీఎం కేసీఆర్‌కు ఆశీస్సులతోపాటు వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందజేశారు. కేసీఆర్ చందానగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయానికి రావడం.. స్వామీజీతో సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎంపీ సంతోష్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వరూపానందేంద్ర స్వామితో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



బుధవారం శంషాబాద్‌లోని జేడీ కన్వెన్షన్స్‌లో జరిగిన జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి కుమారుడు అభిలాష్ రెడ్డి వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి కేసీఆర్

## జూన్ రెండో వారంలో రాష్ట్రానికి నైరుతి రాక!

- వచ్చే వారంలో కేరళను తాకనున్న రుతుపవనాలు
- ఈసారి సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు కాస్త ఆలస్యంగా ప్రవేశించనున్నట్లు వాతావరణ శాఖ అంచనావేస్తోంది. గత రెండు సీజన్లతో పోలిస్తే ప్రస్తుతం పది నుంచి పదిహేను రోజులు ఆలస్యంగా వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రాథమికంగా విశ్లేషిస్తోంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈనెల రెండో వారంలో రాష్ట్రాన్ని నైరుతి రుతుపవనాలు తాకనున్నాయి. ఈనెల మొదటి వారంలో కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు క్రమంగా ముందుకు సాగుతూ తెలంగాణకు చేరుకునేందుకు వారం రోజుల నుంచి పది రోజుల సమయం పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ సైతం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. గత రెండు సీజన్లలో రుతుపవనాల రాకను పరిశీలిస్తే.. 2021 వర్షాకాలంలో నైరుతి రుతుపవనాలు మే నెలాఖరులో కేరళను తాకగా.. జూన్ మూడో తేదీ నుంచి ఆరో తేదీ మధ్య రాష్ట్రాన్ని తాకాయి. అదేవిధంగా గతేడాది మే 30వ తేదీన కేరళను తాకిన రుతుపవనాలు రాష్ట్రానికి జూన్ 8వ తేదీకి చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి ఐదు రోజులు ఆలస్యంగా రానున్నట్లు వాతావరణ శాఖ అధికారులు భావిస్తున్నారు.

**సాధారణ వర్షపాతం..**

జూన్ ఒకటవ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ మధ్య కాలాన్ని నైరుతి సీజన్(వానాకాలం)గా భావిస్తారు. ఈ క్రమంలో నాలుగు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా సగటున 75.19 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనాలు తయారు చేసింది. అయితే గత రెండేళ్లుగా రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కంటే 50 శాతం అధిక వర్షాలు కురిశాయి. 2021లో రాష్ట్రంలో 111.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, 2022 సీజన్‌లో 109.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే అధిక వర్షాలు నమోదు కావడంతో రాష్ట్రంలో చెరువులు, కుంటలు నీటితో నిండుకుండలుగా మారాయి.

## స్థిరంగా కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

**రెండు రోజులు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు**

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ విదర్భ నుంచి మరాఠ్వాడ, ఉత్తర కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఏర్పడిన ఉపరితలద్రోణి స్థిరంగా కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తు వద్ద ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా చెదురుమదురుగా, కొన్ని చోట్ల మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగానే నమోదు కావచ్చని వివరించింది. కాగా, వివిధ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల సెల్సియస్ నుంచి 42 డిగ్రీల సెల్సియస్ మధ్యన నమోదు కావొచ్చని, గ్రేటర్ హైదరాబాద్ పరిసర జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్ నుంచి 41 డిగ్రీల మధ్యన నమోదు కావచ్చని తెలిపింది. బుధవారం రాష్ట్రంలో సూర్యాపేట జిల్లా కీతవారిగూడెంలో 44.4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది.

**రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు**

| ప్రాంతం | జిల్లా | గరిష్ట ఉష్ణోగ్రత |
|---|---|---|
| కీతవారిగూడెం | సూర్యాపేట | 44.4 |
| దామెరచర్ల | నల్లగొండ | 44.3 |
| ముత్తారం | పెద్దపల్లి | 43.8 |
| మునగాల | సూర్యాపేట | 43.6 |
| సత్తుపల్లె | ఖమ్మం | 43.5 |

**రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)**

| కేంద్రం | గరిష్టం | కనిష్టం | కేంద్రం | గరిష్టం | కనిష్టం |
|---|---|---|---|---|---|
| నల్లగొండ | 41.5 | 22.4 | మహబూబ్‌నగర్ | 40.0 | 26.1 |
| నిజామాబాద్ | 40.9 | 28.3 | రామగుండం | 39.2 | 24.4 |
| భద్రాచలం | 40.8 | 26.0 | హైదరాబాద్ | 38.9 | 25.4 |
| మెదక్ | 40.8 | 24.0 | హకీంపేట్ | 38.5 | 24.9 |
| ఆదిలాబాద్ | 40.3 | 26.2 | దుండిగల్ | 38.0 | 23.1 |
| ఖమ్మం | 40.2 | 25.2 | హనుమకొండ | 38.0 | 23.0 |

## 60% ఉద్యోగులు పాల్గొనాలి!

- రేపు సచివాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం
- జాతీయ జెండా ఆవిష్కరించనున్న సీఎం కేసీఆర్



రాష్ట్ర అవతరణ దినోత్సవం ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎస్ శాంతికుమారి. చిత్రంలో ఐపీఎస్ అధికారి స్వాతి లక్రా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాష్ట్ర సచివాలయంలో నిర్వహించనున్న కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 60 శాతం మంది తప్పనిసరిగా హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశించింది. హెచ్ఓడీల కార్యాలయాల నుంచి ఉద్యోగులను తరలించడానికి ప్రభుత్వం బస్సులను ఏర్పాటు చేస్తోంది. ఉత్సవాల్లో భాగంగా జూన్ 2న ఉదయం 10.30 గంటలకు సీఎం కేసీఆర్ సచివాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో విభాగాధిపతుల కార్యాలయాల్లో ఉదయం 7.30 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించాలని, అనంతరం అక్కడి నుంచి సచివాలయంలో జరిగే కార్యక్రమానికి తరలిరావాలని ప్రభుత్వం ఆదేశించింది. దాదాపు 10 వేల మందికిపైగా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంది.

**సచివాలయంలో ఉత్సవాలపై రిహార్సల్స్..**

తెలంగాణ అవతరణ దినోత్సవంలో భాగంగా నిర్వహించనున్న కార్యక్రమాలపై బుధవారం సచివాలయంలో రిహార్సల్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. రిహార్సల్స్‌లో భాగంగా పోలీసులు కవాతు నిర్వహించారు.

## నేడు హైదరాబాద్‌కు కేటీఆర్

- 20 రోజులపాటు యూకే, యూఎస్‌లో సాగిన పర్యటన
- విదేశీ పర్యటన, దశాబ్ది ఉత్సవాలపై నేడు మీడియాతో భేటీ



సాక్షి, హైదరాబాద్: సుమారు 20 రోజులపాటు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), అమెరికాలో పర్యటించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, కేటీ రామారావు గురువారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఈ నెల 10న యూకే పర్యటనకు వెళ్లిన కేటీఆర్ తిరిగి 15న హైదరాబాద్‌కు వచ్చి ఫాక్స్‌కాన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం 16న అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. సుమారు పది రోజులపాటు పదుల సంఖ్యలో వివిధ కంపెనీలతో కేటీఆర్ నేతృత్వంలోని బృందం సమావేశమైంది. తన పర్యటనలో యూకే, యూఎస్ పర్యటనల్లో భాగంగా లండన్, న్యూయార్క్, వాషింగ్టన్, హ్యూస్టన్, హెండర్సన్, బోస్టన్‌లలో 80కి పైగా సమావేశాల్లో కేటీఆర్ పాల్గొన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, ఐటీ, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, ఏరోస్పేస్, రక్షణ, లైఫ్ సైన్సెస్, మెడికల్ డివైజెస్, డిజిటల్ సొల్యూషన్స్, ఇన్నోవేషన్, డేటా సెంటర్, ఆటోమోటివ్, ఈవీ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ఈ భేటీల్లో చర్చించారు. ఆయా కంపెనీల పెట్టుబడి ప్రకటనలతో 42,000 మందికి రాష్ట్రంలో ప్రత్యక్ష, ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించారు. యూకే, యూఎస్ పర్యటన విశేషాలతోపాటు దశాబ్ది ఉత్సవాల నిర్వహణ, ఇతర అంశాలపై గురువారం మధ్యాహ్నం కేటీఆర్ మీడియాతో భేటీ అవుతారు.

**సమాధానాలు లేకుంటే పరుగెత్తడమే: కేటీఆర్**

'భాగ్ మిల్కా భాగ్' గురించి విన్నా.. కానీ ఇదేంటి 'భాగ్ మంత్రి భాగ్'.. నీ వద్ద సమాధానాలు లేనప్పుడు ప్రజలను, మీడియాను ఎదుర్కోలేవు'అని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. రెజ్లర్ల అంశంపై మీడియా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి పరిగెత్తిన వీడియోను ట్యాగ్ చేస్తూ కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'లైంగిక వేధింపుల కేసులో నిందితుడిగా ఉన్న ఎంపీని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఇంతగా ఆరాటపడుతోంది. బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌సింగ్‌ను ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా రక్షిస్తున్నారు. మరోవైపు రెజ్లర్లు తమ ఒలింపిక్ పతకాలను గంగా నదిలో నిమజ్జనం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇది సిగ్గుపడాల్సిన విషయం'అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## క్లుప్తంగా...

### ప్రజల అభిమతం మేరకే 'పోటీ స్థానాల'పై నిర్ణయం

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక ప్రజల అభిమతం మేరకు పోటీ చేసే స్థానాలపై నిర్ణయం తీసుకుంటామని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయమైన హైదరాబాద్ దారుస్సలాంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని, అక్కడి పార్టీ బాధ్యులతో, స్థానిక పెద్దలతో చర్చిస్తున్నామని, వారి సలహాలు, సూచనల పరిగణలోకి తీసుకొంటామన్నారు. ఎక్కడెక్కడ ఎన్ని స్థానాల్లో పోటీ చేయాల్లో ఎన్నికల సమయంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే వరకు స్థానిక సమస్యలపై దృష్టి సారిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. కొత్త పార్లమెంటు భవనంలోకి హిందూ మతానికి చెందిన వారినే తీసుకెళ్లారని, మోదీ కేవలం హిందువులకు మాత్రమే ప్రధాని కాదని, 130 కోట్ల మంది భారతీయులందరికీ ప్రధాని అని, అన్ని మతాల వారిని పార్లమెంటు లోపలికి తీసుకెళ్తే బాగుండేదని ఒవైసీ అభిప్రాయపడ్డారు. ముస్లింల భద్రతకు సంబంధించి రాహుల్ ప్రకటనపై ఒవైసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ముస్లింల గురించి అడిగితే దళితుల గురించి సమాధానం సరికాదన్నారు.

### మైనారిటీల సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్

ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. టీపీసీసీ మైనారిటీ విభాగం చైర్మన్ షేక్ అబ్దుల్లా సోహైల్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో బుధవారం జరిగిన సమావేశానికి ఏఐసీసీ మైనారిటీ విభాగం చైర్మన్, ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌ఘరి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్రంలో 14% ఉన్న మైనారిటీలకు 2014 నుంచి ఇప్పటివరకు బడ్జెట్‌లో కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కేవలం 0.4 శాతమేనన్నారు. నిరుద్యోగ మైనారిటీ యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైఎస్సార్ టీపీ నాయకురాలు షర్మిల తదితరులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ...తమ పార్టీలోకి ఎవరైనా రావచ్చని, ఎవరు వచ్చినా స్వాగతిస్తామన్నారు.

### బీఆర్ఎస్ అంటే.. 'బరాబర్ రైతు సావుకోరే పార్టీ'

ట్విట్టర్‌లో వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అంటే...'బరాబర్ రైతు సావుకోరే పార్టీ'అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ తొమ్మిదేళ్ల పాలనలో 9 వేలమంది రైతులను బలి తీసుకోవడమే కాకుండా రూ.14 వేల కోట్ల పంట నష్టం జరిగినా రైతులకు రూపాయి ఇచ్చిన పాపాన పోలేదన్నారు. రెండు నెలలైనా ఒడ్లు కొంటలేరని, రైతులు రోడ్లపై పడి ధర్నాలు చేస్తున్నా పాలకుల్లో మాత్రం చలనం రావడం లేదని మండిపడ్డారు. ఐకేపీ సెంటర్ల ముందే ధాన్యాన్ని పారబోసి కాల్చుకుంటుకున్నా కేసీఆర్‌కు చీమ కుట్టినట్లైనా లేదన్నారు. ఇప్పటికైనా కొనుగోలు సెంటర్ల వద్ద పేరుకు పోయిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు.



శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి గంగుల, వినోద్‌కుమార్, కౌశిక్‌రెడ్డి తదితరులు (ఇన్‌సెట్)లో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

# కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం

**అంగరంగ వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం**

కరీంనగర్ కల్చరల్: ముత్యాల తలంబ్రాలు.. మంగళవాయిద్యాలు.. విశేష అలంకరణలు.. వేదపండితులు వేదమంత్రోచ్చరణల మధ్య కరీంనగర్ పద్మనగర్‌లో బుధవారం సాయంత్రం శ్రీనివాసుడి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అంతకు ముందు మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో పద్మావతి అమ్మవారికి పద్మశాలీలు ఊరేగింపుగా సారె తీసుకొచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు శ్రీవారి కల్యాణాన్ని జరిపారు. మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో జరిగిన కల్యాణంలో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ సునీల్ రావు పాల్గొన్నారు.

**వైభవంగా ఆలయ శంకుస్థాపన**

అంతకుముందు ఉదయం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కరీంనగర్ పద్మనగర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి వైభవంగా శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ కరీంనగర్‌లో వెంకన్న ఆలయం నిర్మాణానికి మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, భాస్కర్‌రావు, దామోదర్‌రావు అభ్యర్థన.. సీఎం కేసీఆర్ విజ్ఞాపన మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున రూ.20 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు ఎంపీ దీవకొండ దామోదర్ రావు, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, ఎమ్మెల్సీలు భానుప్రసాద్, కౌశిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య నూతన గృహ ప్రవేశంలో పలకరించుకుంటున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

# వెల్కం సంజయ్... నమస్కారం కవిత

- ఆప్యాయంగా పలకరించుకున్న ఎంపీ సంజయ్, ఎమ్మెల్సీ కవిత
- ఓ కార్యక్రమంలో తారసపడిన నేతలు

సుభాష్‌నగర్: నిజామాబాద్ నగర శివారు మాధవనగర్ సమీపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య గృహ ప్రవేశ కార్యక్రమంలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. నిత్యం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎదురెదురు పడి ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. సంజయ్‌ని చూసిన కవిత వెల్ కమ్ టు నిజామాబాద్ అని పలకరించారు. అందుకు ప్రతిగా సంజయ్ ఆమెకు నమస్కారం అంటూ ఆప్యాయంగా సంబోధించారు. సంజయ్ సతీమణిని కవితకు పరిచయం చేయగా, కవిత స్థానిక ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, కార్పొరేటర్లను పరిచయం చేశారు. కాగా ఈ గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎంపీ ధర్మపురి అర్వింద్ గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వాస్తవానికి అర్వింద్ వల్లే లక్ష్మీనర్సయ్యకు అధ్యక్ష పదవి వరించిందనీ, కానీ ఈమధ్యన వారిద్దరికీ గ్యాప్ రావడం వల్లనే ఆయన గైర్హాజరయ్యారన్న వాదనలు వినిపించాయి.

# నెలాఖరులో మోదీ మెగా ర్యాలీ?

- 'మహా జన్‌సంపర్క్ అభియాన్'లో భాగంగా తెలంగాణలో మోదీ పర్యటించే అవకాశం
- వరంగల్, కరీంనగర్ లేదా నిజామాబాద్‌లో నిర్వహణపై బీజేపీ హైకమాండ్ ఫోకస్
- పార్టీ పెద్దలు, కేంద్రమంత్రులతో భారీ సభలు, సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లలో సాధించిన విజయాలను దేశ వ్యాప్తంగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఆ పార్టీ నిర్వహిస్తోన్న 'మహా జన సంపర్క్ అభియాన్'కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణలోనూ పర్యటించే అవకాశాలున్నాయి. ఈ ఏడాది ఎన్నికలు జరుగనున్న తెలంగాణతో పాటు రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాలలో ప్రధానిమోదీ ర్యాలీలు ఉండేలా పార్టీ పెద్దలు ఇదివరకే కార్యాచరణ రూపొందించారని తెలుస్తోంది. ఆ మేరకు జూన్ నెలాఖరులోగా రాష్ట్రంలో భారీ ర్యాలీ ఉండవచ్చని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఈ మెగా ర్యాలీ నిర్వహణ, లోక్‌సభ నియోజకవర్గ ఎంపికపై ఇప్పటికే రాష్ట్ర నేతల నుంచి అభిప్రాయాలు కోరినట్లుగా సమాచారం. దీనిపై మరో నాలుగైదు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

**గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాలున్న లోక్‌సభ పరిధిలోనే**



దేశంలోని 543 లోక్‌సభ నియోజకవర్గాలోని 80 కోట్ల మందికి చేరువయ్యే లక్ష్యంతో బుధవారం నుంచి బీజేపీ మహా జనసంపర్క్ కార్యక్రమాన్ని బీజేపీ ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 51కి పైగా భారీ ర్యాలీలు, 500కు పైగా చోట్ల బహిరంగ సభలు, 500కి పైగా లోక్‌సభ, 4000 విధానసభ నియోజక వర్గాల్లో 600కి పైగా మీడియా సమావేశాలు నిర్వహించి 5 లక్షలకు పైగా విశిష్ట కుటుంబాలను కలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. మే 31న నుంచి జూన్ 30 వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని రాజస్తాన్ నుంచి ప్రధాని ప్రారంభించారు. నెల రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 12 ర్యాలీలు నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలు జరిగే రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నిజామాబాద్, వరంగల్, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఏదో ఒక చోట మోదీ ర్యాలీ, బహిరంగ సభ ఉండే అవకాశాలున్నాయని, దీనిపై చర్చలు కొనసాగుతున్నాయని సీనియర్ బీజేపీ నేత ఒకరు తెలిపారు. చాలామంది నేతలు హైదరాబాద్ లోక్‌సభ పేరు సూచిస్తున్నా, అక్కడ పార్టీ బలంగానే ఉన్న దృష్ట్యా, గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాలున్న లోక్‌సభ నియోజకవర్గాల్లో ఈ ర్యాలీ చేపట్టేలా పార్టీ అగ్రనేతలు యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

**కేంద్రపథకాల లబ్ధిదారులతో మమేకమయ్యేలా..**

దక్షిణాదిలో పార్టీకి పట్టున్న కర్ణాటక చేజారిన నేపథ్యంలో తెలంగాణపై బీజేపీ అధికంగా ఫోకస్ చేస్తోందని, ఈ నేపథ్యంలో మోదీ సహా ఇతర నేతల ర్యాలీలు ఉండేలా పార్టీ కార్యాచరణ ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభల్లో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీలు పాల్గొనేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నటు తెలుస్తోంది ఇక ప్రత్యక్ష ప్రయోజనాలను అందించిన పీఎం కిసాన్ నిధి, ముద్రలోన్, అన్న యోజన వంటి 10 కీలక కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మమేకం అయ్యేలా ఆ ర్యాలీలు, సభలు నిర్వహించాలని పార్టీ అగ్రనేతలు భావిస్తున్నారు.

# ఆస్తుల మీదున్న శ్రద్ధ పాతబస్తీ మీద లేదు

**ఎంఐఎంపై బండి సంజయ్ ధ్వజం**

కరీంనగర్ కల్చరల్: ఎంఐఎంకి ఆస్తుల మీదున్న శ్రద్ధ పాతబస్తీ మీద లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ధ్వజమెత్తారు. అధికారంలో ఎవరుంటే వాళ్లతో అంటకాగుతూ ముస్లింల అభ్యున్నతిని సైతం ఆ పార్టీ విస్మరించిందని విమర్శించారు. బుధవారం కరీంనగర్‌లో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ భూమి పూజ కార్యక్రమానికి బండి హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎంఐఎం ఉన్నన్ని రోజులూ బీజేపీని అధికారంలోకి రానియ్యమని ఇటీవల అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు. బీఆర్ఎస్ చేతగాని పార్టీ అని.. ఆ పార్టీ స్టీరింగ్ ఎంఐఎం చేతిలో ఉందని ఆరోపించారు. ఎంఐఎంకు అధికారంలోకి రావాలనే ఆలోచన లేదని, కేవలం పైసలు సంపాదించుకోవాలనే ఆరాటమని విమర్శించారు. నిజంగా ముస్లింలపై ప్రేమ ఉంటే పాతబస్తీ ఎందుకు అభివృద్ధి కావడం లేదని ప్రశ్నించారు. ముస్లింలకు ఉద్యోగాలు ఎందుకు రావడంలేదు? కనీసం ముస్లింలకు పాస్ పోర్ట్ ఎందుకు రావడం లేదో ఎంఐఎం నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ''ఎంఐఎంకు అంతటా పోటీచేసే దమ్ముందా? దారుస్సలాంలో కూర్చొని బీరాలు పలికితే పట్టించుకునేదెవరు? నిజంగా దమ్ముంటే.. ఆపార్టీ లీడర్లు మొగోళ్లు అయితే తెలంగాణ అంతటా పోటీ చేయాలని.. డిపాజిట్లు కూడా దక్కకుండా చేస్తం'' అని సంజయ్ హెచ్చరించారు.

**బీజేపీ సింహం లెక్క.. సింగిల్‌గా పోటీ చేస్తుంది**

15 నిమిషాలు టైమిస్తే హిందువులను నరికి చంపుతానన్న అక్బరుద్దీన్ వ్యాఖ్యలకు బీఆర్ఎస్ జవాబు చెప్పాలని బండి డిమాండ్ చేశారు. 'నీ ఆసుపత్రిలో పనిచేసే వ్యక్తే ఉగ్రవాదుల నాయకుడు. వాళ్లకు షెల్టర్ ఇస్తూ ఆర్థిక సాయం చేసే పార్టీ నీది. బీఆర్ఎస్‌ను సంకలో వేసుకుని వస్తావా? ఇతర పార్టీలతో కలిసి పొత్తుపెట్టుకొని వస్తావా రా.. కానీ బీజేపీ సింహం లెక్క సింగిల్‌గా పోటీ చేస్తుంద'ని చెప్పారు.

# ఇది మొత్తం న్యాయ వ్యవస్థను దెబ్బతీసే కుట్ర

- ఏబీఎన్, మహాటీవీ వీడియోలను సేకరించండి
- తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్‌కు జస్టిస్ లక్ష్మణ్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: తనపై తీవ్ర ఆరోపణలు చేస్తూ ఏబీఎన్ – ఆంధ్రజ్యోతి, మహా టీవీ చానెళ్లలో ప్రసారమైన వీడియోలను డౌన్‌లోడ్ చేసి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అందజేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ అనంతరం ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ ఎం.లక్ష్మణ్ బుధవారం తీర్పునిచ్చారు. ఈ నేపథ్యంలో తన ప్రతిష్టకు భంగం కలిగేలా రెండు టీవీ చానెళ్లు చేసిన ప్రసారాలను న్యాయమూర్తి తప్పుబట్టారు. 'ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక భూమిక పోషిస్తున్న మీడియాపై నాకు గౌరవం ఉంది. మీడియా స్వేచ్ఛకు నేను అడ్డంకి కాదు. వారికి భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంది. అయితే అది ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా ఉండాలే కానీ నిరాధార ఆరోపణలను ప్రచారం చేయడం సరికాదు. కొందరు వ్యక్తుల నిరాధార ఆరోపణలను కొన్ని చానెళ్లు ప్రచారం చేస్తూ ప్రతిష్టను దిగజార్చుకుంటున్నాయి. చర్చల పేరుతో ఇతరుల వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సరికాదు. ఈ కేసు విచారణ జరుపుతున్న నాపై ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, మహా టీవీ చానెళ్లు అసత్యాలను ప్రసారం చేసి నా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయడంతో పాటు బెదిరించే యత్నం చేశాయి. ఇది నాపై జరిగిన వ్యక్తిగత దాడి మాత్రమే కాదు.. మొత్తం న్యాయ వ్యవస్థను దెబ్బతీసే కుట్ర. ఈ కేసులో నేను స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోకుండా ప్రభావితం చేసే ప్రయత్నం జరిగింది. ఆ చానెళ్ల చర్చల్లో చేసిన కామెంట్లపై తీవ్రంగా కలత చెందా. ఒక దశలో విచారణ నుంచి తప్పుకోవాలని భావించా. సుప్రీం కోర్టు ఆదేశాలు, పవిత్రమైన న్యాయవ్యవస్థపై ఉన్న గౌరవంతో విచారణ కొనసాగించా. ఎలాంటి బెదిరింపులు వచ్చినా నా విధులు కొనసాగిస్తానని న్యాయమూర్తిగా చేసిన ప్రమాణాన్ని గుర్తు తెచ్చుకున్నా. ఏబీఎన్, మహాటీవీలో జరిగిన చర్చల వీడియోలను అందచేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశిస్తున్నా. హైకోర్టు న్యాయమూర్తికి డబ్బు సంచులు వెళ్లాయంటూ సస్పెండైన ఓ న్యాయాధికారి కామెంట్లు చేస్తారా? మరో వ్యక్తి.. 'చేయండిరా..!' అనే అసభ్య పదజాలాన్ని వినియోగిస్తాడా? ఇది తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. కచ్చితంగా కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది. వారిపై చర్యలు తీసుకోవాలా? వద్దా? అన్నది హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్ణయిస్తారు. నా వ్యక్తిగత ఇమేజ్ గురించి పెద్దగా కలత చెందడం లేదు. ఎందుకంటే ఎవరో చెరిపేస్తే చెరిగిపోయేది ఇమేజ్ కాదు. తీర్పు వెల్లడించాల్సిన హైకోర్టు న్యాయమూర్తిపై నేరుగా వ్యాఖ్యలు చేయడం క్షమించరానిది' అని తీర్పులో న్యాయమూర్తి పేర్కొన్నారు.

**కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలి: ఒగ్గు గవాస్కర్, న్యాయవాది**

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్‌పై ఆరోపణలు చేసిన వారిపై, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, మహా న్యూస్ చానెళ్లపై, ఆ కార్యక్రమాన్ని నిర్వహించిన వారిపై సెక్షన్ 129, 215 కింద కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని న్యాయవాది ఒగ్గు గవాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్‌కు ఆయన లేఖ రాశారు. 'ఏబీఎన్ యజమాని వేమూరి రాధాకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ పర్వతనేని వెంకటకృష్ణపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలి. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ రూల్స్–1994 రూల్ 6 ప్రకారం తప్పుడు ప్రచారాలపై నిషేధం ఉన్నా నైతిక విలువలను ఉల్లంఘించి ప్రసారాలు చేశారు. ఏబీఎన్ లైవ్ డిబేట్‌లో పాల్గొన్న రామకృష్ణ నేరుగా జస్టిస్ ఎం.లక్ష్మణ్‌పై ఆరోపణలు చేయడం సహించరాని నేరం. కోర్టు ధిక్కరణ కేసును ఎదుర్కొంటానని సవాల్ చేయడం న్యాయ వ్యవస్థను కించపరచటమే' అని లేఖలో పేర్కొన్నారు.

# 'దశాబ్ది' వేళ ఫ్లెక్సీల లొల్లి

- నల్లగొండలో 'దశాబ్ది ఫ్లెక్సీ'ల కలకలం
- మండలి చైర్మన్ గుత్తా ఫొటో లేకుండా ఫ్లెక్సీలు... అవతరణ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా గుత్తా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అవతరణ దినం సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 21 రోజుల పాటు జరిగే ఉత్సవాల షెడ్యూల్‌ను కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఖరారు చేశారు. కానీ ఉత్సవాల నిర్వహణలో అధికార పార్టీ నేతల నడుమ నెలకొన్న విభేదాలు బయట పడుతున్నాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలో జరగనున్న వేడుకల్లో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అయితే ఉత్సవాల నిర్వహణలో భాగంగా స్థానిక శాసనసభ్యుడు కంచర్ల భూపాల్‌రెడ్డి భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఇతర నేతల ఫొటోలను ఫ్లెక్సీలపై ముద్రించినా, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఫొటో ఎక్కడా కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. గుత్తా కుమారుడు అమిత్ రెడ్డి రాజకీయ అరంగేట్రం చేస్తారనే వార్తల నేపథ్యంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు నల్లగొండ రాజకీయవర్గాల్లో కలకలం సృష్టించాయి. ఉత్సవాల నిర్వహణలో పార్టీ శ్రేణులను కలుపుకొనిపోవాలని కేసీఆర్ ఇప్పటికే మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేశారు. జూన్ 2న జిల్లా కేంద్రాల్లో జరిగే రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే ప్రజా ప్రతినిధుల జాబితాను కూడా సిద్ధం చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త సెక్రటేరియట్‌లో జరగనున్న వేడుకల్లో పాల్గొంటారు. శాసనసభ స్పీకర్, శాసన మండలి చైర్మన్, మంత్రులు, ప్రభుత్వ విప్‌లు, ప్రభుత్వ సలహాదారులు జిల్లా కేంద్రాల్లో జరిగే జాతీయ పతాకా విష్కరణలో ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

# వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వంద సీట్లు ఖాయం

- బీఆర్ఎస్ పదేళ్లలో వందేళ్లకు సరిపడా దోపిడీ చేసింది
- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే బీజేపీ, బీఆర్ఎస్ నాటకాలు
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



పెద్దకొత్తపల్లి: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వంద సంవత్సరాలకు సరిపడా ప్రజా సంపదను దోపిడీ చేశారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా దేవినేనిపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని మాట్లాడే ప్రధాని మోదీ, అమిత్‌షాలకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న రాజకీయ పునరేకీకరణతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వెయ్యి మంది కేటీఆర్‌లు, వంద మంది కేసీఆర్‌లు వచ్చినా కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాలిపోతున్న ఇల్లు లాంటిదని, ఆ పార్టీని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. గతంలో కృష్ణా, గోదావరి నదులపై కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టిన ప్రాజెక్టులన్నీ మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తామన్నారు. కేఎల్ఐ నిర్మించి పదేళ్లయినా పంటకాల్వలు తవ్వకపోవడంతో సాగునీరు అందడం లేదన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణాన్ని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పూర్తి చేసి సాగునీరు అందిస్తామన్నారు.

# చెప్పుడు మాటలతో దర్యాప్తా?

- ఎంపీ అవినాశ్‌పై ఆరోపణలకు ఎలాంటి ఆధారాల్లేవు
- ఎవరో అన్నవి, విన్నవి మినహా సాక్ష్యాలేవి?
- సీబీఐ తీరును తప్పుబట్టిన తెలంగాణ హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై ఆరోపణలు మినహా ఎలాంటి ఆధారాలు లేవని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఎవరో అన్నవి, విన్నవి మినహా సాక్ష్యాలేవని ప్రశ్నించింది. కేవలం చెప్పుడు మాటలు, ఊహాజనిత సాక్ష్యాల ఆధారంగా సీబీఐ తప్పుదారిలో దర్యాప్తు కొనసాగిస్తోందని తప్పుబట్టింది. ఈ కేసులో ఎంపీ అవినాశ్ రెడ్డి కస్టోడియల్ విచారణ అవసరం లేదని పేర్కొంటూ ఐదు షరతులతో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. సీబీఐ అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, సాక్షులను ప్రభావితం చేయరాదని, జూన్ చివరివరకు దర్యాప్తునకు సహకరించాలని, ప్రతి శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీబీఐ ఎదుట హాజరు కావాలని తెలిపింది. ఒకవేళ అవినాశ్‌ను అరెస్టు చేస్తే రూ.5 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు మరో ఇద్దరి ష్యూరిటీ తీసుకుని బెయిల్‌పై విడుదల చేయాలని కూడా సీబీఐని ఆదేశించింది. షరతులను అవినాశ్ ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు కోసం సీబీఐ కోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. ముందస్తు బెయిల్ కోరుతూ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో శుక్ర, శని వారం సుదీర్ఘ వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు మే 31న తుది తీర్పు వెలువరిస్తామని, అప్పటివరకు ఆయన్నుఅరెస్టు చేయవద్దని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అవినాశ్‌రెడ్డికి షరతులతో ముందుస్తు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ ఎం. లక్ష్మణ్ ధర్మాసనం తీర్పు వెలువరించింది.

**సాక్షులెవరూ ఫిర్యాదు చేయలేదు..**

'సుదీర్ఘ కాలం దర్యాప్తు చేసినా అవినాశ్‌కు వ్యతిరేకంగా సీబీఐ ఎలాంటి ఆధారాలను సేకరించలేకపోయింది. కేవలం ఆరోపణలకు మాత్రమే పరిమితమైంది. హత్య జరిగిన ప్రదేశంలో ఆధారాలను చెరిపివేయడంలోనూ అవినాశ్ ప్రమేయం ఉన్నట్లు తేలలేదు. సాక్షులను అవినాశ్ బెదిరిస్తున్నట్లు ఇప్పటివరకు ఎవరూ దర్యాప్తు అధికారులకు ఫిర్యాదు చేయలేదు. సీబీఐ సేకరించింది హియర్ సే ఎవిడెన్స్ (ఫలానా వ్యక్తి నాకు చెప్పారు అని మరొకరికి చెప్పడం), ఊహాజనిత సాక్ష్యాలు మాత్రమే. ఈ హత్య వెనుక భారీ కుట్ర ఉందనేందుకు అవినాశ్‌కు వ్యతిరేకంగా నేరుగా ఒక్క ఆధారం కూడా లేదు. అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఇచ్చిన సమాచారంపైనే సీబీఐ పూర్తిగా ఆధారపడి దర్యాప్తు సాగిస్తోంది. రాజకీయ కోణం అంటున్నా అందుకు ఆధారాలు లేవు. కోర్టుకు ఆరోపణలు కాదు.. ఆధారాలు కావాలి. ఈ అంశాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత కస్టోడియల్ విచారణ అవసరం లేదని ఈ కోర్టు భావిస్తోంది. అవినాశ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు పిటిషన్‌ను అనుమతిస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. 'సాక్షుల స్టేట్‌మెంట్లతోనే సీబీఐ దర్యాప్తు చేసింది. రెండేళ్ల క్రితమే అవినాశ్ కుట్ర బయటపడిందని చెప్పిన సీబీఐ అప్పుడే ఎందుకు విచారణ చేయలేదో సమాధానం లేదు. హత్యకు వాడిన గొడ్డలిని సీబీఐ రికవరీ చేయలేదు. ఏ–2 గొడ్డలిని నాలాలో పడేసినట్లు చెప్పాడు. నిందితులకు ఇచ్చిన డబ్బును కూడా రికవరీ చేయలేదు. దస్తగిరి అనుచరుడు మున్నాను ఈ డబ్బుకు సంబంధించి విచారించలేదు. వివేకా అల్లుడు తానే లేఖను దాచిపెట్టానని వాంగ్మూలంలో చెప్పాడు. ఎర్రగంగిరెడ్డితో మిగతా ముగ్గురు నిందితులకు ఉన్న సంబంధాలను సీబీఐ కనుగొనలేదు. వివేకా తలపై గాయాలున్నా హత్య కేసుగా నమోదు కాలేదు. అనుమానాస్పద మృతి కిందే కేసు నమోదు చేయడం నాటి విచారణాధికారి తప్పిదమే. కడప ఎంపీ టికెట్ వివాదంపై సీబీఐ వద్ద ఎలాంటి ఆధారాలూ లేవు. వివేకా హత్య కేసులో, సాక్ష్యాల ధ్వంసంలో అవినాశ్ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లేవు' అని తీర్పు సందర్భంగా న్యాయమూర్తి పేర్కొన్నారు.

**ఎక్కడా అవినాశ్ పాత్ర లేదు: న్యాయవాది**

'ఈ హత్య కేసు వెనుక భారీ కుట్ర ఉందంటున్న సీబీఐ, అవినాశ్‌కు వ్యతిరేకంగా ఒక్క ఆధారాన్ని కూడా చూపలేకపోయింది. విచారణకు అవినాశ్ సహకరిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఏడు సార్లు విచారణ జరిగింది. హైకోర్టు దర్యాప్తునకు ఆదేశించి దాదాపు నాలుగేళ్లు అవుతున్నా సీబీఐ ఆరోపణలు మినహా అవినాశ్‌కు వ్యతిరేకంగా ఆధారాలను చూపడం లేదు. సాక్ష్యాలు లేకుండా ఓ పార్లమెంట్ సభ్యుడి ప్రజాజీవితాన్ని దెబ్బతీయాలని ప్రయత్నిస్తోంది. వివేకా హత్య జరిగిన రోజు అవినాశ్ అక్కడకు చేరుకునేటప్పటికి అందరూ గుండెపోటు, రక్తపు వాంతులతో చనిపోయారని చెబుతుండటంతో ఆయన కూడా తొలుత అలాగే భావించారు. సాక్ష్యాల ధ్వంసంలోనూ ఆయన పాత్ర లేదు. అప్పటికే పలు ఫోన్లలో వీడియోలు, ఫొటోలు నిక్షిప్తమై ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు విచారించిన నేపథ్యంలో కస్టోడియల్ విచారణ అవసరం లేదు' అని అవినాశ్ న్యాయవాది పేర్కొన్నారు.

**బెయిల్ మంజూరుకు కోర్టు పరిగణనలోకి తీసుకున్న అంశాలివీ..**

తొలి చార్జిషీట్ సమయంలో అవినాశ్‌కు సంబంధం ఉండొచ్చని అనుమానించిన సీబీఐ విచారణ నోటీసులు జారీ చేసేందుకు మాత్రం రెండేళ్లు ఆగింది. జనవరి నుంచి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. ఒకవేళ ఆయన్ను అరెస్టు చేసే ఉద్దేశం ఉంటే సీబీఐ ఇన్నేళ్లు ఎందుకు ఆగిందనేదానికి దర్యాప్తు అధికారుల వద్ద సమాధానం లేదు. అవినాశ్ తల్లి మెడికల్ రికార్డుల ను పరిశీలిస్తే శస్త్రచికిత్స వాస్తవమే అన్నది తెలు స్తోంది. విచారణ సందర్భంగా హైకోర్టు అడిగిన పలు ప్రశ్నలకు సీబీఐ సమాధానం చెప్పలేకపోయింది.

# 6న శైలజా కిరణ్‌ను విచారించనున్న సీఐడీ

**మార్గదర్శి ఆర్థిక అక్రమాల కేసులో నోటీసులు జారీ**



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ఆ సంస్థ ఎండీ చెరుకూరి శైలజా కిరణ్‌కు సీఐడీ మరోసారి నోటీసులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయినప్పటికీ ఆమె ఆ నోటీసులపై సీఐడీకి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ఏ–1గా ఉన్న రామోజీరావు, ఏ–2గా ఉన్న శైలజా కిరణ్‌ను ఇప్పటికే సీఐడీ హైదరాబాద్‌లో వారి నివాసంలో వేర్వేరుగా విచారించింది. ఈ కేసులో మరోసారి విచారించాల్సి ఉంటుందని ఆమెకు సీఐడీ విభాగం ఇటీవల సమాచారమిచ్చింది. హైదరాబాద్‌లో ఆమె అందుబాటులో ఉండే తేదీలు తెలపాలని సూచించింది కూడా. జూన్ 3 తరువాత తాను విచారణకు అందుబాటులో ఉంటానని ఆమె సీఐడీకి తెలిపారు. దీంతో జూన్ 6న హైదరాబాద్‌లో శైలజ నివాసంలోనే ఆమెను విచారిస్తామని సీఐడీ నోటీసులిచ్చింది. కానీ దీనిపై ఇప్పటివరకు ఆమెగానీ ఆమె తరఫు న్యాయవాదులుగానీ సీఐడీకి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం. మరోవైపు ఆమె విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని భావించిన సీఐడీ అధికారులు ఇటీవల ఆమెపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. ఆమె విమానాశ్రయానికి వస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.



చదవడం... మనకు తెలియని స్నేహితులను తెస్తుంది.

– హానొరే డె బాల్జాక్



సాక్షి

గురువారం, 1 జూన్ 2023

# 'ప్రశాంత మణిపూర్' ఎట్లా?

నెలరోజులుగా భగ్గున మండుతున్న మణిపూర్‌లో ప్రశాంతత నెలకొల్పేందుకు ఎట్టకేలకు ఒక రాజకీయ ప్రయత్నం మొదలైంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆ రాష్ట్రంలో పర్యటించి పరస్పరం కలహిస్తున్న మెయితీ, కుకీ తెగల నాయకులతో, పౌర సమాజ కార్యకర్తలతో, రాజకీయ పార్టీలతో మంగళవారం సమావేశమయ్యారు. సమస్య ఉగ్రరూపం దాల్చినప్పుడు, జనం చావుబతుకులమధ్య కొట్టుమిట్టాడుతున్నప్పుడు పాలకులుగా ఉన్నవారు సంయమనంతో మెలగటం, సాధారణ స్థితి ఏర్పడేందుకు ప్రయత్నించటం అవసరం. మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్‌కు ఈ ప్రాథమిక విషయాలు కూడా తెలిసినట్టు లేదు. ఇప్పటివరకూ జరిగిన ఘర్షణల్లో దాదాపు 80 మంది ప్రాణాలు కోల్పోయారు. 40,000 మంది వరకూ కొంపా గోడూ వదిలి చెట్టుకొకరు, పుట్టకొకరు అయ్యారు. ఊళ్లకు ఊళ్లే మంటల్లో మాడి మసయ్యాయి. పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి తుపాకులు, మందుగుండు అపహరించిన ఉదంతాలు జరిగాయి. ఇలాంటి సమయంలో 'ఇదంతా కుకీ ఉగ్రవాదులకూ, భద్రతా దళాలకూ సాగుతున్న ఘర్షణ తప్ప మరేంకాద'ని బీరేన్ సింగ్ ప్రకటించటం ఆశ్చర్యం కలిగిస్తుంది. పరోక్షంగా కుకీలను మిలిటెంట్లుగా, ఉగ్రవాదులుగా చిత్రీకరించటమే ఆయన ప్రకటన వెనకున్న సారాంశమన్న విమర్శలు వెల్లువెత్తాయి. రక్షణ దళాల చీఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సీఎం ప్రకటనను తోసిపుచ్చారు. ఇది కేవలం రెండు తెగల మధ్య ఘర్షణేనని తేల్చి చెప్పారు. మెయితీ తెగకు చెందిన నేతగా బీరేన్ సింగ్‌కు వ్యక్తిగతంగా ఎలాంటి అభిప్రాయాలైనా ఉండొచ్చు. కానీ పాలకుడిగా స్పందించాల్సి వచ్చినప్పుడూ, రాష్ట్రం ఇంకా ఘర్షణలతో అట్టుడుకుతున్నప్పుడూ ఆచి తూచి మాట్లాడాలి. తమ తెగవారిపై జరుగుతున్న దాడుల మాటేమిటని కుకీ శాసనసభ్యులు నిలదీస్తే ఆయన నుంచి సమాధానం లేదు. ఇదొక్కటే కాదు... హింసను సాకుగా చూపి 25 మిలిటెంట్ సంస్థలతో కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం నుంచి తప్పుకుంటున్నట్టు బీరేన్ సింగ్ ఏకపక్షంగా ప్రకటించటం కూడా సమస్య తీవ్రతను పెంచింది. కుకీలతో అమిత్ షా నిర్వహించిన సమావేశానికి సీఎం రాలేని స్థితి ఏర్పడటం, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని వారు కోరటం రాష్ట్ర ప్రభుత్వంపై ఏర్పడిన అవిశ్వాసానికి అద్దం పడుతుంది.

మణిపూర్‌తో పాటు ఇతర ఈశాన్య రాష్ట్రాలు ఎంతో వైవిధ్యభరితమైనవి. అక్కడి నాలుగున్నర కోట్ల జనాభాలో 400కు పైగా తెగలున్నాయి. మాండలికాలు సైతం దాదాపు అంతే సంఖ్యలో ఉంటాయి. వీరంతా భిన్న సంస్కృతులు, విశ్వాసాలకు చెందినవారైనా... అప్పుడప్పుడు అపోహలు తలెత్తిన సందర్భాలున్నా మొత్తంమీద శతాబ్దాలుగా కలిసిమెలిసి ఉంటున్నారు. అయితే ఇంచుమించు ఏభైయ్యేళ్లుగా ఇదంతా మారింది. తెగల పరిరక్షకులమంటూ సాయుధ బృందాలు తలెత్తటం మొదలైంది. ఉపాధి లేమివల్ల కావొచ్చు... జీవికకు ముప్పు కలుగుతుందన్న భయాందోళనల వల్ల కావొచ్చు చిన్న సమస్య రాజుకున్నా అది క్షణాల్లో కార్చిచ్చుగా మారి కల్లోలం రేపుతోంది. తమకు స్వయం పాలిత ప్రాంతాన్ని ఏర్పరచాలన్న డిమాండ్ బయల్దేరుతోంది. వివిధ రాష్ట్రాల్లో తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలను కలిపి 'ప్రత్యేక నాగాలిమ్' ఏర్పరచాలని నాగాలు పదేళ్ల క్రితం తీవ్ర ఆందోళనకు దిగారు. పరిమిత వనరులను పలువురితో పంచుకోవటం తప్పనిసరి కావటంతో అవతలివారు శత్రువులుగా కనిపిస్తున్నారు. మెయితీలను సైతం ఎస్టీలుగా పరిగణించాలన్న న్యాయస్థానం ఆదేశాలు ఈ కారణంతోనే ఆదివాసీలైన కుకీల్లో కల్లోలం సృష్టించాయి. ఇదే అదునుగా ఘర్షణలు తలెత్తాయి. పొరుగునున్న మయన్మార్ నుంచి వచ్చిపడుతున్న శరణార్థులను అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని మెయితీ నాయకులు చెప్పటం సమస్యను తగ్గించి చూపటమే అవుతుంది. అసలు కుకీలు స్థానికులు కాదనీ, వారు మయన్మార్ నుంచి వలస వచ్చినవారనీ చాన్నాళ్లనుంచి మెయితీలు వాదిస్తున్నారు. రాష్ట్రంలో జాతీయ పౌరసత్వ చిట్టా (ఎన్ఆర్‌సీ) అమలు చేసి, పౌరసత్వాన్ని నిగ్గుతేల్చి స్థానికేతరులను పంపేయాలని వారు కోరుతున్నారు. 53 శాతంగా ఉన్న మెజారిటీ తెగ నుంచి ఇలాంటి డిమాండ్ రావటం కొండప్రాంతాల్లో ఉంటున్న కుకీల్లో సహజంగానే గుబులు రేపుతోంది. 1901 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాలో కుకీలు 14.5 శాతం. 110 ఏళ్ల తర్వాత 2011 నాటికి వారి జనాభా పెరుగుదల రెండు శాతం మాత్రమే. అలాంటపుడు కుకీలపై స్థానికేతరుల ముద్రేయటం అసంబద్ధం కాదా?

ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రకటనలనూ, తెగల మధ్య అపోహలు పెంచే వదంతులనూ నివారించటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దాని పర్యవసానంగానే ఇంత హింస చోటుచేసుకుంది. నిరుడు యూపీలోని మధురలో కన్నవారి కర్కశత్వానికి బలైపోయిన 21 ఏళ్ల యువతిని మెయితీ తెగ మహిళగా చిత్రించి, ఆమెపై కుకీలు అత్యాచారానికి పాల్పడి హతమార్చారని తప్పుడు ప్రచారం జరపడంతో ఉద్రిక్తతలు రాజుకున్నాయి. కుకీ తెగ మహిళలపై దాడులు జరిగాయి. అత్యాచార ఉదంతాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఇక చుర్‌చాంద్‌పూర్‌లో హిందూ దేవాలయాలపై దాడులు సాగించారన్న వదంతులు లేవదీశారు. ఇదంతా అబద్ధమని వెంటనే ఆ ప్రాంత మార్వాడీ, పంజాబీ సొసైటీలు, బెంగాలీ సొసైటీ, బిహారీ సొసైటీ సంయుక్తంగా ప్రకటించాయి. తెగల పేరుతో, మతం పేరుతో ప్రజల్లో చీలికలు తెచ్చే యత్నాలను మణిపూర్ పౌర సమాజం ఐక్యతతో తిప్పికొట్టాలి. పాలకులు, రాజకీయ పార్టీల నేతలు జవాబుదారీతనంతో మెలగాలి. అప్పుడే ప్రశాంత మణిపూర్ సాధ్యమవుతుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.ద్వాదశి ఉ.11.10 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** స్వాతి తె.5.21 వరకు (తెల్లవారితే శుక్రవారం), తదుపరి విశాఖ, ఉ.10.25 నుండి 12.05 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.46 నుండి 10.39 వరకు, తదుపరి ప.2.57 నుండి 3.52 వరకు, **అమృతఘడియలు:** రా.8.17 నుండి 9.55 వరకు.

**సూర్యోదయం :** 5.28
**సూర్యాస్తమయం:** 6.26
**రాహుకాలం :** ప.1.30 నుండి 3.00 వరకు
**యమగండం :** ఉ. 6.00 నుండి 7.30 వరకు

# ఓఎన్‌డీసీతో ఈ-కామర్స్ విప్లవం?

**ఈ-కామర్స్ రంగంలో ఈ మధ్యకాలంలో ఓ విషయం హల్‌చల్ చేస్తోంది. భారత రిటైల్ రంగాన్ని సమూలంగా మార్చేయగల సత్తా ఉందని చెప్పుకుంటున్న దాని పేరు... 'ఓఎన్‌డీసీ'. వస్తువులు అమ్ముకునే వారికీ, కొనేవారికీ వేదికగా నిలవగల, అందరికీ అందుబాటులో ఉండే నెట్‌వర్క్ ఇది. స్థూలంగా చెప్పాలంటే దేశంలోని లక్షలాది చిన్న కంపెనీలు అతితక్కువ ఖర్చుతో ఈ-కామర్స్ ప్లాట్‌ఫార్మ్‌పై తమ ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. ఈ ప్లాట్‌ఫార్మ్‌కు కేంద్ర ప్రభుత్వమే ప్రోత్సాహం అందిస్తోంది. అలాగని ఇది ప్రభుత్వ రంగ సంస్థ కాదు. ప్రైవేట్ రంగంలోనే లాభాపేక్ష లేని సంస్థగా కొనసాగనుంది. ఈ-రిటైలింగ్ దేశం నలుమూలలకూ విస్తరించేందుకు ఇదో గొప్ప సాధనమవుతుందని అంచనా!**

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

'ఓఎన్ డీసీ' అంటే ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్. వ్యాపారులు, వినియోగదారులిద్దరికీ చాలా అనుకూలంగా ఉండే ఈ ప్లాట్‌ఫార్మ్‌కు కేంద్ర ప్రభుత్వమే ప్రోత్సాహం అందిస్తోంది. అలాగని ఇది ప్రభుత్వ రంగ సంస్థ కాదు. ప్రైవేట్ రంగంలోనే లాభాపేక్ష లేని సంస్థగా కొనసాగనుంది.

బ్యాంకుల్లాంటి ఆర్థిక సంస్థలు, ఇన్ఫోసిస్ ఛైర్మన్ నందన్ నీలేకని వంటివారు ఈ ఓఎన్‌డీసీకి దన్నుగా నిలిచారు. నందన్ నీలేకని ఈ మొత్తం ప్రయత్నానికి సూత్రధారి అని కూడా చెబుతున్నారు. ఈ-కామర్స్ రంగాన్ని ప్రజాస్వామ్య పథం పట్టించే సామర్థ్యమున్న అతి పెద్ద ఆవిష్కరణ ఇదని నందన్ చెబుతున్నారు. ఓఎన్‌డీసీకి ఇచ్చిన నిర్వచనాన్ని పరిశీలించినా ఈ విషయం అర్థమవుతుంది.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్రా వంటి ప్లాట్‌ఫార్మ్‌లపై ఏ సంస్థ అయినా తమ ఉత్పత్తులను అమ్ముకోవాలంటే వాటిల్లో ప్రత్యేకంగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. అమ్మకాల్లో గరిష్ఠంగా 35 శాతం కమిషన్‌ను ఈ ప్లాట్‌ఫార్మ్‌లు పొందుతూంటాయి. ఓఎన్‌డీసీలో ఈ అవసరం ఉండదు. వినియోగదారులకూ ఇది వర్తిస్తుంది. చిన్న చిన్న కంపెనీలు నేరుగా ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫార్మ్‌పై తమ ఉత్పత్తులను అమ్ముకునేందుకు వీలేర్పడుతోంది. ఈ ఉత్పత్తులను వినియోగదారులు మాత్రమే కాకుండా... అమెజాన్ వంటి పెద్ద రిటైయిలర్లూ కొనుగోలు చేయవచ్చు. ఓఎన్‌డీసీలో కమిషన్ కేవలం రెండు నుంచి ఐదు శాతం మాత్రమే ఉంటుంది. స్థూలంగా చెప్పాలంటే దేశంలోని లక్షలాది చిన్న కంపెనీలు అతితక్కువ ఖర్చుతో ఈ-కామర్స్ ప్లాట్‌ఫార్మ్‌లపై తమ ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. ఓఎన్‌డీసీని అప్పుడే యూపీఐతో పోలుస్తున్నారు. దేశంలో ఇప్పటికే భారీ విజయం సాధించిన ఈ చెల్లింపుల విధానాన్ని అమలు చేసేందుకు, లేదా యూపీఐలోనే భాగంగా మారేందుకు పలు దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. యూపీఐ సాయంతో గూగుల్ పే, ఫోన్ పే, జియో, అమెజాన్ వంటి అనేక పేమెంట్ పోర్టళ్ల నుంచి చెల్లింపులు చేయవచ్చునన్నది మనకు తెలిసిన విషయమే.

ఓఎన్ డీసీ ఆలోచన చాలా బాగున్నప్పటికీ ప్రస్తుతానికి అది బాలారిష్టాలను ఎదుర్కొంటోంది. మైక్రోసాఫ్ట్, పేటీఎం, ఫోన్ పే వంటి దిగ్గజ కంపెనీలూ దీంట్లో భాగస్వాములయ్యాయి. ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌ను వినియోగదారులు భిన్నరీతుల్లో ఉపయోగిస్తున్నారు. దీనివల్ల కొన్ని వివాదాలూ వస్తున్నాయి. ఉదాహరణకు... కొంత మంది ఓఎన్ డీసీ నెట్‌వర్క్‌పై ఆహారాన్ని ఆర్డర్ చేస్తూండటం. జొమాటో, స్విగ్గీ వంటి అప్లికేషన్ల జోలికి పోకుండా వినియోగదారులు నేరుగా ఓఎన్ డీసీ ప్లాట్‌ఫార్మ్ పైనే ఫుడ్ ఆర్డర్లు పెడుతూండటం... కమిషన్లు తక్కువగా ఉన్న కారణంగా ధరలు తక్కువగా ఉండటం రెస్టారెంట్లను ఆకర్షిస్తోంది. స్విగ్గీ, జొమాటో లాంటి పెద్ద కంపెనీలు



తమను నియంత్రిస్తున్నాయన్న భావనలో ఉన్న రెస్టారెంట్లు ఇప్పుడు ఓఎన్‌డీసీ వైపు మళ్లేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నాయి. సమస్యల్లా ఒక్కటే. సరకుల రవాణా బాధ్యత ఏ కంపెనీ తీసుకోవాలి? ఈ నైపుణ్యం డెలివరీ అప్లికేషన్లది! ఒకవేళ ఆర్డర్లు సరైన సమయానికి వినియోగదారులకు చేరకపోతే, అందిన సరుకులు సక్రమంగా లేకపోతే బాధ్యత ఎవరిది? ఎవరికి ఫిర్యాదు చేయాలి? ఫుడ్ డెలివరీకి మాత్రమే కాదు, ఇతర విక్రయాలకూ ఈ సమస్యల పరిష్కారం అత్యవసరం.

రవాణా సమస్యల పరిష్కారానికి 'లాజిస్టిక్స్' రంగంలోని స్టార్టప్‌లతో ప్రయత్నాలు మొదలయ్యాయని ఓఎన్‌డీసీ చెబుతోంది. డెలివరీ సమస్యలను ఇవి చూసుకుంటాయని అంటోంది. అయితే కొన్ని అంశాలను ఇంకా సరిచేయాల్సిన అవసరముంది. డిస్కౌంట్లు, తక్కువ కమిషన్ వంటివి ఇలాగే ఎక్కువ కాలంపాటు కొనసాగే అవకాశాలు తక్కువ. ఓఎన్ డీసీ నిర్వాహకులు కూడా పలు సందర్భాల్లో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ ఆరంభానికీ, ప్రాచుర్యానికీ ఈ డిస్కౌంట్లు ఉపయోగపడతాయి కానీ... దీర్ఘకాలంలో వీటి రూపురేఖలు మార్కెట్ శక్తులపై ఆధారపడి ఉంటాయని వారు చెబుతున్నారు.

కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం ప్రస్తుతం ఓఎన్ డీసీలో 36,000 మంది విక్రయదారులున్నారు. గత ఏడాది సెప్టెంబరులో ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకూ సాధించిన పురోగతి ఇది. అలాగే నెట్‌వర్క్ భాగస్వాముల సంఖ్య 45గా ఉంది. సగటున వారానికి 13 వేల రిటైల్ ఆర్డర్లు వస్తూండగా... గరిష్ఠంగా ఒక్క రోజులో 25 వేల వ్యవహారాలు నడిచాయి. ఈ-రిటైల్ రంగం సామర్థ్యం భారీ ఎత్తున పెరగనుందని కూడా ఓఎన్ డీసీ వెబ్‌సైట్ ద్వారా తెలుస్తోంది. సుమారు 14 కోట్ల మంది ఆన్‌లైన్ వినియోగదారులతో చైనా, అమెరికా తరువాత భారత్ మూడో స్థానంలో ఉందని లెక్క. అయితే దేశంలో ఈ-రిటైల్ చొచ్చుకుపోయింది చాలా తక్కువ. చైనాలో 25 శాతం ప్రాంతాలకు విస్తరించగా, కొరియాలో ఇది 26 శాతంగా ఉంది. అలాగే యూకేలో ఈ-రిటైల్ విస్తరణ 23 శాతముంటే, భారత్‌లో కేవలం 4.3 మాత్రమే. దేశంలో ఉండే 75 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులను పరిగణనలోకి తీసుకుంటే ఇది చాలా తక్కువ. బెయిన్ అండ్ ఆక్సెల్ సంస్థ లెక్కల ప్రకారం 2027 నాటికి దాదాపు కోటీ యాభై లక్షల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఆన్‌లైన్ క్రయ విక్రయాలకు దిగనున్నాయి. ప్రస్తుతం ఈ సంఖ్య 60 లక్షలు మాత్రమే. ఈ నేపథ్యంలోనే ఓఎన్ డీసీకి ప్రాధాన్యమేర్పడుతోంది. ఈ-రీటెయిలింగ్ దేశం నలుమూలలకూ విస్తరించేందుకు ఇదో గొప్ప సాధనమవుతుందని అంచనా.

ఓఎన్‌డీసీ పుట్టి నెలలు కూడా గడవకముందే దీనిపై కొందరు ఇది పనిచేయదని పెదవి విరిచేస్తున్నారు. పనిభారం ఎక్కువవుతుందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఇంటర్నెట్ దిగ్గజ కంపెనీలు ఓఎన్ డీసీలో భాగం కాకపోతే విజయవంతమయ్యే అవకాశాలు తక్కువన్న వ్యాఖ్యలూ వినిపిస్తున్నాయి. గూగుల్ ఈ నెట్‌వర్క్‌లో భాగస్వామి అవుతుందని గత ఏడాది మధ్యలో కొన్ని వదంతులైతే వచ్చాయి. కానీ ఆ తరువాత ఎలాంటి సద్దు లేదు. ఈ-కామర్స్ సంస్థలు అమెజాన్, వాల్‌మార్ట్ ఆధ్వర్యంలోని ఫ్లిప్‌కార్ట్ ఇంకా ఓఎన్ డీసీలో చేరలేదు. అయితే వాల్‌మార్ట్‌కే చెందిన ఫోన్ పే ఇప్పటికే ఇందులో భాగస్వామి కావడం గమనార్హం. ఫోన్ పే... 'పిన్‌కోడ్' అనే ప్రత్యేకమైన అప్లికేషన్‌తో ఓఎన్‌డీసీలో చేరింది. ఓలా, ఊబర్‌లను కూడా చేర్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. అయితే ఈ రంగంలో ఇప్పటివరకూ బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న 'నమ్మ యాత్రి' అన్న రైడ్ హెయిలింగ్ సంస్థ మాత్రమే ఓఎన్‌డీసీలో భాగంగా ఉంది.

ఓఎన్‌డీసీ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న నెట్‌వర్క్. పూర్తి సామర్థ్యాన్ని అందుకునేందుకు కొంత సమయం పడుతుంది. ఈ నెట్‌వర్క్‌లో ఇప్పుడే భాగస్వాములుగా చేరాలనీ, భవిష్యత్తులో చేర్పు కోమనీ కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ వ్యాఖ్యానించడం దీని అభివృద్ధికి అంతగా సహకరించేది కాదు. ఓఎన్ డీసీ జయాపజయాలు ఆర్థికంగా ఎంతమేరకు అనుకూలం అన్నది భాగస్వాముల చేరిక, ప్రభుత్వ ప్రోత్సాహం వంటి అంశాలపై ఆధారపడి ఉంది. యూపీఐ, ఆధార్‌ల మాదిరిగా ఓఎన్ డీసీ కూడా విప్లవాత్మకమైన ఆలోచనైతే అది దాని సృజనాత్మక డిజైన్ కారణంగానే అవుతుంది కానీ ప్రభుత్వ మార్గదర్శకత్వాల కారణంగా కాదు. ఈ కొత్త ఈ-కామర్స్ ప్రపంచం ఎలా పరిణమించనుందో తెలుసుకోవాలంటే వేచి చూడటం కంటే వేరు మార్గం లేదు.

వ్యాసకర్త సీనియర్ ఆర్థిక వ్యవహారాల జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### ఇదా పనితీరు?



నా భార్యకు రెండేళ్లుగా చంకలో గడ్డ ఉంది. తన రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు అది ప్రతిస్పందన అన్నారు. బయాప్సీ చేయడానికి నిరాకరించారు. 2022 డిసెంబరులో 4వ స్టేజ్ బ్రెస్ట్ క్యాన్సర్ ఉందని తేలింది. అది వెన్నెముకకూ, కాలేయానికీ వ్యాపించింది. 'నేషనల్ హెల్త్ సర్వీస్' (ఇంగ్లండ్)పై ఆమె విశ్వాసాన్ని కోల్పోయింది.

– పాల్ నికోల్స్, ఇంజినీర్

### ఇప్పటి శాంతి ముఖ్యం



మన లక్ష్యం సంతోషంగా ఉండటం – మనశ్శాంతిని పొందడం. నేను తర్వాతి జీవితం గురించో, దేవుడికి సంబంధించో మాట్లాడటం లేదు; ఇప్పుడు ఇక్కడ శాంతితో, సంతోషంగా ఉండటం గురించి చెబుతున్నాను.

– దలై లామా, బౌద్ధ గురువు

### ఇంకానా?



తొమ్మిదేళ్ల తర్వాత – అంటే దాదాపు దశాబ్దం – కూడా ఇంకా మనం నిజంగా కాంగ్రెస్ తప్పు చేసింది, లేదా నెహ్రూ తప్పు చేశారు అని వినాలా?

– సుచేతా దలాల్, జర్నలిస్ట్

### మహాదక్షిణం



రాజకీయంగా మహారాష్ట్ర లేకుండా దక్షిణాది అనేది సంపూర్ణం కాదు. అంతిమంగా మహారాష్ట్ర అనేది దెక్కన్‌లో భాగం.

– రాజు పారులేకర్, రచయిత

### ఇదీ చేదే!



చైనా యువత అత్యధిక స్థాయి నిరుద్యోగితను చవిచూస్తోంది. కమ్యూనిస్టు పార్టీ సహా షీ జిన్‌పింగ్ వాళ్లను మానవ శ్రమకూ, గ్రామాలకు తరలివెళ్లడానికీ అతీతులుగా భావించుకోవడం మానుకోవాలని చెబుతున్నారు. వాళ్లు 'చేదు మింగడాన్ని' నేర్చుకోవాలని సూచిస్తున్నారు.

– లీ యువాన్, కాలమిస్ట్

### ఒకటే లక్ష్యం



ఖాలిస్తానీ ట్రోల్స్ అందరి ప్రొఫైల్స్‌ను బాగా చూశాక, నేను గమనించిన అంశాలు: అందరూ ఎన్ఆర్ఐలు. వాళ్లకు సిక్కుల గురించిన పట్టింపు లేదు. వాళ్లు పంజాబ్‌లోని మాదక ద్రవ్యాలు, గ్యాంగ్‌స్టర్ల సమస్యల గురించి ఎప్పుడూ మాట్లాడరు. వాళ్లు చేసేదల్లా హిందువులను ట్రోల్ చేయడం.

– తరణ్‌జీత్ సింగ్, వ్యాఖ్యాత

### వాళ్లేరి మరి?



విమానయాన పరిశ్రమ ఎలా పనిచేస్తున్నదో నేను అర్థం చేసుకోవడం మానేశాను. నాలుగు సీట్లు, వీలైతే వరుసగా, ప్రత్యేకించి విండో, ఐల్ ఉండేట్టుగా ఇమ్మని కోచిలో (కేరళ) అభ్యర్థించాను. సారీ, అన్నీ బుక్కయ్యాయి, అందుబాటులో లేవు అన్నాడు. సరే, ఫర్లేదని చెప్పాను. తీరా బోర్డింగ్ అయ్యాక చూస్తే విమానం దాదాపుగా ఖాళీగా ఉంది.

– రీతూపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

ఇన్‌బాక్స్

## మన మూలాలపై నీలినీడలు

ఆధునిక మానవుడు ఒకే ఒక మూలం నుండి రాలేదని చెప్పే నూతన పరిశోధన ఫలితాలు ఇటీవల 'నేచర్' జర్నల్‌లో ప్రచురితం కావడంతో పరిణామ వాదులు ఈ ఫలితాల మీద ఉత్సుకతను చూపుతున్నారు. ఆధునిక మానవుడు పాలు ఇచ్చి పిల్లలను పెంచే జీవుల (ప్రైమేట్స్) నుండి వచ్చి ఉంటాడు అని డార్విన్ తన 'జాతుల పుట్టుక'(జెనిసిస్ ఆఫ్ స్పీసీస్) గ్రంథంలో పేర్కొన్నారు. అంటే కోతులు, చింపాంజీలు వంటి జీవులన్నిటి ఉమ్మడి పూర్వీకుడి నుండి నేటి మానవుడు పరిణామం చెందాడనేది డార్విన్ ఉద్దేశం. కానీ ఇటీవల అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా అంత్రపాలజీ విభాగానికి చెందిన బ్రేన్నా ఎం. హేన్ పరిశోధన పరిణామ మూలాలను మార్చే దిశగా ఉన్నట్లు కనబడుతోంది. ఈ పరిశోధన ఫలితాలు ఇటీవల (మే 17) 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

ఇప్పటి వరకు ఆఫ్రికా నుండి వచ్చిన ఒకే పూర్వీకుల సమూహం నుండి ఆధునిక మానవుడు వచ్చాడన్న విషయాన్ని అందరూ నమ్ముతున్నారు. ఆధునిక మానవులు భూమి అంతటా వ్యాపించడానికి ముందు ఆఫ్రికాలో ఒక మిలియన్ సంవత్సరాలు నివసించిన రెండు సమూహాల నుండి ఉద్భవించినట్లు శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. అంటే ఈ పరిశోధన మానవాళికి ఒక్క మూలం లేదని తేల్చి చెప్పిందన్నమాట.

దక్షిణాఫ్రికాలోని నామా సమూహం నుండి తీసుకొన్న జనాభా జన్యు డాటాను, అక్కడి ప్రాచీన మానవుల శిలాజ సాక్ష్యాధారాలతో పోల్చడం ద్వారా పరిశోధకులు మానవ పరిణామ కొత్త నమూనాను కనుగొన్నారు. దీనితో ఒకే ఆఫ్రికన్ జనాభా నుండి మానవులందరూ ఆవిర్భవించారని చెప్పే మాట సరికాదని తేలింది. ప్రస్తుత శాస్త్రీయ పరిశోధనలు దీర్ఘకాల పరికల్పనకు అంటే కొన్ని ఏళ్లకు పూర్వం ఇలా జరిగి ఉండవచ్చని చెప్పే విషయాలకు మద్దతు ఇవ్వలేదు అని తేల్చారు. దీంతో మానవుని మూల జీవి ఎవరు అనేది ప్రశ్నార్థకంగా మారింది.

– డా॥ మామిడాల ఇస్తారి
అసోసియేట్ ప్రొఫెసర్, కాకతీయ యూనివర్సిటీ

# వెలుగులివ్వడానికి కరిగిపోతూ...

అభిప్రాయం



ప్రదీప్‌రావు ఎర్రబెల్లి

'షూటింగ్ పనుల్లో భాగంగా కొద్ది రోజులు గోదావరిఖని కోల్ మైన్స్ ప్రాంతంలో ఉండాల్సి వచ్చింది. అక్కడ పరిస్థితులు చాలా హారిబుల్. ఎంతలా అంటే ఒకవైపు మనం కూర్చున్న పక్కనే భూమిలో నుండి పొగలు వచ్చేంత వేడి. ఆ బొగ్గు గనుల్లో కార్మికులు సంవత్సరాలుగా అలాంటి క్లిష్ట పరిస్థితులను ఎలా తట్టుకుంటున్నారో!' ఇటీవల పాన్ ఇండియా మూవీగా విడుదలైన 'దసరా' చిత్రం నిర్మాణం విశేషాలు పంచుకుంటూ మీడియాతో నేచురల్ స్టార్ నాని చెప్పిన మాటలు ఇవి.

నిజమే సినిమా షూటింగ్ కోసం సకల వసతులతో వెళ్లిన నటీనటులు కొద్ది సేపు అక్కడ గడిపేందుకే చుక్కలు కనిపిస్తే మరీ తరాలుగా అదే ఉపాధిగా చెమటోడుస్తున్న సింగరేణి కార్మికుల పరిస్థితి ఏంటి? మరీ ముఖ్యంగా ఎండాకాలంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా దేశ విద్యుత్ అవసరాల కోసం బొగ్గు ఉత్పత్తికి ప్రతికూల పరిస్థితుల్లోనూ పాటుపడుతున్న సింగరేణి కార్మికుల అవస్థలు ఏంటి? ఈ పరిస్థితులను తట్టుకోవడానికి సంస్థ ఏ విధంగా పాటుపడుతోంది?

'చీకటిపొరల్లో పని చేసే కార్మికులం, దేశానికి వెలుగునిచ్చే మిణుగురులం' నినాదంతో భూమి లోపల వందల మీటర్ల లోతులో రక్తాన్ని చెమటగా మార్చి ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి బొగ్గును వెలికి తీస్తారు సింగరేణి కార్మికులు. మరీ ముఖ్యంగా సింగరేణిలో అత్యధిక ఉత్పత్తి ఉండే ఉపరితల గనుల్లో నిత్యం వేలాది కార్మికులు వివిధ రకాల విధులు నిర్వహిస్తుంటారు. ఎండాకాలంలో ఓపెన్ కాస్ట్‌లో విధుల నిర్వహణ ఎంత కష్టంగా ఉంటుందంటే ఒకవైపు రికార్డు స్థాయిలో నమోదయ్యే ఉష్ణోగ్రతలతో ఒళ్లంతా మంటలు, చెమటలు!

ఉపరితల గనుల్లోనే పరిస్థితి అలా ఉంటే ఈ మండువేసవిలో భూగర్భ గనుల్లో వందల మీటర్ల లోతుల్లో పనిచేసే కార్మికుల పరిస్థితి ఏంటి అని సాధారణ జనం అనుకుంటారు. బయటి ఉష్ణో



గ్రతలతో సంబంధం లేకుండా ఒక వ్యక్తికి సాధారణంగా ఎంత ఆక్సిజన్ కావాలి? గని లోపల టెంపరేచర్ ఎంత ఉండాలి అన్నది ముందస్తుగానే నిర్ణయించి అందుకు అనుగుణంగా అక్కడ పరిస్థితులు కల్పిస్తారు.

అయితే సంస్థగా సింగరేణి క్లిష్ట పరిస్థితుల్లో విధులకు హాజరయ్యే ఉద్యోగులకు ఉపశమనం కలిగించేలా అనేక చర్యలు చేపడుతోంది. ఉద్యోగులకు ఎండ తీవ్రతను తట్టుకునేలా కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఉత్పత్తి ఎక్కువగా ఉండే ఉపరితల గనుల్లో ఎండ తీవ్రతను తట్టుకునేలాగా ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేపడుతోంది. ఎప్పటికప్పుడు పని ప్రదేశాల్లో భూమి లోపల నుంచి వస్తున్న వేడిని అదుపు చేసేలా వాటర్ స్ప్రే చేయిస్తోంది. దీంతో పూర్తి స్థాయిలో కాకున్నా దాదాపుగా ఎండ తీవ్రతను తట్టుకొని విధులు నిర్వహించేలా వెసులుబాటు కలుగుతోంది.


అయితే మధ్యాహ్నం ఒంటిగంట నుండి 3 గంటల మధ్య ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం... అదే సమయంలో మార్నింగ్ షిఫ్ట్ ఉద్యోగులు విధులు ముగించుకొని ఇంటికి వెళ్లాల్సి రావటం... సెకండ్ షిఫ్ట్ ఉద్యోగులు అదే సమయంలో విధులకు హాజరు కావాల్సి రావడం ఇబ్బంది కరంగా ఉందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు గంటలకు పూర్తయ్యే మొదటి షిఫ్టును ఒంటిగంటకు కుదించి, మూడు గంటలకు ప్రారంభం కావాల్సిన సెకండ్ షిఫ్టును నాలుగు గంటలకు ప్రారంభించాలని ఉద్యోగులు వారి తరఫున కార్మిక సంఘాలు యాజమాన్యాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే వేసవి వెసులుబాటులో భాగంగా అందజేస్తున్న సౌకర్యాలకు తోడు కార్మికుల డిమాండ్ మేరకు డ్యూటీ సమయాల్లో మార్పులు అవకాశం కల్పిస్తే దేశ అవసరాలకు సరిపడా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి కావలసిన బొగ్గును వెలికి తీయడానికి మరింత ఉత్సాహంగా సింగరేణి ఉద్యోగులు పాటు పడే అవకాశం ఉంది.

వ్యాసకర్త రాష్ట్ర బీజేపీ నాయకులు
మొబైల్: 99660 89696

# పరీక్షగా చూసేవాడు

మహాభారత సంగ్రామంలో జరిగిన వినాశనం తరవాత పరీక్షిత్తు ఒక్కడే పాండు వంశానికి ఏకైక వారసుడుగా మిగిలాడు.

యుద్ధం తరవాత జగత్తంతా 'అపాండవం' కావాలని ఉద్దేశించి అశ్వత్థామ బ్రహ్మాస్త్రం సంధించాడు. శ్రీకృష్ణుడు సుదర్శన చక్ర ప్రయోగం ద్వారా, పాండవులను దాని నుంచి కాపాడాడు. కానీ, ఆ బ్రహ్మాస్త్రం పాండువంశానికి వారసుడుగా, అభిమన్యుడి సంతానంగా, ఉత్తర గర్భంలో పెరుగుతున్న పిండాన్ని కూడా నాశనం చేయటానికి వెళ్లింది. తన మీదికి వస్తున్న ఆ అస్త్రాన్ని చూసి, ఆ బేల ఎంత భయపడిపోయిందో, పరుగెత్తి వెళ్ళి, శ్రీకృష్ణుడిని ప్రార్థించింది. 'కాలిన ఇనప ములుకుతో నా మీదికి వస్తున్న ఈ అస్త్రం నన్ను చంపితే చంపనియ్యి, ఫరవాలేదు. కానీ నా గర్భస్థ శిశువుకు ఎలాంటి హానీ కలగకుండా చూడు, ప్రభూ!



జ్యోతిర్మయం

అక్కడ సుదర్శన చక్రం పనిచేయదు కనక, తన వైష్ణవ తేజంతో ఉత్తర గర్భాన్ని ఆవరించి, కాపాడాడు కృష్ణుడు. వైష్ణవ తేజాన్ని బ్రహ్మ అస్త్రం గౌరవించి, శమించింది.

పది నెలలు నిండి శిశువు బయటికి వచ్చేటప్పుడు, బ్రహ్మాస్త్ర ప్రభావం ఆ పసిగుడ్డును దహించి వేయబోయింది. అప్పుడు మళ్ళీ భక్త పరాధీనుడైన వాసుదేవుడు అంగుష్ఠమాత్రమయిన ఆకారంతో వచ్చి, తన గదను చిరచిర తిప్పి, బ్రహ్మాస్త్రం వేడిమిని చల్లబరచి, శిశువును రక్షించాడు. 'నన్ను కాపాడుతున్న ఈ మహానుభావుడెవరో!' అని ఆ అమాయక శిశువు చూస్తుండగానే, అంతర్ధానమైపోయాడు. విష్ణువు చేత రక్షించబడ్డాడు కాబట్టి ఆ శిశువుకు 'విష్ణు రాతుడు' అని పేరు వచ్చింది. కాల క్రమంలో విష్ణురాతుడికి లోకంలో ఎవరిని చూసినా, వాళ్ళలో, తన తల్లి కడుపులో ఉన్నప్పుడు తనను రక్షించిన మహాపురుషుడి ఛాయ కనిపించేది. ఆ మహాపురుషుడు అందరిలో ఉండే సర్వాంతర్యామి కదా! అందుకే విష్ణురాతుడు అందరినీ పరకాయించి, పరీక్షగా చూసేవాడు కనక ఆయనకు 'పరీక్షిత్తు' అని పేరు వచ్చింది. తన తల్లి కడుపు లోపల, / ముసు చూచిన విభుడు విశ్వమున నెల్ల కలం/డనుచు పరీక్షింపగ జను/ లనఘ! 'పరీక్షిన్నరేంద్రు'డండ్రు మునీంద్రా! (పోతన భాగ 1–296).

– ఎం. మారుతి శాస్త్రి

## క్లుప్తంగా...

### కనీస వేతన సలహా మండలి ప్రమాణ స్వీకారం నేడు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నియమించిన కనీస వేతన సలహా మండలి చైర్మన్, సభ్యులు జూన్1న బాధ్యతలు స్వీకరించనున్నారు. చైర్మన్‌గా పి.నారాయణ, సభ్యులుగా మంచే నర్సింహులు, పి.నర్సయ్య, కటకం చేతన్, ఆర్.దుర్గాప్రసాద్, సి.నిరంజన్ రావు, భాషబోయిన శివశంకర్, సానికొమ్ము శంకర్‌రెడ్డి, జె.మల్లికార్జున్ తదితరులు ఆర్టీసీ క్రాస్‌లోని టంగుటూరి అంజయ్య కార్మిక సంక్షేమ భవన్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

### పోలీసుశాఖలో పదోన్నతుల పండుగ

**పదోన్నతుల ఫైలుకు సీఎం ఆమోదం**

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఎన్నో ఏళ్లుగా పోలీసు శాఖ ఉద్యోగులు ఎదురు చూస్తున్న పదోన్నతుల ప్రక్రియకు ఎట్టకేలకు సీఎం ఆమోదం లభించింది. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సీఎం కేసీఆర్ పదోన్నతులకు ఆమోదం తెలిపారు. దీంతో డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ)కి చేరిన పదోన్నతుల ఫైలు.. అక్కడ కూడా క్లియర్ అయినట్లు సమాచారం. దీంతో రాష్ట్రంలోని అన్ని జోన్లకు చెందిన సుమారు 500 మందికి పైగా వివిధ కేడర్లలో పదోన్నతులు పొందనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 70 మందికి అడిషనల్ ఎస్పీ నుంచి ఎస్పీ, డీఎస్పీ నుంచి అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతి కల్పించనున్నారు. ఇటీవలే ఈ జాబితా కూడా వెల్లడైంది. 300 మంది ఎస్‌ఐలు సీఐలుగా పదోన్నతి పొందనున్నారు. 150 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (డీఎస్పీ)గా పదోన్నతి కలగనుంది. ఇందులో వరంగల్ జోన్‌కు సంబంధించి 38 మంది ఉన్నారు. సీఎం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్న పోలీసు కుటుంబాలు.. దశాబ్ది ఉత్సవాల ముగింపులోపే ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతున్నాయి.

### నాకు ఇవ్వడమే తప్ప.. తీసుకోవడం తెలియదు

**ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ**



సమ్మేళనానికి ఎడ్లబండిపై వస్తున్న పువ్వాడ

రఘునాథపాలెం: సంపాదన కోసమే తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. అయితే తనకు ఇవ్వడమే తప్ప.. తీసుకోవడం తెలియదని ఆయన పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చిమ్మపుడిలో బుధవారం జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ ఎదుగుదలను చూసి కొన్ని శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. పార్టీని, ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకుని ఆర్థికంగా బలపడిన వారే (మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డిని ఉద్దేశించి) ఇప్పుడు సీఎం కేసీఆర్‌ను గద్దె దించుతాం.. అసెంబ్లీ గేట్లు తాకనిచ్చేది లేదంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. డబ్బు, అహంతో ప్రజల ఆత్మాభిమానాన్ని గెలుచుకోలేమనే విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రజాప్రతినిధిగా చేసిన మంచి పనులే ప్రజల ఆశీస్సులు అందిస్తాయని తెలిపారు. కాగా, కర్ణాటకలో బీజేపీ పూర్తిగా విఫలం కావడంతోనే ప్రజలు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ఆదరించారే తప్ప మరొకటి కాదని మంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణలో మళ్లీ సీఎం కేసీఆర్ గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని పేర్కొన్నారు.

### కవలలను అమ్మేసిన తండ్రి

ఆదిలాబాద్ రూరల్: పిల్లల పోషణ భారమని భావించి కన్న తండ్రే కవల పిల్లలను అమ్మేశాడు. వచ్చిన డబ్బులను మధ్యవర్తులతో కలసి పంచుకున్నాడు. అంతేకాక తనకు వచ్చిన డబ్బులతో ఓ వాహనాన్నీ కొన్నాడు. చైల్డ్ వెల్ఫేర్ అధికారుల ఫిర్యాదుతో కూపీ లాగిన పోలీసులు.. ఆ ముఠా గుట్టును రట్టు చేశారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. కర్ణాటకకు చెందిన శీతలే రమా, ఆమె కూతురు కోమల్.. సంతానం లేని వారు పెంచుకోవడానికి పిల్లలు కావాలని రమాకు సోదరుడైన ఆదిలాబాద్‌కు చెందిన ఆర్‌ఎంపీ జగన్నాథ్‌కు చెప్పారు. జగన్నాథ్ ఈ విషయాన్ని ఆదిలాబాద్ మండలం బంగారుగూడకు చెందిన షారూఖ్‌కు చెప్పాడు. కాగా, 2022లో బంగారుగూడకు చెందిన గంగాధర్ భార్య రాధ కవల ఆడశిశువులకు జన్మనిచ్చి అనారోగ్యంతో మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న షారూఖ్.. గంగాధర్‌ను సంప్రదించాడు. డబ్బులు ఇస్తే పిల్లలను ఇవ్వడానికి సిద్ధమేనని గంగాధర్ ఒప్పుకున్నాడు. తన తమ్ముడుతో కలసి గంగాధర్ కర్ణాటకలోని కుంట కార్వా గ్రామానికి వెళ్లాడు. సమీపంలోని ఓ లాడ్జిలో 2022 ఆగస్టులో 20 రోజుల వయసు ఉన్న శిశువుల్లో పెద్ద శిశువును రమా, కోమల్ ఓ వ్యక్తికి అప్పగించి రూ.2.40 లక్షలు తీసుకున్నారు. ఆ తర్వాత మరో శిశువును రూ.3 లక్షలు అమ్మారు. ఇందులోనుంచి రూ.2.50 లక్షలు తీసుకున్న గంగాధర్.. టాటా ఏస్ వాహనాన్ని కొనుగోలు చేశాడు.

# నయా 'అసెంబ్లీ'పై నజర్

- అనువైన స్థలాల అన్వేషణలో నిమగ్నమైన అధికార యంత్రాంగం
- పరిశీలనలో న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రాంగణం, పాటిగడ్డ స్థలం
- న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ స్థలంలో హెచ్‌ఓడీల ట్విన్ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి మొగ్గు
- అయితే ఇరుకు రోడ్ల మధ్య ఉన్నందున ట్రాఫిక్ చిక్కులు తప్పవనే ఆందోళన
- 'ఆదర్శనగర్' కొత్త అసెంబ్లీ భవనానికి బాగుంటుందనే అభిప్రాయం
- సీఎం ఆదేశాల మేరకు చర్యలు తీసుకునే ఆలోచనలో అధికారులు



సాక్షి, హైదరాబాద్: కొత్త అసెంబ్లీ భవన నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం అనువైన స్థలాలు వెతికే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రి రోడ్డులోని పాటిగడ్డలో దాదాపు 40 ఎకరాల స్థలం ఉంది. అక్కడ నిర్మిస్తే బాగుంటుందన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమైందని సమాచారం. కాగా ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ కూడా ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. ఆ ప్రాంగణంలో 17 ఎకరాల స్థలం అందుబాటులో ఉంది. అసెంబ్లీ భవనం అక్కడ నిర్మించినా బాగానే ఉంటుందని సూచించినట్టు తెలిసింది.

**ఎర్రమంజిల్‌లో 2019లోనే భూమిపూజ**

రాష్ట్ర సచివాలయానికి కొత్తగా భవనం సమకూరటంతో ప్రభుత్వం ఇక అసెంబ్లీ భవనంపై దృష్టి పెట్టింది. వాస్తవానికి ఇటీవల ప్రారంభోత్సవం జరుపుకొన్న సచివాలయ భవనంతో పాటు అసెంబ్లీ కొత్త భవన నిర్మాణానికి కూడా 2019లో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు శంకుస్థాపన చేశారు. సచివాలయ భవనాన్ని పాత భవనాలు కూల్చి అదే స్థానంలో నిర్మించగా, అసెంబ్లీ భవనాన్ని మాత్రం ఇర్రమ్ మంజిల్ (ఎర్రమంజిల్) ప్యాలెస్ ఉన్న స్థానంలో నిర్మించాలని నిర్ణయించి అక్కడ భూమి పూజ చేశారు. అయితే దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఎర్రమంజిల్ భవనం వారసత్వ కట్టడం కావటం, అద్భుతమైన నిర్మాణ శైలితో కూడినది కావటంతో, దాన్ని కూల్చాలన్న నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కొంతమంది కోర్టును కూడా ఆశ్రయించారు. మరోవైపు ఆ భవనం ఉన్న ప్రాంతంలో సచివాలయం నిర్మిస్తే భవిష్యత్తులో పార్కింగ్ సమస్య తలెత్తుతుందని, ఆ రోడ్డులో తీవ్ర ట్రాఫిక్ చిక్కులు నెలకొంటాయని అధికారులు నివేదించారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం అక్కడ అసెంబ్లీ భవన నిర్మాణ ఆలోచనను విరమించుకుంది. తర్వాత ప్రస్తుత అసెంబ్లీ భవనం ఉన్న చోటుకు పక్కనే ఉన్న పబ్లిక్ గార్డెన్‌లో నిర్మిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన కూడా అప్పట్లో జరిగింది. అయితే పబ్లిక్ గార్డెన్ నగరంలోనే తొలి అతిపెద్ద ఉద్యానవనం కావటం, అందులో ఇప్పటికీ వేల సంఖ్యలో చెట్లు ఉండటంతో దాన్ని కూడా పక్కన పెట్టేశారు.

**అక్కడ అసెంబ్లీకైతేనే బాగుంటుంది!**

రెండురోజుల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకస్మికంగా సచివాలయం ముందున్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విభాగాధిపతులకు సమీకృత భవన సముదాయం ఉంటే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రెండు జంట భవనాలను నిర్మించాలని ఆయన చెప్పారు. ఇందుకు సంబంధించి ఆదర్శనగర్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ స్థలం, పాటిగడ్డ స్థలం పరిశీలనకు వచ్చాయి. ఇందులో న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ స్థలం అయితే బాగుంటుందని సీఎం అన్నట్టు తెలిసింది. అయితే అది అధికారులకు సంబంధించిన జంట భవనాల కోసం కన్నా అసెంబ్లీకైతేనే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

**ట్రాఫిక్ ఇబ్బందులు తప్పవు..!**

ప్రస్తుతం అన్ని ప్రభుత్వ విభాగాల అధిపతులకు సొంతంగా భవనాలున్నాయి. అవన్నీ విశాలంగానే ఉన్నాయి. అవి సచివాలయ భవనానికి కేవలం నాలుగైదు కి.మీ దూరంలోనే ఉన్నాయి. ఇప్పుడు ఆ విభాగాలన్నింటికీ సమీకృత భవన సముదాయం నిర్మిస్తే వేల సంఖ్యలో ఉద్యోగులు ఒక్కచోటకు రావాల్సి ఉంటుంది. పంచాయతీరాజ్, నీటిపారుదల, రోడ్లు భవనాలు, రవాణా.. ఈ నాలుగు శాఖల భవనాల్లోనే ప్రస్తుతం మూడు వేల మంది పనిచేస్తున్నారు. ఇతర విభాగాలన్నింటినీ కలిపితే ఆ సంఖ్య మరింత భారీగా ఉంటుంది. న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రాంగణం ఇరుకు రోడ్ల మధ్య ఉన్నందున వాటితో పాటు, అక్కడికి దారితీసే ఇతర రోడ్లపై తీవ్ర ట్రాఫిక్ చిక్కులేర్పడే ప్రమాదం ఉంది. మరోవైపు ఆ విభాగాలను కొత్త భవనాల్లోకి తరలిస్తే, వాటికి ఉన్న ప్రస్తుత భవనాలు నిరుపయోగంగా మారతాయి.తదుపరి సమావేశాల్లో ఈ దిశలో చర్చ జరిగే అవకాశం ఉందని, దీనిపై సీఎం నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది.

### కొత్త అసెంబ్లీ భవనానికీ ధోల్పూర్ ఎర్రరాయి!

రాజస్తాన్‌లోని ధోల్పూర్ గనుల నుంచి తెప్పించిన ఎర్ర రాయి.. భవిష్యత్తులో నిర్మించబోయే తెలంగాణ అసెంబ్లీ భవనానికి వినియోగిస్తారని సమాచారం. ఇటీవల కొత్త సచివాలయ భవనం కోసం ధోల్పూర్‌లో ఓ గని నుంచి దాదాపు 4 వేల క్యూ బిక్ మీటర్ల ఎర్రరాయిని తెప్పించారు. దాన్ని సచివాలయ బేస్‌మెంట్, భవనం పై భాగంలో వినియోగించారు. దానికి సరిపోగా మరో వేయి క్యూబిక్ మీటర్ల వరకు మిగిలింది. దీన్ని రోడ్లు భవనాల శాఖ ఈఎన్సీ కార్యాలయం ఉండే ఇర్రమ్‌మంజిల్‌కు తరలించారు. అక్కడి పురాతన ప్యాలెస్ ముందు భాగంలో నిల్వ చేశారు. అది ఖరీదైన రాయి కావటంతో.. ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా సెక్యూరిటీ సిబ్బందిని కూడా ఉంచారు. ప్రస్తుతం రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఆసు పత్రి భవనాల నిర్మాణం జరుగుతోంది. వరంగల్‌లో రాష్ట్రంలోనే ఎత్తయిన ఆసుపత్రి భవనం రూపుదిద్దుకుంటుండగా, మరో పక్షం రోజుల్లో నిమ్స్ విస్తరణ పనులు మొదలు కానున్నాయి. అయితే ఆసుపత్రి భవనాలకు ఈ ఎర్రరాయి వినియోగం సరికాదని అధికారులు నిర్ణయించారు. ఇక సచివాలయం తరహాలోనే అసెంబ్లీ భవనాన్ని కూడా ప్రత్యేక డిజైన్‌తో నిర్మించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఎర్ర రాయిని దానికి వినియోగిస్తే బాగుంటుందని అధికారులు భావిస్తున్నారు. కొత్త అసెంబ్లీ భవనానికి ఏ స్థలం అయితే బాగుంటుందో ఇప్పటివరకు తేలనప్పటికీ, నగిషీలకు బాగా నప్పే ధోల్పూర్ ఎర్రరాయి అయితే సిద్ధంగా ఉన్నట్టయింది.

# పేదలకు ఇళ్లపై తీవ్ర నిర్లక్ష్యం

- 2.5 లక్షల ఇళ్లకు 30 వేలు కూడా పూర్తి చేయలేదు
- రాష్ట్ర ప్రభుత్వంపై బండి సంజయ్ ధ్వజం
- రాష్ట్రంలో కేంద్ర కార్యక్రమాలపై వివరణ
- 9090902024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి మద్దతు పలకాలని విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పేదలకు ఇళ్లు నిర్మించి వచ్చే విషయంలో కేసీఆర్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. 'పీఎం ఆవాస్ యోజన కింద దేశవ్యాప్తంగా 3 కోట్ల ఇళ్లు నిర్మించి నిలువ నీడలేని వాళ్లందరికీ గూడు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్రం రాష్ట్రానికి 3.5 లక్షలకుపైగా ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో 2.5 లక్షల ఇళ్లకు అర్బన్ ఆవాస్ యోజన కింద రూ.4,466 కోట్లు మంజూరు చేస్తే.. ఇప్పటివరకు 30 వేల ఇళ్లు కూడా పూర్తి చేయలేదు. అవి పూర్తిచేస్తే మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని కేంద్రం చెబుతున్నా కేసీఆర్ పట్టించుకోవడం లేదు..'అని విమర్శించారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం 9 ఏళ్ల పాలన పూర్తి సందర్భంగా చేపట్టిన 'మహాజన సంపర్క్ అభియాన్'లో భాగంగా.. రాష్ట్రంలో కేంద్రం చేపడుతున్న పలు కార్యక్రమాలను బుధవారం సంజయ్ మీడియాకు వివరించారు. మోదీ 9 ఏళ్ల పాలనపై రూపొందించిన ప్రత్యేక గీతాన్ని, ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కాగా మోదీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో జల్ జీవన్ మిషన్ కింద తెలంగాణలో 54 లక్షల మందికి నల్లాల ద్వారా మంచి నీరందించామని, 11 లక్షల 54 వేల మందికి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశామని తెలిపారు. తెలంగాణకు 7 కోట్ల 76 లక్షల కరోనా వ్యాక్సిన్ డోసులు అందించామని చెప్పారు.

**అగ్రనేతల సభలకు సిద్ధం**

మోదీ ప్రభుత్వానికి మిస్డ్ కాల్ (నంబర్ 9090902024) ద్వారా మద్దతు పలకాలని సంజయ్ విజ్ఞప్తి చేశారు. నెలరోజుల పాటు నిర్వహించే ఈ అభియాన్‌లో భాగంగా రాష్ట్రంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బహిరంగ సభలు నిర్వహిస్తామని జాతీయ పార్టీకి విన్నవించినట్టు తెలిపారు.

**నేడే మొదలు..**

జూన్ 1 నుండి మొదలుకుని పార్లమెంట్ నియోజకవర్గం వారీగా మీడియా సమావేశాల నిర్వహణ, కేంద్రం చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టుల సందర్శన, ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక్కో కేంద్ర మంత్రి/జాతీయ నాయకుల పర్యటన, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సీనియర్ నాయకులు, మేధావులతో సమ్మేళనాలు, మోర్చాల సంయుక్త సమ్మేళనం వంటివి ఇందులో ఉన్నాయి.

**నిలుపుకొనే హామీలనే మేనిఫెస్టోలో పెడతాం**

'ఆచరణ సాధ్యమయ్యే హామీలనే మేనిఫెస్టోలో పెడతాం..'అని బండి సంజయ్ స్పష్టం చేశారు. బుధవారం రాత్రి బీసీ మేధావుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సబ్ ప్లాన్, డిక్లరేషన్ పేరుతో ఓట్లు దండుకునే పార్టీలను, నాయకులను గుర్తించకపోతే బీసీలు మరింత అణగారినవర్గాల వారిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు.

# పంప్‌హౌస్‌లు ఎందుకు మునిగాయి?

- కాళేశ్వరంపై ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించిన కాగ్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతలు మునకపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) మరింత దృష్టి పెట్టింది. ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం పంప్‌హౌస్‌లు ఎందుకు నీటి మునిగాయి? ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి ఇంజనీరింగ్ తప్పిదాలు జరిగాయి? పంప్‌హౌస్‌ల మునకతో ఎంత నష్టం జరిగింది? నష్టాన్ని ఎవరు భరించారు?.. అంటూ రాష్ట్ర పభుత్వంపై తాజాగా ప్రశ్నల వర్షం కురిపించినట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆడిటింగ్‌లో భాగంగా బుధవారం హైదరాబాద్‌లోని అకౌంటెంట్ జనరల్ (ఏజీ) కార్యాలయంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కాగ్ సమావేశం నిర్వహించింది. శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, ఈఎన్సీ (జనరల్) సి.మురళీధర్, ఇతర అధికారులు కాగ్ ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

**రెండేళ్లుగా ఆడిటింగ్**

కాళేశ్వరం ప్రాజెక్టుపై గత రెండేళ్లుగా కాగ్ విస్తృత రీతిలో ఆడిటింగ్ నిర్వహిస్తోంది. ప్రాజెక్టు వాస్తవ అంచనా వ్యయం, తర్వాత పెంచిన అంచనా వ్యయం, అదనపు టీఎంసీ పనులతో పెరిగిన భారం, ఇప్పటివరకు పూర్తైన పనులు, చేసిన వ్యయం, ప్యాకేజీల వారీగా పనులకు ఇచ్చిన అనుమతులు, అంచనా వ్యయాలు తదితర వివరాలను నీటి పారుదల శాఖ నుంచి గతేడాది కాగ్ సేకరించింది. వాటిపై అనుమానాలను నివృత్తి చేసుకోవడానికి తాజాగా ఆ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించింది. వరదను అంచనా వేయడంలో ఎందుకు విఫలం అయ్యారు ? పంప్‌హౌస్‌లను తక్కువ ఎత్తులో ఎందుకు నిర్మించారు? పునరుద్ధరణకు ఎంత ఖర్చు అయింది? పాడైన మోటార్లు, ప్యానెల్ బోర్డులను ఏ కంపెనీ నుంచి కొనుగోలు చేశారు? ఏ దేశం నుంచి దిగుమతి చేసుకున్నారు ? తదితర వివరాలను కూడా అడిగినట్టు తెలిసింది. డిఫెక్ట్ లయబిలిటీ పిరియడ్ గడువులోపే పంప్‌హౌస్‌లు నీట మునగడంతో పునరుద్ధరణ వ్యయాన్ని నిర్మాణ సంస్థే భరించిందని రజత్‌కుమార్ వివరణ ఇచ్చినట్టు సమాచారం. ఇదిలాఉండగా, నిర్వాసితుల స్థితిగతులపై సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించారా? వారికి ఎలాంటి పరిహారం, పునరావాసం ప్యాకేజీలు అందజేశారు ? ఎంత ఖర్చు చేశారు? ఇంకా ఎంత మందికి పరిహారం చెల్లించాల్సి ఉంది వంటి వివరాలను సైతం కాగ్ ఆరా తీసినట్టు తెలిసింది. కాగా, త్వరలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆడిట్ నివేదికను రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టేందుకు గాను కాగ్ సమర్పించే అవకాశం ఉంది.

# క్వింటాల్ పత్తి రూ.8 వేలు!

▶ మొదటి పేజీ తరువాయి

15 నుంచి 21 ఏళ్ల నెలవారీ ధరలను విశ్లేషించింది. ఈ విశ్లేషణ ఫలితాలు, మార్కెట్ సర్వేలను పరిశీలించి 2023–24 వానాకాలం (ఖరీఫ్) పంటల ధరలు ఏ విధంగా ఉండవచ్చో అంచనా వేసింది. వరంగల్ ప్రధాన మార్కెట్‌ను పరిగణనలోకి తీసుకుంటే వచ్చే నవంబర్–ఫిబ్రవరి మధ్య కాలంలో పత్తి ధర క్వింటాల్‌కు రూ.7,550 నుంచి రూ.8,000 వరకు ఉంటుందని తెలిపింది. దీనితో పాటు వరి, మిర్చి, కంది తదితర పంటల ధరలను కూడా అంచనా వేసింది. అయితే పంట రకం, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితులపై ఆధారపడి అంచనా ధరల్లో మార్పు ఉండొచ్చని పేర్కొంది. కాగా వ్యవసాయ మార్కెట్ ఇంటిలిజెన్స్ కేంద్రం అంచనాల ప్రకారం..ఏయే పంటలు వేయాలో నిర్ణయం తీసుకుని రైతులు సాగుకు సన్నద్ధం కావాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచించింది.

**మద్దతు ధరల కంటే ఎక్కువే..**

ఈ ఏడాది రాష్ట్రంలో 65 లక్షల ఎకరాల నుంచి 70 లక్షల ఎకరాల వరకు పత్తి సాగు అయ్యేలా చూడాలని అధికారులు భావిస్తున్నారు. ఆ మేరకు రైతులకు సూచిస్తున్నారు. ఆ తర్వాత వరి ఎలాగూ భారీగానే సాగవుతుంది. కాబట్టి పత్తి తర్వాత కంది సాగును కూడా పెంచాలనేది సర్కారు ఉద్దేశం. కాగా ఖరీఫ్‌లో పత్తి, వరి, కంది పంటలకు మద్దతు ధరకంటే ఎక్కువ ధరలే లభిస్తాయని వ్యవసాయ మార్కెట్ ఇంటిలిజెన్స్ కేంద్రం అంచనా వేయడం గమనార్హం. పత్తికి మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 6,380గా ఉంది. అయితే 2021–22 వానాకాలం సీజన్‌లో పత్తి ధర మార్కెట్లో ఏకంగా రూ.12 వేల వరకు పలికింది. దీంతో రైతులు గత సీజన్‌లో అంత ధర వస్తుందని భావించారు. కానీ రూ. 7–8 వేలకు మించలేదు. దీంతో చాలామంది రైతులు మంచి ధర కోసం ఎదురుచూస్తూ పత్తిని ఇళ్లల్లోనే దాచుకున్నారు. అందులో చాలావరకు పాడైపోయింది. ఇక ఈసారి కూడా పత్తి ధర రూ.8 వేల వరకు ఉంటుందని వ్యవసాయ మార్కెట్ ఇంటిలిజెన్స్ కేంద్రం ప్రకటించడంతో రైతులు పత్తి సాగుకు ఏ మేరకు ముందుకు వస్తారో చూడాల్సి ఉంటుంది.

**మిర్చి ధరలో మార్పు ఉండకపోవచ్చు..**

వరికి మద్దతు ధర సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2,040, ఏ గ్రేడ్ రకానికి రూ. 2,060గా ఉంది. ఇంటిలిజెన్స్ కేంద్రం అంచనా ప్రకారం.. సాధారణ వరి రకం ధర వచ్చే నవంబర్–డిసెంబర్ నెలల్లో సూర్యాపేట ప్రధాన మార్కెట్ లెక్క ప్రకారం క్వింటాల్‌కు రూ.1,980 నుంచి రూ.2,060 వరకు ఉంటుంది. ఏ గ్రేడ్ రకం ధర మాత్రం జమ్మికుంట ప్రధాన మార్కెట్‌ను ఆధారంగా చేసుకొని రూ.2,060 నుంచి రూ.2,460 వరకు ఉండొచ్చని అంచనా వేసింది. ఇక మిర్చి ధరను ఖమ్మం ప్రధాన మార్కెట్‌ను ఆధారం చేసుకొని ప్రకటించింది. జనవరి–మార్చి నెలల్లో రూ.18,500 నుంచి రూ.20 వేల వరకు పలికే అవకాశం ఉందని పేర్కొంది. అయితే మిర్చికి ఈ ఏడాది ఖమ్మం మార్కెట్లో అత్యధికంగా రూ.25 వేల ధర ఉండగా, సాధారణంగా కూడా రూ.20 వేల నుంచి రూ. 22 వేల వరకు పలకడం విశేషం. కాబట్టి మిర్చి ధరల్లో ఈసారి కూడా పెద్దగా మార్పు ఉండకపోవచ్చు. మొక్కజొన్న మద్దతు ధర క్వింటాల్‌కు రూ.1,962 కాగా, వచ్చే వానాకాలం సీజన్‌లో బాదేపల్లి ప్రధాన మార్కెట్ ఆధారంగా అక్టోబర్–నవంబర్ మధ్య కాలంలో రూ.1,740 నుంచి రూ.2,015 ఉండొచ్చని అంచనా వేసింది. పత్తితో పాటు కంది పంటను కూడా గణనీయంగా సాగు చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది. కంది మద్దతు ధర రూ.6,600 ఉండగా, తాండూరు ప్రధాన మార్కెట్‌ను ఆధారం చేసుకొని జనవరి–ఫిబ్రవరి నెలల్లో దీని ధర రూ.7,300 నుంచి రూ.7,600 మధ్య ఉండొచ్చని ఇంటిలిజెన్స్ కేంద్రం లెక్కగట్టింది.

**2023-24 వానాకాలం పంటల అంచనా ధరలు ఇలా..**

| పంట | అంచనా ధర (క్వింటాల్‌కు రూ.లలో) |
|---|---|
| వరి (సాధారణం) | 1980-2060 |
| వరి (గ్రేడ్-ఏ) | 2060-2460 |
| మొక్కజొన్న | 1740-2015 |
| జొన్న | 1850-2200 |
| సజ్జ | 1920-2150 |
| రాగి | 2450-2720 |
| పెసర | 6500-6700 |
| కంది | 7300-7600 |
| మినుములు | 6100-6400 |
| వేరుశనగ | 5600-5900 |
| సోయాచిక్కుడు | 4700-5000 |
| పొద్దుతిరుగుడు | 4500-4700 |
| ఆముదం | 5200-5500 |
| పత్తి | 7550-8000 |
| మిరప | 18500-20000 |
| పసుపు | 6300-6600 |

# బండెనక బండి కట్టి..

- 150 ట్రాక్టర్లతో పశుగ్రాసం తరలింపు
- 11 గోశాలలకు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వితరణ




ట్రాక్టర్ నడుపుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పక్కన సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య

ఖమ్మం అర్బన్: ట్రాక్టర్ వెనుక ట్రాక్టర్ మొత్తం 150 ట్రాక్టర్లు వరిగడ్డితో తరలివచ్చాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నేతృత్వాన సేకరించిన వరి గడ్డిని ఖమ్మంలోని 11 గోశాలలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన గోపూజలో ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు అదనపు కలెక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటవీరయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ స్ఫూర్తితో రాష్ట్ర అవతరణ వేడుక సందర్భంగా గోశాలలకు పశుగ్రాసం వితరణ చేసినట్లు పేర్కొన్నారు.

# మా ఇళ్లు మాకు ఇప్పించండి..

- సర్పంచ్ ఇంటి ఎదుట 'డబుల్'లబ్ధిదారుల ధర్నా

జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకోసం లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. జూలూరుపాడు మండలం పాపకొల్లులో బుధవారం ఈ ఘటన జరిగింది. లాటరీ ద్వారా తమకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే అప్పగించాలని డిమాండ్ చేస్తూ పలువురు లబ్ధిదారులు గ్రామ సర్పంచ్ ఇంటి ఎదుట పురుగుమందు డబ్బాలతో నిరసనకు దిగారు. గ్రామంలో 2018లో 51 డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి లాటరీ పద్ధతిన లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే అందులో 14 మందికి ఇళ్లు ఇవ్వకుండా ఇతరులకు కేటాయించారు. దీంతో లబ్ధిదారులు తమ ఇళ్లు తమకు అప్పగించాలని ఎంతో కాలంగా ఆందోళన చేస్తున్నా అధికారులు వారి గురించి పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో 16 రోజులుగా బాధితులు నిరసన తెలుపుతున్నారు. అధికారులను, ప్రజాప్రతినిధులను కలసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో గ్రామ సర్పంచ్ బాదావత్ లక్ష్మి ఇంటి ఎదుట పురుగుమందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. భూక్యా జమ్లీ, ధరావత్ శాంతి అనే లబ్ధిదారులు పురుగుమందు తాగేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో మందు వారిపై పడటంతో వాసనకు తట్టుకోలేక స్పృహ కోల్పోయారు. వారిద్దరినీ జూలూరుపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తహసీల్దార్ మాట్లాడుతూ.. 51 డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 11 ఇళ్లపై కోర్టులో స్టే ఉందని, మిగిలిన ఇళ్లలో ఎవరైనా అక్రమంగా ఉంటే వారిని ఖాళీ చేయించి లబ్ధిదారులకు ఇచ్చేలా చూస్తామన్నారు.

## క్లుప్తంగా

### ఓటీటీల్లో కూడా పొగాకు వ్యతిరేక హెచ్చరికలు

**కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**



**న్యూఢిల్లీ:** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఓవర్ ది టాప్ (ఓటీటీ) ప్లాట్‌ఫామ్‌ల్లో కూడా పొగాకు వ్యతిరేక హెచ్చరికలు, ప్రకటనల ప్రసారాన్ని తప్పనిసరి చేసింది. సినిమా థియేటర్లు, టీవీ కార్యక్రమాల్లో మాదిరిగానే ఓటీటీల్లో కూడా పొగాకు వ్యతిరేక డిస్‌క్లెయిమర్లు వేసేలా సిగరెట్లు మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం, 2004కు కేంద్రం సవరణలు చేసింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో పొగాకు వ్యతిరేక ప్రకటనలను తప్పనిసరి చేసిన తొలి దేశం భారతే. ఇకపై ఓటీటీల్లో ప్రసారమయ్యే ఏ కార్యక్రమానికైనా ముందు 30 సెకండ్లు, లేదంటే మధ్యలో 30 సెకండ్లు పొగాకు వాడకం క్యాన్సర్ కారకం, ఆరోగ్యానికి హానికరమన్న ప్రకటన ప్రసారం చేయాలి. కార్యక్రమాల్లో పొగ తాగే, మద్యం సేవించే సన్నివేశాలుంటే అది హానికరమన్న డిస్‌క్లయిమర్ స్క్రీన్‌పై 20 సెకండ్లు తప్పనిసరిగా రావాలి. ఈ హెచ్చరికలు, ప్రకటనలు ఓటీటీ కంటెంట్ ప్రసారమయ్యే భాషలోనే ఉండాలని కేంద్రం స్పష్టం చేసింది. ఓటీటీల్లో ప్రసారమవుతున్న వెబ్ సిరీస్‌లు, ఇతర కార్యక్రమాల్లో పొగాకు ఉత్పత్తుల్ని విచ్చలవిడిగా చూపుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

### అక్రమ వలసదారుల పిల్లలకు... పౌరసత్వ హక్కులు రద్దు: ట్రంప్

**వాషింగ్టన్:** అమెరికాకు అక్రమంగా వచ్చిన వలసదారులకు పుట్టేవారికి పౌరసత్వ హక్కుల్ని తాను అధికారంలోకి వస్తే రద్దు చేస్తానని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు వెంటనే ఉత్తర్వులు జారీ చేస్తానంటూ ప్రచార వీడియోలో చెప్పారు.

### టచ్‌లో మరింత మంది 'షిండే' ఎమ్మెల్యేలు: రౌత్

**ముంబై:** మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన ఎమ్మెల్యేల్లో మరింత మంది తమకు 'టచ్'లోకి వస్తున్నట్టు శివసేన (ఉద్ధవ్) ఎంపీ, అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ చెప్పుకొచ్చారు. ''షిండే వర్గంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలంతా వచ్చే ఎన్నికల్లో తమ గుర్తుపై పోటీ చేయాల్సిందేనని బీజేపీ అంటోంది. వారికిది ఇష్టం లేదు. ఈ మేరకు మాకు కచ్చితమైన సమాచారముంది'' అన్నారు.

**కర్ణాటక ఫలితాలతో దేశ రాజకీయ ముఖచిత్రం మారింది. బీజేపీ ఇప్పటికీ ఉత్తరభారతం, ఈశాన్య భారతంలో తన పట్టు ప్రదర్శిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రమే బీజేపీ కంటే కాంగ్రెస్‌కు ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. గత దశాబ్ద కాలంలో దేశ రాజకీయాల్లో పెనుమార్పులే వచ్చాయి. దక్షిణాదిలో పెద్దగా బలం పుంజుకోలేకపోయినప్పటికీ ఉత్తరాది రాష్ట్రాలు, ఈశాన్య ప్రాంతాల్లో మాత్రం బీజేపీ తన పట్టు కొనసాగిస్తూ వస్తోంది..**

# ఉత్తరంలోనే కమలం హవా...

**తూర్పు, పశ్చిమ, ఈశాన్య భారతాల్లో మెరుగు**

**దక్షిణాదిన అంతంతే, మెరుగవుతున్న కాంగ్రెస్**


దశాబ్ద కాలంగా బీజేపీ అత్యధికంగా పట్టు నిలుపుకున్నది ఉత్తరాది రాష్ట్రాల్లోనే. అయితే ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్తాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో 2017 నాటికి 60 శాతం అసెంబ్లీ స్థానాలు బీజేపీ ఖాతాలో ఉంటే, 2022 నాటికి 47 శాతానికి తగ్గాయి. 2023కు మరింత తగ్గి 44 శాతానికి పరిమితమైంది. ఉత్తరాదిన యూపీలో బీజేపీ వరస విజయాలతో ఊపు మీదుంది. ఇక ఈశాన్య రాష్ట్రాలు కూడా బీజేపీ వైపే ఉన్నాయి. 2012లో అక్కడ ఏమాత్రం బలం లేని కమలదళం పదేళ్లలో అనూహ్యంగా పుంజుకుంది.

**దక్షిణం మినహా...**


మొత్తం 498 ఈశాన్య అసెంబ్లీ స్థానాల్లో బీజేపీకి అప్పట్లో కేవలం 2 శాతం స్థానాలే ఉండగా ఇప్పుడది ఏకంగా 36 శాతానికి పెరిగింది పశ్చిమ భారతంలోనూ బీజేపీయే కీ ప్లేయర్. గోవా, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో బీజేపీకి 2012లో 44% సీట్లుండగా ఇప్పుడు 52 శాతానికి పెరిగాయి. తూర్పుభారతంలోనూ బీజేపీ మెరుగవుతూ వస్తోంది. బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో 2012లో బీజేపీకి ప్రతి ఐదుగురు ఎమ్మెల్యేల్లో ఒక్కరే ఉండగా ఇప్పుడు ప్రతి నలుగురిలో ఒకరున్నారు.

- గత 11 ఏళ్లలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలం తగ్గుతూ వస్తోంది. 2013, 2018లో జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికలు కాంగ్రెస్‌కు కలిసిరాలేదు.
- ఇన్నేళ్లుగా బీజేపీ, కాంగ్రెస్‌యేతర పార్టీలు అసెంబ్లీల్లో తమ పట్టు కొనసాగిస్తూ వస్తున్నాయి. దేశవ్యాప్తంగానున్న ఎమ్మెల్యేలలో 50% మంది ప్రాంతీయ పార్టీల్లోనే ఉన్నారు. రాష్ట్రాల్లోని 3వ వంతు మంది ఎమ్మెల్యేలు బీజేపీకి చెందిన వారు. ఇక దక్షిణాది రాష్ట్రాల్లో ప్రతీ 10 మంది ఎమ్మెల్యేలలో బీజేపీకి ఒకరే ఉన్నారు.
- 2012 మార్చిలో కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా 1,224 మంది ఎమ్మెల్యేలు ఉంటే బీజేపీకి 845 మంది ఉన్నారు. అప్పట్లో దేశవ్యాప్తంగా హస్తం హవా ఉండేది. ఆ తర్వాత కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టిసి క్రమంగా బీజేపీ బలపడుతూ వచ్చింది. 2023 మే నాటికి దేశంలో 4,033 మంది ఎమ్మెల్యేలు ఉంటే అందులో బీజేపీకి చెందినవారు 1,329 కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 735కి తగ్గిపోయారు.

**ప్రాంతాలవారీగా ఎమ్మెల్యేల బలాబలాలు**




**పార్టీల వారీగా ఎమ్మెల్యేల బలం (శాతాల్లో)**




**కాంగ్రెస్ మరింత పట్టు పెంచుకుంటుందా?**



2012–22 మధ్య దేశవ్యాప్తంగా బీజేపీ అదనంగా 540 ఎమ్మెల్యే స్థానాలను సంపాదించుకుంటే కాంగ్రెస్ 505 సీట్లు కోల్పోయింది! రాహుల్ గాంధీ పాదయాత్ర తర్వాత కర్ణాటకలో సాధించిన విజయం నేపథ్యంతో మున్ముందు తన పట్టు ఇంకా పెరుగుతుందని కాంగ్రెస్ ధీమాగా ఉంది. ఈ ఏడాది చివర్లో జరగనున్న మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల అనంతరం గ్రాఫ్ మరింత మెరుగవుతుందని ఆశిస్తోంది.



-సాక్షి, నేషనల్ డెస్క్

# ఆహార ధాన్యాల స్టోరేజీకి... అతి భారీ పథకం

**7 కోట్ల టన్నుల సామర్థ్యం**

- రూ.లక్ష కోట్లతో ఐదేళ్లలో ఏర్పాటు
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం



**అమలుకు మంత్రుల కమిటీ**

- ఆహార ధాన్యాల నిల్వ పథకం అమలుకు మంత్రుల కమిటీ వేయనున్నారు. కేంద్ర సహకార శాఖ మంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తారు.
- వ్యవసాయ, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర శాఖలకు చెందిన పలు పథకాలను దీనిలో విలీనం చేస్తారు.
- ముందుగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎంపిక చేసిన 10 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేసి చూస్తారు. ఆ అనుభవాల ఆధారంగా పూర్తిస్థాయి పథకాన్ని దశలవారీగా అమల్లో పెడతారు.
- పీఏసీఎస్‌ల కార్యకలాపాలను విస్తృతం చేయడం ద్వారా వాటి ఆదాయాన్ని ఇతోధికంగా పెంచడం కూడా ఈ పథకం లక్ష్యాల్లో ఒకటి.

**న్యూఢిల్లీ:** ఆహార ధాన్యాల నిల్వ కోసం రూ.లక్ష కోట్లతో భారీ పథకానికి కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదముద్ర వేసింది. పంట నష్టాలను తగ్గించడమే గాక నిల్వ సదుపాయం లేక రైతులు పంటను అయిన కాడికి అమ్ముకునే దుస్థితిని ఇది తప్పించనుంది. దేశ ఆహార భద్రతను కూడా మరింత పటిష్టం చేయనుంది. ఇందులో భాగంగా సహకార రంగంలో వచ్చే ఐదేళ్లలో ప్రపంచంలోకెల్లా అతి భారీగా 7 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల స్టోరేజీ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో భారీగా ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని కేంద్ర సమాచార ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి బ్లాకులో 2 వేల టన్నుల నిల్వ సామర్థ్యంతో గోదాములను ఏర్పాటు చేస్తారన్నారు. మంత్రివర్గ నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ''ప్రస్తుతం దేశ వార్షిక ఆహార ధాన్యాల ఉత్పత్తి దాదాపు 31 కోట్ల టన్నులు. కానీ నిల్వ సామర్థ్యం మాత్రం 14.5 కోట్ల టన్నులే. అంటే సగాని కంటే తక్కువ. తాజా పథకంతో అమలైతే అది 21.5 కోట్ల టన్నులకు పెరుగుతుంది. వికేంద్రీకృత తరహాలో ఎక్కడికక్కడ నిల్వ సామర్థ్యం ఏర్పాటు చేస్తే ఆహార ధాన్యాల వృథా, రవాణా వ్యయం తదితరాలన్నీ బాగా తగ్గుతాయి'' అని చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాల (పీఏసీఎస్)ను ఇది బలోపేతం చేస్తుందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా లక్ష పీఏసీఎస్‌ల్లో 63 వేల దాకా చురుగ్గా పని చేస్తున్నాయి.

# పాతికసార్లు పొడిచి మరీ... కన్నకూతురిని కడతేర్చాడు

**సూరత్‌లో ఘోరం**



**సూరత్:** కూతురి పెళ్లి విషయమై భార్యతో గొడవ పడ్డాడు. ఆవేశంలో ఆమెను కత్తితో గాయపరిచాడు. అంతటితో ఆగకుండా కూతురిపైనా ఆటవికంగా దాడికి దిగాడు. తప్పించుకునే ప్రయత్నం చేసినా వెంటాడి మరీ ఏకంగా 25 సార్లు పొడిచి పొట్టన పెట్టుకున్నాడు. ఈ దారుణం గుజరాత్‌లోని సూరత్‌లో మే 18న జరిగింది. నిందితుడు రామానుజ ఆ రాత్రి భార్యతో కలిసి మేడపై పడుకున్నాడు. కూతురు గురించి వాగ్వాదం జరగడంతో రెచ్చిపోయాడు. ఒళ్లు తెలియని ఆవేశంలో కత్తందుకుని ఆమెను చంపబోయాడు. అడ్డుకున్న పిల్లలనూ గాయపరిచాడు. వాళ్లు కాసేపు నిలువరించినా, దగ్గరికొచ్చిన ప్రతివారినీ పొడవడం మొదలుపెట్టాడు. తర్వాత కత్తితో కూతురి వెంటపడ్డాడు. ఆమె అరుస్తూ గదిలోకి పరిగెత్తినా వదలకుండా పదే పదే పొడిచాడు. మళ్లీ మేడపైకి వెళ్లి భార్యపైకి దూసుకెళ్లాడు. పిల్లలు అప్పటికే గాయపడ్డా ధైర్యంగా తండ్రిని అడ్డుకున్నారు. ఇదంతా అపార్ట్‌మెంట్ సీసీటీవీలో రికార్డైంది. అంతలో పోలీసులు రంగప్రవేశం చేసి అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

# జ్ఞానవాపి మసీదుపై పిటిషన్ తిరస్కరణ

**అలహాబాద్ హైకోర్టు తీర్పు**

**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలోని జ్ఞానవాపి మసీదు వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు బుధవారం తిరస్కరించింది. ఈ మసీదు ప్రాంగణంలోని ఆలయంలో పూజలు చేసుకోవడానికి అనుమతి కోరుతూ ఐదుగురు హిందూ మహిళా భక్తులు దాఖలు చేసిన పిటిషన్‌ను వారణాసి కోర్టు విచారణకు స్వీకరించడాన్ని సవాలు చేస్తూ అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు తీర్పు వెలువరించింది. హిందూ వర్గానికి ఇదొక పెద్ద విజయమని న్యాయవాది సుభాష్ నందన్ చతుర్వేది చెప్పారు. కోర్టు తీర్పుపై అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ తరఫు న్యాయవాది మొహమ్మద్ తౌహీద్ ఖాన్ స్పందించారు. ఆర్డర్ 7 రూల్ సీపీసీపై కోర్టు తీర్పు ఇచ్చిందని, దీనిపై కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని, సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. జ్ఞానవాపి మసీదు వివాదానికి సంబంధించిన 7 కేసులను వారణాసి కోర్టు బుధవారం విచారించింది.

# మిడిసిపడుతున్నారు!

**దేవుడి కంటే గొప్పనుకుంటున్నారు**

**మోదీపై రాహుల్ ధ్వజం**

**అమెరికా సదస్సులో ప్రసంగం**

**ఆయనో నకిలీ గాంధీ: బీజేపీ**



**మహిళా రిజర్వేషన్ బిల్లు**

భారత్‌లో నేడు పేదలు, మైనార్టీ వర్గాల ప్రజలు నిస్సహాయులుగా మారిపోతున్నారని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయులు సహజంగా ఒకరినొకరు ద్వేషించుకోరని అన్నారు. దేశంలో వ్యవస్థను, మీడియాను నియంత్రిస్తున్న కొందరు వ్యక్తులు ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉందన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని వివరించారు. రాజకీయ వ్యవస్థ, వ్యాపారాలు, పాలక వర్గంలో మహిళలకు సముచిత స్థానం ఇవ్వాల్సిందేనని రాహుల్ తేల్చిచెప్పారు.

**శాంటాక్లారా:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ మరోసారి నిప్పులు చెరిగారు. దేవుడి కంటే తమకే ఎక్కువ తెలుసు అని భారతదేశంలో కొందరు మిడిసిపడుతున్నారని, అలాంటివారిలో మోదీ కూడా ఒకరని అన్నారు. అమెరికాలో కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాంటాక్లారాలో మంగళవారం 'మొహబ్బత్ కీ దుకాణ్' పేరిట ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించిన సదస్సులో వందలాది మంది భారతీయ అమెరికన్లను ఉద్దేశించి రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ ప్రపంచం చాలా పెద్దదని, అందరూ అన్ని విషయాలు తెలుసుకోవడం చాలా కష్టమని వివరించారు. భారత్‌లో ఉన్న కొందరు వ్యక్తులు మాత్రం తమకు అన్నీ తెలుసని వాదిస్తుంటారని అన్నారు. వారు తమకు అన్నీ తెలుసంటూ ఎవరినైనా ఒప్పించగల ఘనులు అని చెప్పారు. చరిత్ర గురించి చరిత్రకారులకు, సైన్స్ గురించి సైంటిస్టులకు, యుద్ధరీతుల గురించి సైన్యానికి పాఠాలు బోధించగల సమర్థులు అని ఎద్దేవా చేశారు. దేవుడితో సమానంగా కూర్చొని, ప్రపంచంలో ఏం జరుగుతోందో దేవుడికే చెప్పగలరని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇతరులు చెప్పేది మాత్రం వారు వినబోరని పేర్కొన్నారు. అలాంటి 'నమూనా' మనుషుల్లో ప్రధాని మోదీ కూడా ఉన్నారనడంలో సందేహం లేదన్నారు. ఈ సృష్టి ఎలా పనిచేస్తోందో దేవుడికి మోదీ చక్కగా పాఠాలు చెప్పగలరని తెలిపారు. అప్పుడు తాను సృష్టించిన ఈ సృష్టి పట్ల దేవుడు అయోమయానికి గురికావడం ఖాయమని వెల్లడించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో సభామందిరం నవ్వులతో దద్దరిల్లిపోయింది.

**సెంగోల్ పేరిట ఆర్భాటం**

భారత్ అనే భావన ఇప్పుడు దాడికి గురవుతోందని, సవాళ్లు ఎదుర్కొంటోందని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్వేష వ్యాప్తి వంటి సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయని, వాటిని పరిష్కరించేవారే లేకుండాపోయారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమే పార్లమెంట్ కొత్త భవన ప్రారంభోత్సవమని ఆరోపించారు. ప్రజా సమస్యల గురించి చట్టసభల్లో చర్చించడం బీజేపీకి ఇష్టం లేదని, అందుకే సెంగోల్ (రాజదండం) పేరిట ఆర్భాటం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ సర్కారు వచ్చి అబద్ధాలకోరు అని దుయ్యబట్టారు. అమెరికాలో భారత దేశం జెండాను సగర్వంగా ఎగురవేస్తున్న భారతీయ అమెరికన్లపై రాహుల్ గాంధీ ప్రశంసల వర్షం కురిపించారు.

**ఖలిస్తానీ మద్దతుదారుల కలకలం**

శాంటాక్లారాలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తుండగా ఖలిస్తానీ మద్దతుదారులు కాసేపు హంగామా సృష్టించారు. ఆయన ప్రసంగాన్ని అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేశారు. రాహుల్ నవ్వుతూ ప్రతిస్పందించారు. ''స్వాగతం, స్వాగతం .. విద్వేషం అనే బజారులో ప్రేమ అనే దుకాణానికి స్వాగతం'' అని అన్నారు. తాము అందరినీ ప్రేమిస్తామని, గౌరవిస్తామని చెప్పారు. ఎవరినీ ద్వేషించబోమని, ఇతరులు చెప్పేది వింటామని పేర్కొన్నారు. ఇంతలో భద్రతా సిబ్బంది రంగంలోకి దిగి ఖలిస్తానీ మద్దతుదారులను అదుపులోకి తీసుకున్నారు.

**రాహుల్‌కు ఏమీ తెలియదు: బీజేపీ**

అమెరికాలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నకిలీ గాంధీ అని విమర్శించారు. రాహుల్ దృష్టిలో చరిత్ర అంటే ఆయన కుటుంబమేనని అన్నారు. ఆయనకు ఏమీ తెలియదని, కానీ, అన్నింట్లోనూ నిష్ణాతుడయ్యాడని ఎద్దేవా చేశారు. భారతీయులు తమ చరిత్ర పట్ల గర్వపడతారని వివరించారు. రాహుల్ మాత్రం భారతదేశ ప్రతిష్టను దెబ్బతీయడానికి విదేశీ గడ్డను ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీపై రాహుల్ చేసిన విమర్శలను పలువురు బీజేపీ ముఖ్య నేతలు తప్పుపట్టారు. రాహుల్‌పై బీజేపీ నేతలు చేసిన విమర్శలను కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ట్విట్టర్‌లో ఖండించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాహుల్ మాట్లాడారని స్పష్టం చేశారు. ప్రజలు సమస్యల్లో కూరుకుపోయిన మాట నిజం కాదా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, ఆయన భజనపరులు నిజాలు తెలుసుకోవాలని హితవు పలికారు.

# దేశ మనోభావాలను కించపర్చారు

**60 వేల మంది కార్మికుల శ్రమను అగౌరవపర్చారు**

**కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం**



అజ్మీర్‌లో సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

**అజ్మీర్:** పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవాన్ని బహిష్కరించిన ప్రతిపక్ష కాంగ్రెస్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. దేశ మనోభావాలను కాంగ్రెస్ కించపర్చిందని, 60,000 మంది కార్మికుల కఠోర శ్రమను అగౌరవపర్చిందని ధ్వజమెత్తారు. రాజస్తాన్‌లోని అజ్మీర్‌లో బుధవారం ఓ ర్యాలీలో మోదీ ప్రసంగించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వానికి తొమ్మిదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. మూడు రోజుల క్రితం పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభించుకున్నామని, ప్రజలంతా గర్విస్తున్నారని, దేశ ప్రతిష్ట మరింత పెరగడంతో వారంతా సంతోషిస్తున్నారని మోదీ తెలిపారు. అన్నింటిలోనూ బురదజల్లే రాజకీయాలు చేసే కాంగ్రెస్, ఇతర పార్టీలు పార్లమెంట్ కొత్త భవనం విషయంలోనూ అదే పని చేస్తున్నాయని విమర్శించారు. పార్లమెంట్ కొత్త భవనాన్ని ప్రారంభించుకొనే అవకాశం కొన్ని తరాలకు ఒకసారి మాత్రమే వస్తుందని, కాంగ్రెస్ దాన్ని 'స్వార్థపూరిత నిరసన' కోసం వాడుకుందని ఆరోపించారు. మన దేశం సాధిస్తున్న ప్రగతిని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని వ్యాఖ్యానించారు. వారి అవినీతిని, కుటుంబ వారసత్వ రాజకీయాలను తాము ప్రశ్నిస్తున్నామని, అందుకే తమపై కోపంగా ఉన్నారని పరోక్షంగా సోనియా గాంధీ కుటుంబంపై విమర్శలు ఎక్కుపెట్టారు. వారి ఆరాచకాలను ఒక 'నిరుపేద బిడ్డ' సాగనివ్వడం లేదని, అది వారు తట్టుకోలేకపోతున్నారని ఆక్షేపించారు.

**కాంగ్రెస్ పాలనలో అవినీతి వ్యవస్థ**

''పేదరికాన్ని సమూలంగా నిర్మూలిస్తామని 55 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ, పేదలను దగా చేసింది. పేదలను తప్పుదోవ పట్టించడం, వారిని ఎప్పటికీ పేదలుగానే ఉంచడం కాంగ్రెస్ విధానం. కాంగ్రెస్ పాలనలో రాజస్తాన్ ప్రజలు ఎంతగానో నష్టపోయారు. తొమ్మిదేళ్ల బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజాసేవకు, సుపరిపాలనకు, నిరుపేదల సంక్షేమానికి అంకితం చేస్తున్నాం. 2014కు ముందు దేశంలో అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి వచ్చేవారు. నగరాల్లో ఉగ్రవాద దాడులు జరిగేవి. అప్పట్లో రిమోట్ కంట్రోల్‌తో పాలన సాగేది. కాంగ్రెస్ పాలనలో ప్రజల రక్తాన్ని పీల్చే అవినీతి వ్యవస్థను అభివృద్ధి చేశారు. దేశ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు ప్రపంచం మొత్తం భారత్ గురించి మాట్లాడుకుంటోంది. దేశంలో పేదరికం అంతమవుతోందని నిపుణులు చెబుతున్నారు. మన దేశం సాధించిన ప్రతి విజయం వెనుక ప్రజల చెమట చుక్కలు ఉన్నాయి. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి భారతీయులు ప్రదర్శిస్తున్న అంకితభావం ప్రశంసనీయం. కొందరు వ్యక్తులకు మాత్రం ఇది అర్థం కావడం లేదు'' అని ప్రధాని మోదీ తప్పుపట్టారు.

### ఉత్తర కొరియా నిఘా ఉపగ్రహ ప్రయోగం విఫలం



**సియోల్:** ఉత్తర కొరియాలో కిమ్ ప్రభుత్వం మిలటరీ కార్యకలాపాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వరస పెట్టి క్షిపణి పరీక్షలు నిర్వహిస్తున్న ఆ దేశం తొలిసారిగా ప్రయోగించిన నిఘా ఉపగ్రహం విఫలమైంది. ఉపగ్రహాన్ని తీసుకువెళుతున్న రాకెట్ రెండో దశ సమయంలో కనెక్షన్ తెగిపోయినట్టు ఉత్తర కొరియా అధికారిక న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. ఉపగ్రహ ప్రయోగం వైఫల్యానికి గల కారణాలను శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నట్టుగా వెల్లడించింది. ఉపగ్రహం శకలాలు కొరియాలోని ఉత్తరంవైపు సముద్ర జలాల్లో పడినట్టుగా తెలిపింది. ప్రయోగం విఫలమై రాకెట్ భూమిపైకి దూసుకువచ్చే సమయంలో అసాధారణంగా ప్రయాణించడంతో దక్షిణ కొరియా, జపాన్‌లు వణికిపోయాయి. రాకెట్ ఎక్కడ తమ భూభాగం మీద పడుతుందోనన్న భయంతో దేశ ప్రజలు అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపొమ్మంటూ హెచ్చరించాయి. చివరికి రాకెట్ సముద్రంలో పడడంతో ఆ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి.

# మూడు రాష్ట్రాల్లో ఎన్‌ఐఏ సోదాలు

- డిజిటల్ పరికరాలు, రూ.17.50 లక్షల నగదు స్వాధీనం
- పీఎఫ్‌ఐ కుట్రలపై దర్యాప్తు

**న్యూఢిల్లీ/బనశంకరి:** నిషేధిత ఇస్లామిక్ అతివాద సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్‌ఐ) కుట్రలపై దర్యాప్తులో భాగంగా జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) అధికారులు బుధవారం మూడు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించారు. బిహార్‌లోని కతీహార్ జిల్లా, కర్ణాటకలోని దక్షిణ కన్నడ, షిమోగా జిల్లాలు, కేరళలోని కాసర్‌గోడ్, మలప్పురం, కోజికోడ్, తిరువనంతపురం జిల్లాల్లో మొత్తం 25 చోట్ల ఈ సోదాలు జరిగాయి. అనుమానితుల నివాసాల్లో సోదాలు చేపట్టినట్లు ఎన్‌ఐఏ అధికారులు తెలియజేశారు. మొబైల్ ఫోన్లు, హార్డ్‌డిస్కులు, సిమ్ కార్డులు, పెన్ డ్రైవ్‌లు, డేటా కార్డులు, ఇతర డిజిటల్ పరికరాలు, పత్రాలు, పీఎఫ్‌ఐకి సంబంధించిన సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఈ సోదాల్లో రూ.17.50 లక్షల నగదు లభ్యమైందని వివరించారు. భారత్‌లో విధ్వంసకర కార్యకలాపాల కోసం పీఎఫ్‌ఐకి విదేశాల నుంచి హవాలా డబ్బు అందుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల కర్ణాటకలోని బంట్వాళ, పుత్తూరుల్లో నలుగురు అనుమానితులను అరెస్ట్ చేశారు. కేరళలోని కాసరగోడ్‌లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పీఎఫ్‌ఐ కార్యకలాపాలకు సంబంధించి కోట్లాది రూపాయల లావాదేవీలు జరిగినట్లు ఎన్‌ఐఏ గుర్తించింది.

**కశ్మీర్‌లోనూ...**

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్, బుద్గామ్ జిల్లాల్లో మూడు ప్రాంతాల్లో ఎన్‌ఐఏ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కొన్ని కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఐఏ అధికార ప్రతినిధి చెప్పారు. పాక్ దన్నున్న లష్కరే తోయిబా, జైషే మొహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్, అల్–బదర్, అల్‌కాయిదా ఉగ్ర సంస్థల అనుబంధ సంస్థల సభ్యులు, సానుభూతిపరుల నివాసాల్లో సోదాలు జరిగాయి. ద రెసిస్టెన్స్ ఫోర్స్, యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్–జమ్మూకశ్మీర్, ముజాహిదీన్ గజ్వాత్–ఉల్–హింద్, జమ్మూకశ్మీర్ ఫ్రీడం ఫైటర్స్, కశ్మీర్ టైగర్స్, పీపుల్స్ యాంటీ–ఫాసిస్ట్ ఫ్రంట్ అనే ఉగ్రవాద సంస్థలు ఇటీవల కొత్తగా పుట్టుకొచ్చాయి.



**చిక్కింది చేప**

మిట్టమధ్యాహ్నం మంచి భోజనం దొరికిందని సంబరపడిపోతూ చిట్టి చేపను లాఘవంగా లాగించేస్తున్న నారాయణపక్షి ఇది. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని ఓర్లాండో నగరంలో తీసింది ఫొటో. మంగళవారం సిటీలోని ఇవాన్‌హోయి సరస్సులో ఇలా చేపలను వేటాడే 'గ్రేట్ బ్లూ హెరాన్' కొంగలు వేలాదిగా గుమికూడి తమవిందు కానిస్తూ అక్కడి సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.

సాక్షి కరీంనగర్
గురువారం | 1 | జూన్ | 2023




కల్యాణ వేడుకల్లో స్వామివార్ల ఉత్సవమూర్తులు


కల్యాణ వేడుకను చూసేందుకు తరలివచ్చిన భక్తులు

## న్యూస్‌రీల్

### 'సింగిరెడ్డి' ఇంట్లో వైవీ.సుబ్బారెడ్డి అల్పాహారం



కరీంనగర్: కరీంనగర్ పట్టణంలోని పద్మనగర్‌లో వెంకటేశ్వరస్వామి ఆలయ భూమిపూజ అనంతరం వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డి నివాసంలో టీటీడీ చైర్మన్ డాక్టర్ సుబ్బారెడ్డి అల్పాహారం చేశారు. సింగిరెడ్డి దంపతులు చైర్మన్ వై.వీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యులు దామోదర్ రావు, కావేరి సీడ్స్ అధినేత భాస్కర్‌రావులను శాలువా కప్పి సన్మానించారు. స్థానిక కార్పొరేటర్ గంట కల్యాణి- శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ రెడ్డి సంఘం కోశాధికారి కాసర్ల మధుకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గన్ను మహేశ్వర్‌రెడ్డి, బేతి మహేందర్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, చెన్నాడి రాజేశ్వర్‌రెడ్డి సుబ్బారెడ్డిని కలిశారు.

### పంట నష్టపరిహారం చెల్లించాలి



హుజూరాబాద్: అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం హుజూరాబాద్‌లోని రైతు సంఘం భవనంలో బాసిర సంపత్‌రావు అధ్యక్షత జరిగింది. మార్చి, ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాన్ని ఆసరాగా చేసుకుని రైసుమిల్లు యజమాన్యాలు రైతాంగాన్ని చాలా ఇబ్బందుల గురిచేస్తూ బస్తాకు 5 నుంచి 6కేజీల కోత విధిస్తున్నారని తెలిపారు. వానలకు నష్టపోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదని, వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. జూన్ 15, 16, 17 తేదీల్లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర క్లాసులు మూడురోజులపాటు కరీంనగర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి గుండేటి వాసుదేవ్, నాయకులు బాసిర సంపత్‌రావు, జనార్దన్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

### స్వల్పంగా పెరిగిన పత్తి ధర



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర స్వల్పంగా పెరిగింది. మంగళవారం క్వింటాల్ పత్తి ధర రూ.7,000 కాగా బుధవారం రూ.150 పెరిగింది. క్వింటాల్‌కు రూ.7,150 పలికింది. మార్కెట్‌కు 11 వాహనాల్లో 156 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. మోడల్ ధర రూ.6,950, కనిష్ట ధర రూ.6,500 పలికింది. గన్నీ సంచుల్లో నలుగురు రైతులు నాలుగు క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,500, మోడల్ ధర రూ.5,700, కనిష్ట ధర రూ.5,700కు ఖరీదు వ్యాపారులు కొనుగోలు చేశారు. కాగా.. మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలను కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

### దరఖాస్తుల ఆహ్వానం



కరీంనగర్: జిల్లాకేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ రకాల పోటీ పరీక్షల తరగతులు బోధించడానికి ఆసక్తి కలిగిన అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో అనుభవం కలిగి పీజీలో కనీసం 55శాతం మార్కులు కలిగి ఉండాలని, 5 నెలల ఉచిత శిక్షణలో ఆంగ్లం, అర్థమేటిక్, రీజనింగ్, జాగ్రఫీ, పాలిటీ, సోషియాలజీ, భారత తెలంగాణ చరిత్ర, తెలంగాణ ఉద్యమ చరిత్ర, కరెంట్ ఎఫైర్స్, అర్థశాస్త్రం, భౌతిక, రసాయన, జీవశాస్త్రంతో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీ బోధించే అధ్యాపకులు ఈనెల 5లోపు అంబేడ్కర్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. వివరాలకు 9177605511 నంబరును సంప్రదించాలని సూచించారు.

### 2న ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జూన్ 2న అండర్-16 బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను స్థానిక అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి గణపతి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జూన్ 5 నుంచి 7వరకు మంచిర్యాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు స్టేడియంలో వయస్సు ధ్రువీకరణపత్రాలతో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.



# గోవిందా.. హరి గోవిందా వేంకటరమణ గోవిందా..

అన్నమాచార్య కీర్తనలు.. ముత్యాల తలంబ్రాలు.. మంగళవాయిద్యాలు.. విశేష అలంకరణలు.. వేదపండితుల వేదమంత్రోచ్చరణలు.. వెల్లువిరిసిన భక్తి పారవశ్యం మధ్య బుధవారం సాయంత్రం కరీంనగర్ పద్మనగర్‌లో శ్రీనివాసుడి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తంతులో ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ సునీల్ రావు, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్, ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో వేద పండితులు మంత్రోచ్చరణలమధ్య శ్రీవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ వైభవంగా జరిగింది. ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. – కరీంనగర్‌కల్చరల్


భూమిపూజ అనంతరం హారతి అందుకుంటున్న ప్రముఖులు


పట్టువస్త్రాలు చూపుతున్న అర్చకుడు




తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు


ఆశీర్వాదం తీసుకుంటున్న ఎంపీ బండి సంజయ్


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి కమలాకర్, వినోద్‌కుమార్


శోభాయాత్రలో ఆకట్టుకున్న అంబారీలు, అశ్వాలు

# పదేళ్ల పండుగ

- రేపటి నుంచి 22 వరకు దశాబ్ది వేడుకలు
- పరేడ్‌గ్రౌండ్‌లో పతాకావిష్కరణతో ఉత్సవాలు ప్రారంభం
- సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై విస్తృత ప్రచారం
- ఉత్సవాలకు జిల్లా యంత్రాంగం రెడీ

సకలజనుల సమ్మె.. మిలియన్‌మార్చ్.. వంటావార్పు.. ఆత్మహత్యలు.. ఏళ్ల పోరాటాల కల నెరవేరిన వేళ యావత్తు తెలంగాణం సంబురాలు చేసుకుంది. జయ..జయహే తెలంగాణ.. జననీ జయ కేతనం.. ఆలపించింది. పోరాటాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ పదేళ్ల ఉత్సవాలకు సిద్ధమైంది. ఈ పదేళ్ల ప్రస్థానంలో స్వరాష్ట్రం ఎన్నో మైలురాళ్లను దాటింది. ఒక్కసారి వాటిని మననం చేసుకుందాం. – కరీంనగర్

తెలంగాణ ఏర్పడి పదేళ్లు నిండిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహిస్తుంది. ఈ పదేళ్లల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు లబ్ధిదారులు ఉత్సవాల్లో భాగస్వామ్యులను చేసేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఉత్సవాల నిర్వహణపై ఇప్పటికే మంత్రి గంగుల కమలాకర్ జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో రెండు సార్లు సమావేశాలు నిర్వహించారు. పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో 2వ తేదీన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ పతాకావిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు.

**సంబురంగా ఉత్సవాలు**

రాష్ట్ర పదేళ్ల పండుగను 21 రోజులపాటు రోజుకో శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించేలా ప్రణాళిక చేశారు. రైతుదినోత్సవం, విద్యుత్ దినోత్సవం, రన్, పల్లె, పట్టణ ప్రగతి, విద్య, వైద్యం, సాహిత్యం, నీటి, మహిళా, హరిత దినోత్సవాలతోపాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**విద్యుత్ కాంతుల్లో..**

తెలంగాణ పదేళ్ల ప్రస్థానం, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కళ్లకు కట్టినట్లు చూపించేలా నగరాలు, పట్టణాలు, పంచాయతీ పల్లెలు ముస్తాబు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయాలు, చర్చిలు, మసీదులు, ఇతర ప్రార్థన మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

**రోజువారీ కార్యక్రమాలు ఇవే..**

2న.. పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో మంత్రి గంగుల కమలాకర్ పతాకావిష్కరణ.

3న తెలంగాణ రైతు దినోత్సవం.. రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్ పథకాల ఉత్సవాలు. రైతులందరితో సహపంక్తి భోజనాలు.

4న సురక్ష దినోత్సవం.. షీటీమ్, సైబర్‌నేరాల నివారణ చర్యల ర్యాలీలు,ఉత్తమ పోలీసులకు సన్మానం.

5న విద్యుత్ విజయోత్సవం.. విద్యుత్ కార్యాలయాలను అలకరించడం, విద్యుత్ శాఖలో వచ్చిన మార్పులను, కోతల నివారణపై అవగాహన కార్యక్రమాలు.

6న పారిశ్రామిక ప్రగతి ఉత్సవం.. పారిశ్రామిక రంగంలో సాధించిన అభివృద్ధిపై కార్యక్రమాలు.



7న సాగునీటి దినోత్సవం. కాళేశ్వరం ప్రాజెక్టుపై డాక్యుమెంటరీ ప్రదర్శన. జిల్లాలో సాగునీటి అభివృద్ధికి చేపట్టిన చర్యలు వివరించడం.

8న ఊరూర చెరువుల పండగ.. గ్రామాల చెరువుల వద్ద పండుగలా కార్యక్రమాలు. డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారుల వలలతో ఊరేగింపు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు.

9న తెలంగాణ సంక్షేమ సంబురాలు.. గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ. అర్హులైన పేదలకు ఇంటి స్థలాల పంపిణీ. బీసీలకు చెక్కులు, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లపై కార్యక్రమాలు.

10న సుపరిపాలన దినోత్సవం.. కొత్త మున్సిపాలిటీల్లో, కొత్త మండలాల్లో సంబురాలు.

11న సాహిత్య దినోత్సవం.. కవి సమ్మేళనాలు, కవిత పోటీల నిర్వహణ.

12న తెలంగాణ రన్.. ఉదయం 6 గంటలకు రన్ నిర్వహిస్తారు. పోలీసు, క్రీడాశాఖ ఆధ్వర్యంలో రన్.

13న మహిళా సంక్షేమ దినోత్సవం.. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులకు సన్మానం.

14న వైద్యారోగ్య దినోత్సవం.. కేసీఆర్ కిట్, న్యూట్రీషియన్ కిట్, సీఎమ్మార్‌ఎఫ్ లబ్ధిదారులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, మెడికల్ నర్సింగ్, కళాశాలల విద్యార్థులతో సమావేశం. ఉత్తమ సిబ్బందికి సన్మానం.

15న పల్లె ప్రగతి దినోత్సవం.. పంచాయతీల కార్యాలయం ముందు జాతీయ జెండా ఆవిష్కరణ. నూతన పంచాయతీ భవనాలకు శంకుస్థాపన, స్థానిక సంస్థల ఉత్తమ ప్రజాప్రతినిధులకు సన్మానాలు.

16న పట్టణ ప్రగతి దినోత్సవం.. మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ.

17న గిరిజన దినోత్సవం.. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లపై అవగాహన, గిరివికాసం పథకంపై అవగాహన, యూనిట్ల పంపిణీ.

18న మంచినీటి పండగ.. తాగునీటి సమస్యల పరిష్కారానికి మిషన్ భగీరథ చేపట్టిన పనులు, తీరిన కష్టాలపై కార్యక్రమాలు.

19న తెలంగాణ హరితోత్సవం.. పెద్ద ఎత్తున మొక్కలు నాటడం. రక్షణ చర్యలు తీసుకోవడం.

20న విద్యాదినోత్సవం.. పాఠశాలల్లో పూర్తయిన పనుల ప్రారంభ కార్యక్రమాలు, విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ, వ్యాసరచన పోటీలు. మన ఊరు -మన బడి పాఠశాలల ప్రారంభాలు.

21న తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం.. ఆలయాలు, చర్చీలు, మసీదుల అలంకరణ, ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేయడం.

22న గ్రామపంచాయతీలలో ఉదయం 11 గంటలకు సమావేశం. అమరవీరులకు నివాళి అర్పించడం. స్మారక చిహ్నాల వద్ద కార్యక్రమాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం.

### రేపు తెలంగాణ అవతరణ దినోత్సవం

తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ పతాకావిష్కరణ చేస్తారని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు అమరవీరుల స్తూపం వద్ద నివాళి, ఉదయం 9.10 గంటలకు వందన స్వీకారం, 9.10 నుంచి 9.25 గంటల వరకు మంత్రి సందేశం, 9.25 నుంచి 9.45 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, 9.45 నుంచి 9.55 గంటల వరకు అమరవీరుల కుటుంబ సభ్యులకు సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

# నిర్మాణ అనుమతులు వేగవంతం చేయాలి

- ఊరూరా చెరువు పండుగను విజయవంతం చేయాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


మాట్లాడుతున్న గరిమా అగర్వాల్

కరీంనగర్ కార్పొరేషన్: మున్సిపాలిటీలలో నూతన భవన నిర్మాణాల అనుమతులకు త్వరితగతిన మంజూరు ఇవ్వాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. బుధవారం కలెక్టరేట్లో మున్సిపల్ పనుల ప్రగతిపై మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్, టెక్నికల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణాలకు అనుమతుల జారీలో జాప్యం చేయరాదని, అలా జరిగినట్లయితే మున్సిపల్ యాక్ట్ ప్రకారం జరిమానా విధిస్తూ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తూ తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఉత్సవాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో చెరువుల పండుగలో ప్రజలు పెద్దమొత్తంలో భాగస్వాములు అయ్యేలా చూడాలని సూచించారు. జూన్ 8న నిర్వహించనున్న ఊరూరా చెరువు పండగలో భాగంగా చెరువులను ఎంపిక చేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చూడాలన్నారు. చెరువుల పండుగ సందర్భంగా గ్రామాల్లో వేడుకలు నిర్వహించాలన్నారు. వేడుకకు వచ్చిన వారికి భోజనాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవోలు ఆనంద్ కుమార్, హరిసింగ్, డీపీఓ వీరబుచ్చయ్య, డీడబ్ల్యూవో సంధ్యారాణి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి నాగార్జున, ఉద్యానవనశాఖ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# పొగాకు కేన్సర్‌కు కారకం..


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

- జిల్లా వైద్యాధికారి లలితాదేవి

కరీంనగర్‌టౌన్: పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తే కేన్సర్ బారిన పడతారని డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి అన్నారు. నో టొబాకోడేను పురస్కరించుకొని బుధవారం జిల్లా ప్రధాన ఆసుపత్రి ఆవరణ నుంచి ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ... కోప్టాయాక్ట్ ప్రకారం పొగాకు ఉత్పత్తుల వినియోగం బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ ఆఫీసులు, బస్టాండ్, పాఠశాలలు, కళాశాలలు మొదలగు ప్రదేశాలలో నిషేధించబడిందన్నారు. పొగాకు వినియోగంతో నోటి, పెదవి, గొంతు, నాలుక కేన్సర్, గుండె ఊపిరితిత్తుల కేన్సర్, బ్రెయిన్ స్ట్రోక్, స్టమక్ కేన్సర్, అల్సర్ మొదలగు వ్యాధులు వస్తాయన్నారు. ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుజాత, డీఐవో డాక్టర్ సాజిదా అతహరి, డాక్టర్ వినీత, రంగారెడ్డి, ఏ.శ్రీనివాస్, రమణాకర్ పాల్గొన్నారు.

**డే కేర్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి**

జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కీమోథెరపీ డే కేర్ సెంటర్‌ను కేన్సర్‌తో బాధపడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో లలితాదేవి తెలిపారు. బుధవారం కీమోథెరపీ డే కేర్ సెంటర్‌ను సందర్శించారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో పేషెంట్‌తో మాట్లాడి అక్కడ అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. రోగులు హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్‘లెస్’

- నత్తనడకన ఫిట్‌నెస్ పరీక్షలు
- మిగిలింది 12 రోజులు.. లక్ష్యం చేరేనా?
- ఆసక్తి చూపని విద్యాసంస్థల యాజమాన్యాలు
- 12 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 332 వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్

జిల్లాల వారీగా వాహనాలు, ఫిట్‌నెస్ వివరాలు

| జిల్లా | వాహనాలు | ఫిట్‌నెస్ ఉన్నవి | 15ఏళ్లు నిండినవి |
|---|---|---|---|
| కరీంనగర్ | 1,226 | 247 | 407 |
| పెద్దపల్లి | 372 | 151 | 23 |
| జగిత్యాల | 641 | 50 | 211 |
| సిరిసిల్ల | 157 | 20 | 22 |

తిమ్మాపూర్: కొత్త విద్యా సంవత్సరం 12 రోజుల్లో ప్రారంభం కాబోతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఇప్పటికే అడ్మిషన్ల కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులను తరలించే వాహనాల ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టడంలేదు. జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ పరీక్షలు ప్రారంభించి నెల రోజులు గడిచింది. ఇప్పటి వరకు కరీంనగర్‌లో 247, జగిత్యాలలో 50, పెద్దపల్లిలో 15, సిరిసిల్లలో 20 వాహనాలు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షకు వచ్చాయి. కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్ష పాస్ కావడానికి వాహనాలకు తాత్కాలికంగా మరమ్మతు నిర్వహిస్తున్నాయి.


ఫిట్‌నెస్ నిర్వహిస్తున్న రవాణా అధికారులు(ఫైల్)

**ఉమ్మడి జిల్లాలో 2,396 వాహనాలు**

- ఉమ్మడి జిల్లాలో 2,396 పాఠశాల వాహనాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 50 వాహనాల వరకు కొత్తవి. మిగితావి పాతవి. 50 బస్సులకు ఈ ఏడాది ఫిట్‌నెస్ పరీక్షలకు మినహాయింపు ఉంటుంది. మిగిలినవాటికి తప్పనిసరి.
- కరీంనగర్ జిల్లాలో 407, జగిత్యాలలో 211, పెద్దపల్లిలో 123, రాజన్న సిరిసిల్లలో 22 బస్సులు 15 ఏళ్లకు పైబడి కాలపరిమితి పూర్తయ్యాయి. మొత్తంగా ఈ ఏడాది 1,633 వాహనాలకు ఫిట్‌నెస్ చేయించాలి. ఇప్పటి వరకు 332 వాహనాలు పరీక్షకు రాగా.. ఇంకా 1,301 వాహనాలు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉంది.
- ఏటా ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ఆధ్వర్యంలో బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలి. వీటిని అధికారికంగా ఆర్టీవో అధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. తరువాతే రోడ్డుపైకి వెళ్లాలి. లేనిపక్షంలో అధికారులు జరిమానా వసూలు చేస్తారు.
- ఉమ్మడిజిల్లాలో 40వేలకుపైగా విద్యార్థులు ప్రయివేటు వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. వీరి భద్రత బస్సుల ఫిట్‌నెస్‌పైనే ఆధారపడి ఉంటుంది. అధికారులు అప్రమత్తంగా ఉంటూ పరీక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రుల కోరుతున్నారు. టీఎస్ స్కూల్‌బస్ యాప్ ద్వారా స్కూల్‌బస్సుల వివరాలు తెలుసుకోవచ్చు. అవసరమయితే ఫిర్యాదు చేయవచ్చు.
- విద్యాసంస్థల బస్సు నడిపే డ్రైవర్లకు ఆర్టీఏ అధికారులు ఇప్పటికే శిక్షణ ఇవ్వాలి. ఈ ఏడాది అధికారులు ఇంకా డ్రైవర్లకు శిక్షణ ఏర్పాటు చేయలేదు. జూన్ మొదటి వారంలో ట్రైనింగ్ ఇస్తామని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు.
- డ్రైవర్లకు తప్పనిసరిగా ఐదేళ్ల అనుభవం, హెవీ మోటార్ లైసెన్స్ ఉండాలి. మద్యం అలవాటు ఉండరాదు. బస్సుల్లో ఫైర్‌సేఫ్టీ పరికరాలు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలి. కిటికీలకు గ్రిల్స్, అత్యవసర ద్వారాలు, సూచికలు ఏర్పాటు చేసుకోవాలి.

### ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు



బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలకు చేయించుకోవడానికి జూన్ 11వరకు గడువుంది. అన్ని యాజమాన్యాలు ఫిట్‌నెస్ టెస్టుకు తీసుకురావాలి. గడువు తీరిన బస్సులను ఎట్టి పరిస్థితిలోనూ రోడ్డుపై నడుపొద్దు. ఫిట్‌నెస్ లేని వాహనాలకు భారీగా జరిమానా విధిస్తాం. విద్యా సంస్థల బస్సులను జూన్ 12నుంచి తనిఖీ చేస్తాం.

– మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, డీటీసీ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా

## క్లుప్తంగా

### ఇండియన్ నేవీ ఫలితాల్లో 'తేజస్' సత్తా



కొత్తపల్లి(కరీంనగర్): ఇండియన్ నేవీ ఫలితాల్లో తేజస్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. 11 మంది అగ్నిపథ్ ద్వారా ఇండియన్ నేవీలో ఉద్యోగాలు సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ సీహెచ్.సతీశ్‌రావు తెలిపారు. బుధవారం సాయంత్రం అకాడమీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు ఎస్.సిద్ధు, పి.వేణు, ఎస్.మహేశ్, ఎ.అభిరాం, ఎస్.సుదర్శన్, ఎ.సాయి సంకేత్, కె.ప్రణయ్, కె.మధు, ఎస్.వినయకుమార్, ఎస్.మనోజ్, ఎ.సాయి నిఖిల్ ఉద్యోగాలు సాధించారన్నారు. వీరు ఒడిశా రాష్ట్రంలోని చిలుక ట్రైనింగ్ సెంటర్లో జూన్ 5 నుంచి శిక్షణ పొందుతారని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

### బిల్లు రాలేదని రైతు వేదికకు తాళం

మానకొండూర్: రైతు వేదిక నిర్మాణం చేపట్టి రెండేళ్ల గడిచాయి.. అయినా బిల్లు రాలేదని వేదికను నిర్మించిన రైతే దానికి తాళం వేశాడు. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూర్ మండలంలోని కొండపల్కలలో రైతువేదికను అదే గ్రామానికి చెందిన ఓ రైతు నిర్మించాడు. పనులు పూర్తి చేసి, రెండేళ్లవుతోంది. కొంత బిల్లు చెల్లించిన ప్రభుత్వం, పూర్తిగా చెల్లించడంలో జాప్యం చేస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోంది. రైతు వేదికలో ఈ నెల 3న రైతులతో సమావేశం నిర్వహించనున్నారు. వేడుకల కోసం ఏర్పాట్లు చేద్దామని అధికారులు బుధవారం రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. కానీ వేదికకు తాళం వేసి ఉండటాన్ని గమనించి, స్థానికులను ఆరా తీశారు. రైతు వేదికను నిర్మించిన వ్యక్తే బిల్లులు రాలేదని తాళం వేశాడని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఫోన్‌లో ఆ రైతుతో మాట్లాడి, దశాబ్ది ఉత్సవాలు ముగియగానే బిల్లు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే బిల్లు రూ.5 లక్షల వరకు వచ్చినా.. మరో రూ.10 లక్షల వరకు చెల్లించాల్సి ఉందని తెలిసింది.

### ప్రజల ఆకాంక్షలు నెరవేర్చని ప్రభుత్వం

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న



మాట్లాడుతున్న రాజన్న

గోదావరిఖని(రామగుండం): పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చలేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న ఆరోపించారు. బుధవారం గోదావరిఖనిలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ఆర్భాటం ఎవరి ప్రయోజనాల కోసమో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజల సొమ్మును సొంత ప్రయోజనాల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేయడం ఏంటని మండిపడ్డారు. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి, ఉత్సవాలు జరపడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణ, నరేశ్, ఎ.వెంకన్న, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# జాబ్ ఆఫర్.. లెటర్‌కే పరిమితం

- ఉద్యోగాలు కావాలంటే సెక్యూరిటీ డిపాజిట్ కింద కంపెనీలకు చెల్లించాలి
- 6 నెలలు తిరగకుండానే ఉద్యోగాల నుంచి తొలగింపు
- జిల్లాలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ల తీరు
- అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరం

'కరీంనగర్ జిల్లాలో పేరున్న ఓ డిగ్రీ కాలేజీలో ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఇక్కడికి ఎన్నో పేరున్న కంపెనీలు వచ్చాయి. అధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరై, తమ ప్రతిభతో ఉద్యోగాలు పొందారు. ఆయా కంపెనీలవారు ఆఫర్ లెటర్ ఇచ్చారు. కానీ 6 నెలలవుతున్నా ఇంతవరకు ఉద్యోగాలు ఇవ్వలేదు. దీంతో అభ్యర్థులు మరో కంపెనీలో ఉద్యోగానికి ప్రయత్నించాలో లేక జాబ్ ఆఫర్ ఇచ్చిన కంపెనీ పిలుపు కోసం వేచిచూడాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.'

'కరీంనగర్ జిల్లాలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. దీనికి వందల సంఖ్యలో హాజరైన అభ్యర్థులు ఉద్యోగాలు పొందారు. నిర్వాహకులు ఇచ్చిన ఆఫర్ లెటర్లు పట్టుకొని సదరు కంపెనీలకు వెళ్తే సెక్యూరిటీ డిపాజిట్ కింద కొంత డబ్బులు వసూలు చేశారని తెలిసింది.'

| రిక్రూట్‌మెంట్‌లలో ఎంపికైనవారు | |
|---|---|
| ఇంజినీరింగ్ విద్యార్థులు | 4,100 |
| డిగ్రీ విద్యార్థులు | 8,400 |

కరీంనగర్ సిటీ: కరీంనగర్ జిల్లాలో ఈ మధ్య కాలంలో నిర్వహించిన పలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పలు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కాలేజీలు తమ తమ కళాశాలల్లో పెద్ద పెద్ద కంపెనీల సహకారంతో రిక్రూట్‌మెంట్ చేపడుతున్నాయి. పలు కంపెనీలు అభ్యర్థులను ఎంపిక చేసుకొని, ఆఫర్ లెటర్ ఇస్తున్నారు. కానీ వాటిని పట్టుకొని, సదరు కంపెనీలకు వెళ్తే వివిధ కారణాలు చూపుతూ వెయిటింగ్‌లో పెడుతున్నారు. వీరిలో కొందరికి 6 నెలలు దాటినా జాబ్స్ ఇవ్వలేదని తెలిసింది. కొన్ని కంపెనీలు సెక్యూరిటీ డిపాజిట్ చేయాలంటూ వారు ఇచ్చిన వేతన ఆఫర్‌లో కనీసం 6 నెలల



నుంచి ఏడాది వేతనాన్ని ముందుగానే డిపాజిట్ చేయాలని సూచిస్తున్నారు. డబ్బులు చెల్లించని వారిని వెయిటింగ్‌లో ఉంచుతున్నారని సమాచారం. అప్పులు చేసి, డిపాజిట్ చేసినవారిని కూడా ఆరు నెలల తిరగముందే వివిధ లోపాలు చూపుతూ ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని పలువురు బాధితులు వాపోతున్నారు. తాము చెల్లించిన డబ్బుల కోసం ఆయా కంపెనీల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

| జిల్లాలో కాలేజీలు, విద్యార్థులు | |
|---|---|
| ఇంజినీరింగ్ కాలేజీలు | 14 |
| విద్యార్థులు | 13 వేలు |
| డిగ్రీ కాలేజీలు | 104 |
| విద్యార్థులు | 73 వేలు |

### చాలా కంపెనీలు బోగస్‌వే!

జిల్లాలోని కళాశాలల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్న చాలా వరకు కంపెనీలు బోగస్‌వేనని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఎంపిక సందర్భంగా హడావుడి చేస్తారని, తర్వాత ఏమీ ఉండదని అంటున్నారు. కొన్ని ప్రైవేట్ కంపెనీలు ఉద్యోగాలు ఇవ్వడానికి ఆయా కాలేజీల యాజమాన్యాలతో డీల్ చేసుకుంటున్నాయని, ఎంపికైతే వేతనాల నుంచి ఇంత అంటూ ఆయా కళాశాలలు వసూలు చేస్తున్నాయని చెబుతున్నారు. అనేక కంపెనీలు డబ్బుల కోసం ఆశపడి, ప్రతిభ లేనివారిని ఎంపిక చేసుకుంటున్నాయని పేర్కొంటున్నారు. మరికొన్ని జాబ్స్ ఇస్తామంటూ దరఖాస్తులకు ఇంత అంటూ ధర నిర్ణయించి, వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఒక్కో ఉద్యోగానికి వేల సంఖ్యలో హాజరవుతున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తుల పేరిటనే ఆయా కంపెనీలు కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. కాలేజీల యాజమాన్యాలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ల విషయంలో కఠినంగా ఉండాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, కంపెనీలను ఆహ్వానించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### అభ్యర్థులూ.. జర భద్రం

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌ల సమయంలో అభ్యర్థులు కంపెనీల గురించి నిర్వాహకులు చెప్పిన విషయాలనే నమ్మకుండా సొంతంగా తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వీలుంటే ఆయా కంపెనీల్లో పని చేస్తున్న వారిని సంప్రదించాలని చెబుతున్నారు. ఇంటర్నెట్‌లో చూసినట్లే ఫీల్డ్ మీద ఉన్నాయా లేదా ఒకసారి పరిశీలించాలని అంటున్నారు. డిపాజిట్ చెల్లించాలని కోరుతున్న కంపెనీలు నిర్ణీత ప్రమాణాలు పాటిస్తున్నాయా తెలుసుకోవాలని పేర్కొంటున్నారు.

# కొన్ని నెలల్లో కొలువు.. కబళించిన మృత్యువు

- విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం
- హార్వెస్టర్‌కు సర్వీసింగ్ చేస్తుండగా ఘటన
- పక్షవాతంతో మంచాన తండ్రి
- మెడికల్ అన్‌ఫిట్‌తో కుమారుడికి సింగరేణి ఉద్యోగం
- అంతలోనే అనంతలోకాలకు వెళ్లడంతో కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ సతీశ్, ఎస్సై వెంకటేశ్వర్లు



కుమారస్వామి (ఫైల్)

మంథని: పేరుకు సింగరేణి ఉద్యోగం.. కానీ అనారోగ్య సమస్యలు ఆ కుటుంబ పెద్దను వెంటాడాయి.. పక్షవాతం రావడంతో దయనీయ స్థితిలో కాలం గడుపుతున్నారు.. అది చాలదన్నట్లు ఆ కుటుంబాన్ని విధి చిన్నచూపు చూసింది.. ఒక్కగానొక్క కుమారుడిని విద్యుదాఘాతం రూపంలో తీసుకెళ్లిపోయింది. వివరాల్లోకి వెళ్తే.. మంథని మండలంలోని రచ్చపల్లి గ్రామానికి చెందిన శనిగరపు లక్ష్మి–జనార్దన్ దంపతులకు ఏకైక సంతానం కుమారస్వామి(18). జనార్దన్ సింగరేణిలో ఉద్యోగం చేస్తూ పక్షవాతానికి గురయ్యాడు. కుమారుడికి తన ఉద్యోగం ఇప్పించేందుకు సిద్ధమయ్యాడు. మెడికల్ అన్‌ఫిట్ ప్రక్రియ కూడా పూర్తయింది. కొన్ని నెలల్లోనే కుమారస్వామి ఉద్యోగంలో చేరేవాడు. కానీ కుటుంబం గడవడం కష్టంగా ఉండటంతో అప్పటి వరకు తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలని భావించి, స్థానికంగా ఫోమ్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పనిలో చేరాడు. బుధవారం ఓ కస్టమర్‌కు చెందిన హార్వెస్టర్‌ను శుభ్రం చేస్తుండగా వాటర్ పైపు ద్వారా విద్యుత్ సరఫరా జరిగి, విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో ఇక తమకు దిక్కెవరంటూ కుమారస్వామి తల్లిదండ్రులు రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. సంఘటన స్థలాన్ని మంథని సీఐ సతీశ్ పరిశీలించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## బైక్ కాలువలో పడి యువకుడికి గాయాలు

- డిగ్రీ పరీక్ష రాసేందుకు వెళ్తుండగా పెద్దపల్లిలో ఘటన



గాయపడిన అరవింద్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం పరీక్ష రాసేందుకు బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు ఎస్సారెస్పీ కాలువలో పడి, గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. జూలపల్లి మండలంలోని వడ్కాపూర్ గ్రామానికి చెందిన రేచవేని అరవింద్ డిగ్రీ సప్లమెంటరీ పరీక్ష రాసేందుకు బైక్‌పై బయల్దేరాడు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి అతిసమీపంలో ఊక లోడ్‌తో వస్తున్న లారీని తప్పించబోయాడు. ఆ సమయంలో ఊక కళ్లలో పడింది. దాంతో బైక్ అదుపుతప్పి, కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో అరవింద్‌కు గాయాలవగా స్థానికులు బయటకు తీసి, అంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు కరీంనగర్ తీసుకెళ్లారు. సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై మహేందర్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రాకేశ్ (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): నాంసానిపల్లె గ్రామానికి చెందిన నూనె రాకేశ్(22) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాకేశ్ బుధవారం నారు మడికి నీరు పెట్టడానికి వెళ్లాడు. స్టార్టర్‌ను ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాకేశ్ నేత్రాలను అతని కుటుంబసభ్యుల అంగీకారంతో సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు భీష్మాచారి ఆధ్వర్యంలో సేకరించి, హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు పంపించారు.

### రైస్‌మిల్లు ఆపరేటర్..



తల్యాబ్ అలీ మృతదేహం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి పూసాల శివారు రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పని చేస్తున్న తల్యాబ్ అలీ(21) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఎస్సై విజేందర్ వివరాల ప్రకారం.. కోల్‌కతాలోని కొల్వా గ్రామానికి చెందిన తల్యాబ్ అలీ గత కొంత కాలంగా కామధేనువు రైస్‌మిల్లుల ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉతికిన దుస్తులను తన రూంలో ఆరవేస్తుండగా తీగకు విద్యుత్ సరఫరా జరగడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి బావమరిది నదీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనకు రైస్‌మిల్లు యాజమాన్యమే కారణమని కార్మిక సంఘం నాయకులు ఆరోపించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



రాజయ్య మృతదేహం

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని గొల్లపల్లికి చెందిన ఎలవేణి రాజయ్య(55) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విజేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజయ్య గతంలో అప్పు చేసి, మస్కట్‌కు వెళ్లి వచ్చాడు. కాగా అప్పు తీరకపోవడం, పెళ్లికి ఎదిగిన కూతురు ఉండటంతో దంపతులు సోమవారం గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన రాజయ్య బుధవారం క్రిమిసంహారక మందు తాగి, పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. గమనించిన పోలీసులు వెంటనే అతన్ని తమ వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అక్క లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## అధికారిక కార్యక్రమాలకు పిలవాలి



మాట్లాడుతున్న జాతీయ సంఘాల నాయకులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి యాజమాన్యం నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు అన్ని సంఘాలను పిలవాలని జాతీయ సంఘాల నాయకులు జనక్ ప్రసాద్, తుమ్మల రాజారెడ్డి, యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖనిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గెలిచిన సంఘాన్ని మాత్రమే పిలిస్తే తాము ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ విషయమై జాతీయ సంఘాలు తీర్మానం చేసి, లేఖను డైరెక్టర్(పా)కు పంపించినట్లు తెలిపారు. అయితే దశాబ్ది ఉత్సవాలకు అన్ని సంఘాలను అధికారికంగా పిలుస్తామని తెలపడంతో నిరసన కార్యక్రమం వాయిదా వేశామన్నారు. అన్ని యూనియన్ల నాయకులు, కార్యకర్తలు ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

# అప్పుల రాష్ట్రంగా మార్చి.. ఉత్సవాలా?

- వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్



డాక్టర్ నగేశ్

హుజూరాబాద్: మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చి, దశాబ్ది ఉత్సవాలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ విమర్శించారు. బుధవారం హుజూరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రాష్ట్రాన్ని దోపిడీ చేశారని, అన్ని వ్యవస్థలను నాశనం చేశారని ఆరోపించారు. పదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందో? ఎవరు బాగుపడ్డారో చెప్పాలన్నారు. తెలంగాణ అప్పుల రాష్ట్రంగా మారిందని, దీనికి సీఎం కేసీఆర్ బాధ్యత వహించాలని, ఎన్నికల హామీలు ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని, రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలు చేస్తూ కమీషన్ల ప్రభుత్వంగా కొనసాగుతోందని మండిపడ్డారు. రూ. 200 కోట్ల ఖర్చు పెట్టి, దశాబ్ది ఉత్సవాలను 20 రోజులు ఎందుకు చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే ప్రజాధనాన్ని ఈ వేడుకలకు ఖర్చు చేస్తున్నారని అన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ బాధ్యులపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తామని చెప్పి, రెండు నెలలవుతున్నా ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్–వరంగల్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. పట్టణంలోని కేడీసీసీ బ్యాంక్ వద్ద సైకిల్‌పై వెళ్తున్న రాయికల్‌కు చెందిన రాజయ్య(50)ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని 108 వాహనంలో హుజూ రాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

**మున్సిపల్ ఉద్యోగికి గాయాలు...**

హుజూరాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఇంజినీరింగ్ విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న దేవోజు శ్రీనివాస్ బుధవారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. జమ్మికుంట రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయ సమీపంలో వాహనం అదుపుతప్పి, పడిపోవడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## బొగ్గుబాయి వార్తలు

# దశాబ్ది వేడుకలు వైభవంగా నిర్వహించాలి

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలను వైభవంగా నిర్వహించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. బుధవారం గోదావరిఖనిలోని సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంను సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించి, వేడుకలకు హాజరయ్యే కార్మిక కుటుంబాలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ నెల 5న ఉదయం స్టేడియంలో ఫుడ్ కోర్ట్ స్టాల్స్, ప్రముఖ కళాకారులచే ధూంధాం, కనులవిందు చేసే తెలంగాణ కల్చరల్ షో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రామ్మోహన్, డీజీఎం పర్సనల్ సీహెచ్.లక్ష్మీనారాయణ, సివిల్ డీజీఎం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండొద్దు..**

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలపై బుధవారం ఆర్జీ–2 జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వకీల్‌పల్లి ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వేడుకలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా రక్షణ అధికారి బచ్చు రవీందర్, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, డీజీఎం ఐఈడీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించండి

- ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర్‌రావు



ఓసీపీ–2లో కోల్ సైబర్ మెషీన్‌ను ప్రారంభిస్తున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

కమాన్‌పూర్(మంథని): సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో భాగంగా గనుల్లో ఏర్పాటు చేస్తున్న యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 క్వారీలో నూతనంగా ఏర్పాటు చేసిన కోల్ సైబర్ మెషీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణిలో మొట్టమొదటిసారిగా కోల్ సైబర్ మెషీన్‌ను ఓసీపీ–2లో ప్రారంభించుకోవడం జరిగిందని, ఇది పెద్ద పెద్ద బొగ్గు పెల్లలను చిన్నగా కట్ చేస్తుందని తెలిపారు. కోట్లాది రూపాయల విలువైన యంత్రాలు, వాహనాలను చిన్న చిన్న మరమ్మతుల పేరిట పక్కన పడేయవద్దన్నారు. పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే అనుకున్న లక్ష్యాలను సాధించుకోగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఎలిషా, ప్రాజెక్టు అధికారి నరేందర్, ఎస్వోటూ జీఎం రఘుపతి, ఏరియా సర్వే అధికారి జైనుల్లాబద్దీన్, ప్రాజెక్టు ఇంజినీర్ నాగరాజు, మేనేజర్ రామారావు, రక్షణ అధికారి ఆసిఫ్, నాయకులు పర్ష బక్కయ్య, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో టీబీజీకేఎస్‌కు బుద్ధి చెప్పాలి

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): హామీలు అమలు చేయని టీబీజీకేఎస్‌కు రాబోయే గుర్తింపు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం జీడీకే–5 ఓసీపీపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్ సాక్షిగా ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికులకు అనేక హామీలిచ్చి, అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కొత్త బొగ్గు గనులు ప్రారంభిస్తామని, 10 వేల ఉద్యోగాలు కల్పిస్తామని, నూతన క్వార్టర్లు నిర్మిస్తామని చెప్పి, మోసం చేశారన్నారు. హామీలు అమలు చేయకపోగా ఉన్న ఉద్యోగాలు పోగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలోని మొట్టమొదటి ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న సింగరేణిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. నాయకులు వికాస్‌కుమార్, ఎట్టెం కృష్ణ, సమ్మయ్య, సాగర్, జగన్మోహన్, శ్రీనివాస్, ఆంజనేయులు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గత ఎన్నికల హామీలు నెరవేర్చాలి

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని(రామగుండం): గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికుల హక్కుల రక్షణలో తమ యూనియన్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కార్మిక సంఘాల ఐక్యతతోనే మెరుగైన 11వ వేతన ఒప్పందం సాధించామని పేర్కొన్నారు. సింగరేణిలో నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని సూచించారు. లేకపోతే కార్మికులే తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో నాయకులు మెండె శ్రీనివాస్, సీహెచ్.వేణుగోపాల్‌రెడ్డి, కారం సత్తయ్య, వంగల రాములు, పి.శ్రీనివాసరావు, నంది నారాయణ, బొంకూరు సురేష్, పులి ఈశ్వర్, ఆర్.సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## యువతి బలవన్మరణం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగిరి మండలంలోని సుందిళ్లకు చెందిన జనగామ నర్సయ్య కూతురు ప్రత్యూష(33) ఆత్మహత్య చేసుకుంది. గోదావరిఖని టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. నర్సయ్యకు నలుగురు ఆడపిల్లలు కాగా రెండో కుమార్తె ప్రత్యూషకు పుట్టుకతోనే మాటలు సరిగా రావు. ఆమె మానసిక పరిస్థితి బాగా లేకపోవడం, నరాల బలహీనతతో బాధ పడుతుండేది. వైద్యులకు చూపించినా ఫలితం లేకపోయింది. ఏడాది క్రితం థైరాయిడ్ ఉందని డాక్టర్లు చెప్పడంతో మరింత బాధ పడుతూ గదిలో నుంచి బయటకు రావడం లేదు. బుధవారం తల్లిదండ్రులు మందులు వేసుకోమని చెప్పి, కూలీ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ప్రత్యూష ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న వినోద్‌కుమార్

కరీంనగర్: రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన గజ్జెల అభినయ తండ్రి గజ్జెల కనుకయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి వచ్చిన రూ.62 వేల చెక్కును బుధవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ తన కార్యాలయంలో అందజేశారు. పేద వారికి సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని తెలిపారు.

### ధూమపానం నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

కరీంనగర్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని ఆర్టీసీ కరీంనగర్ జోనల్ ఆస్పత్రి సిబ్బంది బుధవారం ఆర్టీసీ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల, డాక్టర్ రచనాసింగ్‌లు పొగాకు, ధూమపానం వల్ల ఆరోగ్యానికి కలిగే హానిని వివరిస్తూ ధూమపానం అనేక కేన్సర్లకు కారణమని తెలిపారు. పొగాకుకు దూరంగా ఉండి ఆరోగ్యాలను కాపాడుకొని కుటుంబ సంక్షేమానికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది యుగంధర్, ఫిజియోథెరపిస్టు రమణారెడ్డి, ఫార్మాసిస్ట్, స్టాఫ్‌నర్స్ విజయ, శ్యామల, ల్యాబ్ టెక్నీషియన్ ఎండీ రయీస్, ఆఫీస్ సిబ్బంది మునీందర్, జ్యోతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### 'సంపాదిత సెలవులు నిల్వ చేయాలి'

విద్యానగర్(కరీంనగర్): బడిబాటలో పాల్గొనే ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు నిల్వ చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాంసాని ఉమారాణి, తూముల తిరుపతిలు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాల విద్యాశాఖ జూన్ 3 నుంచి బడిబాట షెడ్యూల్ ఇచ్చి జూన్ 1 నుంచి కార్యాచరణ ప్రారంభించాలని ఆదేశాలు ఇచ్చిందని అన్నారు. వేసవి సెలవుల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ పేరుతో ఉపాధ్యాయులను బడిబాటలో పాల్గొనాలని ఆదేశాలు ఇచ్చినందున సంపాదిత సెలవులు నిల్వ చేయాలని కోరారు.

### 'ఎంఐఎంను విమర్శిస్తే ఓట్లు రాలవు'

విద్యానగర్(కరీంనగర్): ఎంఐఎం పార్టీ, ఓవైసీలను బండి సంజయ్ విమర్శించినంత మాత్రాన ఓట్లు రాలవని ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంజయ్ అర్థరహిత విమర్శలు చేస్తున్నాడని, ఎంపీగా నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. గత ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ ఓడించిన గతాన్ని గుర్తు తెచ్చుకోవాలని సూచించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్ గెలువకుండా ఆ పార్టీ నాయకులే కుట్ర చేయడం వల్ల సంజయ్ గెలిచాడని బీజేపీ చరిష్మాతో కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించి తీరుతామన్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎవరిని అసెంబ్లీకి పంపాలన్నది తమ పార్టీయే నిర్ణయిస్తుందని పేర్కొన్నారు.

### వ్యవసాయంపై రైతులకు అవగాహన

కొత్తపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన మండలంలోని నాగులమల్యాల గ్రామంలో బుధవారం రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు లోతు దుక్కులు, మట్టి నమూనా పరీక్షలు, వాతావరణ ఆధారిత వ్యవసాయంపై పలు సూచనలు చేశారు. దత్తత గ్రామ ఇన్‌చార్జి డా.జి ఉషారాణి మాట్లాడుతూ వేసవిలో రైతులు లోతు దుక్కులు చేయడం వల్ల కలుపు, చీడ పీడల ఉధృతిని చాలా వరకు తగ్గించవచ్చన్నారు. మరో శాస్త్రవేత్త డా.పి.మధూకర్‌రావు వాతావరణ ఆధారిత వ్యవసాయంలో పాటించాల్సిన నియమాలు, పంటల సరళి, పంటల వైవిధ్యం గురించి రైతులకు అవగాహన కల్పించి కరపత్రాలు అందజేశారు. అలాగే మట్టి నమూనా సేకరించడం, పరిశీలన, విశ్లేషణ గురించి ఏరువాక కేంద్రం కరీంనగర్ చెందిన శాస్త్రవేత ఎం.రాజేంద్రప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాయిని ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సుష్మిత, రైతులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం: బొమ్మకల్‌లో పోచమ్మ బోనాలు



కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో బుధవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. జూన్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న కొచ్చెగుట్ట మల్లికార్జునస్వామి పట్నాలను పురస్కరించుకుని బోనాలు చేశారు. మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని డప్పుచప్పుళ్ల నడుమ ప్రధాన వీధుల నుంచి ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకుని మొక్కులు సమర్పించారు. యాదవ సంఘం అధ్యక్షుడు కాల్వ మల్లేశం, ప్రతినిధులు కాల్వ అశోక్, రవీందర్, శ్రీకాంత్, తిరుపతి, రాజేశం, సంపత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌రూరల్

## చిత్ర కథ: మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం



పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు.. మొక్కే జగతికి మూలం.. మానవజాతికి మూలాధారం అంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం అభాసుపాలవుతోంది. నాటిన మొక్కలకు సంరక్షణ కరువైంది. ఫలితంగా మొక్కలు.. వాటికి సంరక్షణగా ఏర్పాటు చేసిన ట్రీగార్డులు నేలకొరుగుతున్నాయి. ఇందులో కొన్ని మొక్కలు బ్రతికుండగా మరికొన్ని మొక్కలు చనిపోయాయి. ప్రభుత్వం హరితహారంపై ప్రత్యేక దృష్టి పెడుతుంటే పలు పంచాయతీలు పెడ చెవిన పెడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామ పంచాయతీ పరిధి ఇందిరమ్మకాలనీ సమీపంలోని ప్రధాన రోడ్డు వెంబడ నాటిన మొక్కలు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. మొక్కల సంరక్షణ బాధ్యతలపై దృష్టి సారించకపోవడం వల్ల అవి పనికి రాకుండా పోయాయి. - కొత్తపల్లి

### బొడ్రాయి ప్రతిష్ఠ



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ గ్రామంలో భూలక్ష్మి, మహాలక్ష్మి బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద పండితులతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊరడి మంజుల మల్లారెడ్డి, ఉప సర్పంచ్ ఆరె శ్రీకాంత్, వార్డు సభ్యులు నర్సయ్య, అనూష నరేశ్, నిర్మల శ్రీనివాస్, శ్రీనివాస్, మూర్తి, త్రివేణి సంపత్, మంద పద్మమధు, పీఏసీఎస్ చైర్మన్ గోనె నర్సయ్య, మస్కు మల్లారెడ్డి, గోనె ఎల్లారెడ్డి, రాజు, లక్ష్మారెడ్డి, లక్ష్మయ్య, రాము, తదితరులు పాల్గొన్నారు.

# నథింగ్ 'స్పెషల్'

- మొక్కుబడిగా పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌లు
- కొరవడిన చిత్తశుద్ధి, ప్రజా భాగస్వామ్యం
- అంతంతమాత్రంగానే 'స్వచ్ఛ్ షెహర్'
- నగరంలో ప్రభావం చూపని శానిటేషన్ డ్రైవ్
- తీరు మారితేనే అవార్డులకు చేరువ

కరీంనగర్‌కార్పొరేషన్: సాధారణంగా సాగుతుండే పనులు.. అందుకు అదనంగా స్పెషల్ డ్రైవ్‌లు.. ప్రత్యేక కార్యక్రమాలు.. ఇంకేం.. నగరం 'స్వచ్ఛ్ షెహర్'గా మారడం ఖాయమనుకుంటే పొరపాటే. కొరవడిన చిత్తశుద్ధి.. మొక్కుబడి కార్యక్రమాలు.. తూతూ మంత్రంగా చర్యలు.. కనిపించని ప్రజల భాగస్వామ్యం వెరసి నగరం నథింగ్ స్పెషల్‌గా మారింది.

**కొరవడిన చిత్తశుద్ధి**

కరీంనగర్ నగరపాలక సంస్థగా రూపాంతరం చెందిన తర్వాత నగరాన్ని ఆ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలను అమలు చేస్తున్నాయి. ముఖ్యంగా స్వచ్ఛ నగరంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాజాగా చేపట్టిన మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్ కార్యక్రమం నగరంలో కొనసాగుతోంది. మే 15న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 5వ తేదీన ముగియనుంది. ఇళ్లల్లో ఉండే నిరుపయోగ వస్తువులను సేకరించి రీ యూజ్, రీ సైకిల్ చేయడం ఈ స్వచ్ఛ్ షెహర్ ప్రధాన లక్ష్యం. అందులో భాగంగానే డివిజన్లవారీగా ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్) సెంటర్లను ఏర్పాటు చేశారు. నిరుపయోగ వస్తువులు బయట పడేయకుండా, డంప్‌యార్డ్‌కు వెళ్లకుండా ఉండేందుకు చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం, చిత్తశుద్ధిలేమితో అంతంత మాత్రంగానే సాగుతోంది. ఈ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృతస్థాయిలో అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం చెందడంతో, ప్రజల భాగస్వామ్యం కనిపించడం లేదు. ఇళ్లల్లో ఉండే నిరుపయోగ వస్తువులను సెంటర్ల వద్దకు వచ్చి ఇచ్చేందుకు ప్రజలు పెద్దగా మొగ్గుచూపడం లేదు. కొన్ని డివిజన్లలో సెంటర్లు ఎక్కడున్నాయో కూడా స్థానికులకు తెలియని పరిస్థితి ఉంది. డివిజన్లలో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించినా చాలా డివిజన్లలో సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు. జవాన్లు, మెప్మా సిబ్బంది, స్థానిక కార్పొరేటర్, ఒకరిద్దరు నాయకులతో ర్యాలీలు నిర్వహించి మమ అనిపించారు. ఫలితంగా చాలా మందికి ఆర్ఆర్ఆర్ సెంటర్ల ప్రయోజనం, లక్ష్యం తెలియకుండా పోయింది.



డ్రెయినేజీలో పేరుకపోయిన చెత్తా చెదారం

**ముగిసిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్**

నగరంలో స్వచ్ఛ్‌షెహర్ కార్యక్రమం కొనసాగుతున్న క్రమంలోనే శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రవేశపెట్టారు. స్వచ్ఛ్‌షెహర్ చేపట్టిన నాలుగు రోజుల తర్వాత మే 19న ప్రారంభమైన స్పెషల్ డ్రైవ్ 27వ తేదీ వరకు కొనసాగింది. ఇందుకోసం ఒక్కో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఒక్కో డివిజన్ బాధ్యత అప్పగించి, పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని కూడా నియమించారు. కాని ప్రత్యేకమైన నిధులు ఏవీ కేటాయించకపోవడంతో ఈ డ్రైవ్ నామమాత్రంగా కొనసాగింది. రోజువారీగా సాగే కార్యక్రమాల్లోనే స్పెషల్‌డ్రైవ్ పేరిట హడావుడి చేసి ముగించారనే విమర్శలున్నాయి. డివిజన్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసుకొని సమస్యలు గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. కానీ మెజార్టీ డివిజన్లలో సమావేశాల జాడే లేకపోగా, సమస్యలు గుర్తించడం, పరిష్కరించడమనే మాటే లేదు. వర్షాకాలం వస్తున్నందున డ్రైనేజీలను శుభ్రపర్చాలని, సిల్ట్ తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నా చాలా చోట్ల డ్రైనేజీల్లో చెత్త అలానే దర్శనమిస్తోంది.

ఏది ఏమైనా నగరంలో నిర్వహించే డ్రైవ్‌లలో స్పెషల్ ఎక్కడా ఉండడం లేదు. స్వచ్ఛ్‌షెహర్ మరో ఐదురోజుల పాటు కొనసాగనున్నందున ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరిస్తేనే స్వచ్ఛతలో నగరం అవార్డులకు చేరువయ్యే అవకాశం ఉంది.

## డిగ్రీ కళాశాల ప్రహరీ పనులు ప్రారంభం



నిర్మిస్తున్న ప్రహరీ

కరీంనగర్‌రూరల్:కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ మహిళా వ్యవసాయ డిగ్రీ కళాశాల ప్రహరీ నిర్మాణపు పనులు ప్రారంభమయ్యాయి. కళాశాల భవన నిర్మాణానికి గ్రామశివారులోని పూరేన్‌గుట్టకు చెందిన 43.16 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ కేటాయించారు. భవనాల నిర్మాణానికి రూ.23కోట్లతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మొదటి దశలో ఏడు ఎకరాల్లోని గుట్టను చదును చేయడం, గుట్ట చుట్టూ రెండున్నర కిలోమీటర్లు ప్రహరీ నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధులు రూ.1.30కోట్లు మంజూరు చేశారు. మార్చి 31న మంత్రి గంగుల కమలాకర్ భూమిపూజ చేసి భవన నిర్మాణపు పనులు లాంఛనంగా ప్రారంభించారు. 15 రోజుల నుంచి జేసీబీతో గుట్టను చదును చేసే పనులు నడుస్తుండగా మంగళవారం నుంచి ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టారు. సిమెంట్ పలకలతో గుట్ట చుట్టూ ప్రహరీని నిర్మించనున్నారు.

## ఉద్యమకారులను గుర్తించని రాష్ట్ర ప్రభుత్వం

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేదని పేర్కొంటూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ కుక్క మల్లయ్య ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో లాఠీదెబ్బలు తిని జైలుకు వెళ్లి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన ఉద్యమకారులను మరిచి ఉద్యమాన్ని వ్యతిరేకించిన వారికి పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శంకరయ్య, రాంరెడ్డి, శ్రీనివాస్, సదానందచారి, ఇరుకుల్ల రాజేశం, గంట పరశురాములు, కుక్క సంజీవ్‌కుమార్, లింగంపల్లి వెంకటేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

## సీఎం కేసీఆర్‌తోనే రైతులకు సంక్షేమం

కొత్తపల్లి: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణాలో వ్యవసాయం పండుగలా మారిందని, ఆయనతోనే రైతులకు సంక్షేమం ఏర్పడుతుందని పలువురు నాయకులు కొనియాడారు. కొత్తపల్లి పట్టణంలోని 8వ వార్డుకు చెందిన రైతు మధుసూదన్ అనారోగ్య కారణంతో మరణించగా రైతు బీమా ద్వారా మంజూరైన రూ.5 లక్షల బీమాకు సంబంధించిన ప్రొసీడింగ్‌ను వార్డు కౌన్సిలర్ ఎస్కే నజీయ బాబా ఆధ్వర్యంలో వారి కుటుంబసభ్యులకు అందించారు. రైతులకు పుష్కలమైన సాగునీరు, ఉచిత కరెంట్, రైతు బంధుతో తెలంగాణాలో రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారన్నారు. ఏ కారణంతోనైనా రైతు మరణిస్తే కుటుంబసభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల బీమా అందిస్తుందని తెలిపారు. బీమాకు కృషి చేసిన మంత్రి గంగుల కమలాకరుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు కె.వెంకట్‌రెడ్డి, సుంకె ఓదెలు, పుప్పాల కుమార్, చింతల ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గుంటి రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.



రైతుబీమా చెక్కు అందజేస్తున్న ఎస్కే నజీయ బాబా

### కుల వృత్తిదారులకు ఆర్థికసాయం హర్షణీయం



మంత్రి గంగుల కమలాకర్‌తో మేరు కుల సంఘం నాయకులు

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కులవృత్తులతో జీవనం సాగించే వారికి రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించడం హర్షణీయమని మేరు సంఘం జిల్లా పెండ్యాల మహేశ్ అన్నారు. బుధవారం రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, సివిల్ సప్లయి చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి కిషన్, నగర అధ్యక్షుడు మాడిశెట్టి నందగోపాల్, ఉపాధ్యక్షులు ఓదెల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి స్వామి, నాయకులు మాడిశెట్టి శ్రీనివాస్, ఓదెల సూర్య, శ్రీనివాస్ కనకుల శేఖర్, అజయ్ శ్రీనివాస్, రమేష్, ఓదెల రాజు, గూడూరి శివ, రాపర్తి రాజేశం, శీలం శ్రీహరిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

### వినోద్‌కుమార్‌ను కలిసిన లిడ్‌క్యాప్ కార్మికులు



వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న లిడ్ క్యాప్ కార్మికులు

జమ్మికుంట: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కరీంనగర్‌లో జమ్మికుంట లిడ్ క్యాప్ కార్మికులు కలిసి వినతిపత్రం బుధవారం అందించారు. ఈ సందర్భంగా జమ్మికుంట లిడ్‌క్యాప్(లెదర్ పార్క్) పునరర్నిర్మించాలని కోరారు. స్పందించిన వినోద్‌కుమార్, లిడ్‌క్యాప్ ఎండీతో ఫోన్‌లో మాట్లాడి లెదర్ పార్క్ మిషన్‌లను రిపేర్ చేయించి, వినియోగంలోకి తేవాలని లెదర్ పార్క్‌ను సందర్శించి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. జమ్మికుంటలో మెగా లెదర్ పార్క్ నిర్మించాలని సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరెపల్లి రాజేందర్, మొలుగూ రాజు, రామంచ రాజారాం, రాచపల్లి మహేశ్, చిట్యాల మొగిలి, అంతడుపుల కొమురయ్య, జంగా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

### కరాటే కల్యాణిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

విద్యానగర్(కరీంనగర్): ఎన్టీఆర్ విగ్రహం విషయంలో సినీ నటి కరాటే కల్యాణిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి మల్లయ్య, జంగ కొమురయ్య డిమాండ్ చేశారు. బుధవారం సమితి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మా అసోసియేషన్‌పై సినీ పరిశ్రమపై కల్యాణి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, కృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని పెట్టడాన్ని మాత్రమే ఆమె వ్యతిరేకించారని తెలిపారు. ఈ విషయంలో షోకాజ్ నోటీస్ ఇవ్వకుండా సస్పెన్షన్ చేసే హక్కు మా సంస్థకు లేదన్నారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడు కడారి అయిలన్న, రాష్ట్ర నాయకులు వాసం మల్లేశం, చిగుర్ల శ్రీనివాస్ కురుమ, పోతరవేని తిరుపతి పాల్గొన్నారు.

### చిన్నారుల పెరుగుదలపై ప్రత్యేక దృష్టి

మానకొండూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పెరుగుదలపై టీచర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూపర్‌వైజర్ అరుణ సూచించారు. మండలంలోని చెంజర్ల గ్రామంలో చెంజర్ల సెక్టర్ మీటింగ్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డుల నమోదు పరిశీలించి పలు సూచనలు చేశారు. చిన్నారులకు బాలామృతం అందించాలని ఎప్పటికప్పుడు చిన్నారుల బరువు తూకం వేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

### అన్నదానం



కరీంనగర్‌రూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం హౌసింగ్ బోర్డుకాలనీలోని వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో బీజేపీ నాయకుడు చింతల కిషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోమారపు వెంకన్న, దిండిగాల మధు, అవుదుర్తి శ్రీనివాస్, మధు, ప్రభాకర్, ఉమామహేశ్వర్, మనోహర్, శ్రీధర్, లక్కాకుల ముని తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

విద్యానగర్(కరీంనగర్): నగరంలో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు బుధవారం డీఈవో జనార్దన్‌కు వినతిపత్రం అందజేశారు. ఫీజు నియంత్రణ చట్టం తేవాలని, విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణాప్రతాప్, ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీకాంత్, కోశాధికారి రవితేజ, నాయకులు అరవింద్, పవన్ ఉన్నారు.



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

### నాగజ్యోతికి డాక్టరేట్



నాగజ్యోతి

కరీంనగర్‌సిటీ: వేములవాడ మండలానికి చెందిన బక్కి నాగజ్యోతి డాక్టరేట్ అందుకుంది. ఏఐహెచ్‌సీఏ విభాగానికి చెందిన ఎకనోగ్రఫీ ఆఫ్ మహిషాసుర మర్దిని విత్ రిఫరెన్స్ టు మ్యూజియస్ ఆఫ్ హైదరాబాద్ అనే పరిశోధనకు మే 24న ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ వీణాకుమారి పర్యవేక్షణలో డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా నాగజ్యోతిని ఆమె తల్లిదండ్రులు, బంధువులు, విద్యావేత్తలు అభినందించారు.

### పెద్దమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

గన్నేరువరం: మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామశివారు చొక్కల్లపల్లిలో పెద్దమ్మ తల్లి జాతరలో భాగంగా బుధవారం పెద్దమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా, మండల కోఆర్డినేటర్లు గూడెల్లి తిరుపతి, తిరుపతిరెడ్డి టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి ఆంజనేయులు, సర్పంచులు ఎంపీటీసీలు డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.



## సౌజన్య శుభారంభం

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి బవిశెట్టి సౌజన్య శుభారంభం చేసింది. థాయ్‌లాండ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సౌజన్య 7-6 (7/5), 6-3తో భారత్‌కే చెందిన జీల్ దేశాయ్‌పై గెలిచింది. గంటా 59 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సౌజన్య రెండు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సౌజన్య-దశ ఇవనోవా (అమెరికా) జోడీ 2-6, 4-6తో శ్రీవల్లి రష్మిక-వైదేహి (భారత్) ద్వయం చేతిలో ఓడిపోయింది.

## హేమలతకు రెండు పతకాలు



ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన బి.హేమలత రోయింగ్‌లో రెండు పతకాలు సాధించింది. ఉత్తర ప్రదేశ్‌లో బుధవారం జరిగిన లైట్ వెయిట్ 500 మీటర్ల సింగిల్ స్కల్ విభాగంలో స్వర్ణ పతకం... 2000 మీటర్ల లైట్ వెయిట్ సింగిల్ స్కల్ విభాగంలో రజత పతకం గెల్చుకుంది. హేమలత సరోజినినాయుడు వనితా మహావిద్యాలయలో బీఏ రెండో సంవత్సరం చదువుతోంది.

# రెండో రౌండ్‌లో సాకేత్-యూకీ జోడీ



ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల డబుల్స్ విభాగంలో తొలిసారి ఆడుతున్న సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ అద్భుత ప్రదర్శనతో తొలి రౌండ్‌ను దాటి రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్-యూకీ ద్వయం 6-3, 6-2తో ఎంజూ క్వాకు-రిండర్‌నీచ్ (ఫ్రాన్స్) జోడీపై గెలిచింది. 64 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్, యూకీ మూడు ఏస్‌లు సంధించారు. ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఆరో సీడ్ రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) 5-7, 6-7 (5/7)తో సాదియో డుంబియా-రెబూల్ (ఫ్రాన్స్) చేతిలో... శ్రీరామ్ బాలాజీ-జీవన్ నెడుంజెళియన్ 3-6, 4-6తో లవష్కా (బెలారస్)-పాపిరిన్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయారు. తొలి రౌండ్‌లో ఓడిన బోపన్న-ఎబ్డెన్, బాలాజీ-జీవన్ జోడీలకు 17,000 యూరోల (రూ. 14 లక్షల 95 వేలు) చొప్పున ప్రైజ్‌మనీ లభించింది.

# గార్సియాకు షాక్

- రెండో రౌండ్‌లోనే ఓడిన ఫ్రాన్స్ స్టార్
- మాజీ విజేత ఒస్టాపెంకో కూడా ఇంటిదారి

**పారిస్:** మహిళల సింగిల్స్ విభాగంలో టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకరైన కరోలిన్ గార్సియాకు అనూహ్య ఓటమి ఎదురైంది. సొంతగడ్డపై జరుగుతున్న ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ఈ ఫ్రాన్స్ స్టార్ రెండో రౌండ్‌ను దాటి ముందుకెళ్లలేకపోయింది. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్, ఐదో సీడ్ గార్సియా 6-4, 3-6, 5-7తో ప్రపంచ 56వ ర్యాంకర్ అనా బ్లింకోవా (రష్యా) చేతిలో ఓడిపోయింది. 2 గంటల 51 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో గార్సియా ఏడు డబుల్ ఫాల్ట్‌లు, 50 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది. వరుసగా నాలుగో ఏడాది ఈ టోర్నీలో ఆడుతున్న బ్లింకోవా ఐదుసార్లు గార్సియా సర్వీస్‌ను బ్రేక్ చేసి రెండోసారి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. 2017 చాంపియన్, 17వ ర్యాంకర్ ఎలెనా ఒస్టాపెంకో (లాత్వియా) కూడా రెండో రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఒస్టాపెంకో 3-6, 6-1, 2-6తో పేటన్ స్టెర్న్స్ (అమెరికా) చేతిలో పరాజయం పాలైంది. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్) 7-5, 6-2తో ఇరీనా షిమనోవిచ్ (బెలారస్)పై, తొమ్మిదో సీడ్ కసత్‌కినా (రష్యా) 6-3, 6-4తో వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్)పై, స్వితోలినా (ఉక్రెయిన్) 2-6, 6-3, 6-1తో స్టార్మ్ హంటర్ (ఆస్ట్రేలియా)పై గెలుపొంది మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. మూడో సీడ్ జెస్సికా







పెగూలా (అమెరికా) తొలి సెట్‌ను 6-2తో గెల్చుకున్నాక ఆమె ప్రత్యర్థి కామిల్లా జియార్జి (ఇటలీ) గాయం కారణంగా వైదొలిగింది.

**అల్‌కరాజ్ ముందుకు...**

పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), 11వ సీడ్ ఖచనోవ్ (రష్యా) మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. అల్‌కరాజ్ 6-1, 3-6, 6-1, 6-2తో టారో డానియల్ (జపాన్)పై, సిట్సిపాస్ 6-3, 7-6 (7/4), 6-2తో కార్బెలాస్ బేనా (స్పెయిన్)పై, ఖచనోవ్ 6-3, 6-4, 6-2తో రాడూ అల్బోట్ (మాల్డోవా)పై గెలిచారు. 2015 చాంపియన్ వావ్రింకా (స్విట్జర్లాండ్) 4 గంటల 38 నిమిషాల పోరులో 6-3, 5-7, 3-6, 7-6 (7/4), 3-6తో కొకినాకిస్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడిపోయాడు.

# ‘విచారణ కొనసాగుతోంది’



రెజ్లర్లు బజరంగ్ పూనియా, సంగీత ఫొగాట్, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్

- బ్రిజ్‌భూషణ్ కేసుపై ఢిల్లీ పోలీసుల వివరణ
- త్వరలోనే నివేదిక ఇస్తామని వెల్లడి

**న్యూఢిల్లీ:** లైంగిక వేధింపులకు సంబంధించి భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై నమోదైన కేసు వ్యవహారంలో ఢిల్లీ పోలీసులు స్పష్టతనిచ్చారు. దీనిపై విచారణ ఇంకా కొనసాగుతోందని వారు వెల్లడించారు. బుధవారం ఉదయం ‘మహిళా రెజ్లర్లు చేసిన ఆరోపణల విషయంలో బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లభించలేదు’ అని పోలీసులు చెప్పినట్లుగా వార్తలు వచ్చాయి. దాంతో కాస్త గందరగోళం నెలకొంది. దాంతో పోలీసులు ముందుకు వచ్చి వివరణ ఇచ్చారు. ‘ఆ వార్తలు పూర్తిగా తప్పు. చాలా సున్నితమైన ఈ కేసు విషయంలో అంతే జాగ్రత్తగా విచారణ జరుపుతున్నాం. తాజా పరిస్థితిపై కోర్టుకు సమాచారం ఇస్తూనే ఉన్నాం. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతూనే ఉంది కాబట్టి నివేదిక కోర్టుకు సమర్పించక ముందు బహిరంగంగా వెల్లడి చేయడం సరైంది కాదు’ అని పోలీసులు స్పష్టం చేశారు. తాజా పరిణామాల్లో దేశంలోని వేర్వేరు రాజకీయ పార్టీలు రెజ్లర్లకు మద్దతు ప్రకటించాయి. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రెజ్లర్లకు న్యాయం చేయాలంటూ స్వయంగా ప్లకార్డ్ పట్టి ర్యాలీలో పాల్గొనగా... బ్రిజ్‌భూషణ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బేటీ బచావా, బేటీ పడావో మాత్రమే కాదు...ఇకపై బీజేపీ నాయకుల నుంచి ఆడబిడ్డలను కాపాడుకోవాలంటూ కాంగ్రెస్ పార్టీ ‘బేటీ బీజేపీ కే నేతావోంసే బచావో’ అంటూ కొత్త నినాదాన్ని ఇచ్చింది. మరోవైపు మంగళవారం హరిద్వార్‌లో గంగలో పతకాలు వేయాలని సంకల్పించిన ఆ తర్వాత మనసు మార్చుకున్న రెజ్లర్లు స్వస్థలం హరియాణా చేరుకోగా, సాక్షి మలిక్ మాత్రం ఢిల్లీలోనే ఉండిపోయింది. తీవ్ర బాధలో ఉండటంతో పాటు మౌనంగా ఉండాలని ఒట్టేసుకోవడం వల్లే మంగళవారం వారు ఎవరితో మాట్లాడలేదని సన్నిహితులు వెల్లడించారు.

**తీవ్ర చర్యలకు పాల్పడవద్దు: ఠాకూర్**



క్రీడల గొప్పతనాన్ని తగ్గించే ఎలాంటి తీవ్ర చర్యలకు పాల్పడవద్దని కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ రెజ్లర్లకు సూచించారు. విచారణ పూర్తయ్యే వరకు కాస్త ఓపిక పట్టమని ఆయన కోరారు. మరోవైపు ఆదివారం భారత రెజ్లర్ల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. రెజ్లర్లను పోలీసులు ఈడ్చుకుంటూ తీసుకెళ్లిన దృశ్యాలు కలిచివేసే విధంగా ఉన్నాయని ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది.

**‘ఆరోపణలు రుజువైతే ఉరి వేసుకుంటా’**




కేసుకు సంబంధించి తనపై ఆరోపణలు రుజువైతే ఉరి వేసుకుంటానని బ్రిజ్‌భూషణ్ సింగ్ మరోసారి చెప్పారు. ‘వారు నాపై ఆరోపణలు చేసి నాలుగు నెలలైంది. ఒక్కదానినీ రుజువు చేయలేకపోయారు. నాకు ఉరిశిక్ష విధించాలని వారు కోరారు. గంగలో పతకాలు వేయడం ద్వారా నన్ను శిక్షించలేరు. సాక్ష్యాలుంటే కోర్టుకు ఇచ్చి నాకు ఉరిశిక్ష వేయించండి. నా బిడ్డల్లాంటివారైన రెజ్లర్లపై నాకు ఇప్పటికీ కోపం లేదు’ అని ఆయన అన్నారు. మరోవైపు బ్రిజ్‌భూషణ్‌పై కేసు నమోదు చేసిన మైనర్ రెజ్లర్ వివరాలు బహిర్గతం చేసిన ఆమె బంధువు ఒకరిపై కేసు నమోదు చేయాలని ఢిల్లీ మహిళా కమిషన్ చైర్మన్ స్వాతి మలివాల్ పోలీసులకు సూచించింది.

# సింధు, శ్రీకాంత్‌లకు చుక్కెదురు

- తొలి రౌండ్‌లోనే నిష్క్రమణ
- సైనా, లక్ష్య సేన్ ముందంజ






**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, సమీర్ వర్మ, ప్రియాన్షు రజావత్, మిథున్ మంజునాథ్... మహిళల సింగిల్స్ విభాగంలో పీవీ సింధు, మాళవిక తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. మరోవైపు కిరణ్ జార్జ్, లక్ష్య సేన్, సైనా నెహ్వాల్, అష్మిత చాలిహా తొలి రౌండ్‌లో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

**ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్‌కు కిరణ్ షాక్**

పురుషుల సింగిల్స్‌లో 26వ ర్యాంకర్ వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో 21వ ర్యాంకర్ శ్రీకాంత్ 8-21, 21-16, 14-21తో ఓడిపోయాడు. సాయిప్రణీత్ 14-21, 16-21తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో, ప్రియాన్షు 19-21, 10-21తో ఎన్జీ జె యోంగ్ (మలేసియా) చేతిలో, సమీర్ వర్మ 15-21, 15-21తో జొహాన్సన్ (డెన్మార్క్), మిథున్ (భారత్) 21-17, 8-21, 15-21తో కున్లావుత్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు. ప్రపంచ 59వ ర్యాంకర్ కిరణ్ జార్జ్ 21-18, 22-20తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్, 2018 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ షి యు కి (చైనా)పై సంచలన విజయం సాధించగా... లక్ష్య సేన్ 21-23, 21-15, 21-15తో వాంగ్ జు వె (చైనీస్ తైపీ)పై కష్టపడి గెలిచాడు.

**26 నిమిషాల్లోనే...**

దాదాపు రెండు నెలల తర్వాత మరో అంతర్జాతీయ టోర్నీలో బరిలోకి దిగిన భారత స్టార్ సైనా నెహ్వాల్ తొలి రౌండ్‌లో కేవలం 26 నిమిషాల్లో 21-13, 21-7తో వెన్ జు జాంగ్ (కెనడా)పై గెలిచింది. మరో మ్యాచ్‌లో క్వాలిఫయర్ అష్మిత 21-17, 21-14తో భారత్‌కే చెందిన మాళవికను ఓడించింది.

**తొమ్మిదేళ్ల తర్వాత...**

కెనడా ప్లేయర్, ప్రపంచ 15వ ర్యాంకర్ మిచెల్లి లీతో జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ పీవీ సింధు 8-21, 21-18, 18-21తో ఓటమి చవిచూసింది. మిచెల్లి చేతిలో సింధు ఓడిపోవడం తొమ్మిదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం 21-13,18-21, 21-17తో రస్మూస్ జెర్ -సాగార్డ్ (డెన్మార్క్) జోడీపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.


# ఫైనల్లో భారత్

**సలాలా (ఒమన్):** ఆసియా కప్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. దక్షిణ కొరియాతో బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్లో టీమిండియా 9-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున ధామి బాబీ సింగ్ (31వ, 39, 55వ ని.లో) మూడో గోల్స్ సాధించగా... సునీల్ లాక్రా (13వ ని.లో), అర్జైజీత్ సింగ్ (19వ ని.లో), అంగద్‌బీర్ సింగ్ (34వ ని.లో), ఉత్తమ్ సింగ్ (38వ ని.లో), విష్ణుకాంత్ సింగ్ (51వ ని.లో), శ్రద్ధానంద్ తివారీ (57వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. కొరియా తరఫున కియోన్‌యోల్ వాంగ్ (46వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. పాకిస్తాన్, మలేసియా జట్ల మధ్య రెండో సెమీఫైనల్ విజేత జట్టుతో నేడు జరిగే ఫైనల్లో భారత్ తలపడతుంది.




# సినిమా

## గుంటూరు కారం ఫిక్స్



● మహేశ్‌బాబు

గళ్ల చొక్కా, తలకి ఎర్ర కండువాతో మహేశ్‌బాబు ఊర మాస్ లుక్ సూపర్ స్టార్ కృష్ణ జయంతి (మే 31) సందర్భంగా బుధవారం విడుదలైంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రంలోని లుక్ ఇది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రానికి ‘ఊరికి మొనగాడు’, ‘గుంటూరు కారం’.. వంటి టైటిల్స్‌ని చర్చిస్తున్నారని వార్తలు వచ్చాయి. ఫైనల్‌గా ‘గుంటూరు కారం’ టైటిల్ ఫిక్స్ చేసి, బుధవారం హైదరాబాద్‌లో ఫ్యాన్స్ సమక్షంలో టైటిల్ ప్రకటించి, ‘మాస్ స్ట్రైక్’ పేరుతో గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ వీడియోలో రౌడీ గ్యాంగ్‌ని చితకబాదుతూ, బీడీ వెలిగించి, ‘ఏంది అట్టా చూస్తున్నావ్.. బీడీ త్రీడీలో కనపడుతుందా’ అంటూ మహేశ్ చెప్పే డైలాగ్‌తో ఈ గ్లింప్స్ సాగుతుంది. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల కథానాయికలు. జనవరి 13న విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: పీఎస్ వినోద్.

## ఇండస్ట్రీలో బ్యాక్‌గ్రౌండ్ లేనివాళ్లకు నేనున్నా



**“నేను ఫుట్‌పాత్ నుంచి ఈ స్థాయికి వచ్చాను. ప్రతిభ ఉన్నా ఇండస్ట్రీకి ఎలా రావాలో తెలియనివాళ్లు చాలామంది ఉన్నారు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేని వాళ్లకు నేను బ్రేక్ ఇస్తాను.. నేనున్నంత వరకూ అవకాశాలు ఇస్తాను.. స్టార్ హీరోలతో సినిమా చేసినా అందులో కొత్తవారికి చాన్స్ ఇస్తాను” అని డైరెక్టర్ తేజ అన్నారు. అభిరామ్, గీతికా తివారీ జంటగా రూపొందిన చిత్రం ‘అహింస’. పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా తేజ చెప్పిన విశేషాలు.**

**- డైరెక్టర్ తేజ**

● అభిరామ్‌ని హీరోగా పరిచయం చేస్తానని రామానాయుడుగారికి మాట ఇచ్చాను.. ఆ మాట కోసమే తనతో ‘అహింస’ చేశాను. సినీ నేపథ్యంలో ఉన్న పెద్ద కుటుంబాల్లోని వ్యక్తులతో చేసినప్పుడు సహజంగానే పోలికలు వస్తాయి. ఇప్పటికే స్టార్స్ అయిన వెంకటేశ్, రానాలతో అభిరామ్‌ని పోల్చకూడదు. ఎక్కువ డబ్బులు, పేరు కోసం పెద్ద స్టార్స్‌తో పని చేయాలి. నేను డబ్బులు, పేరు చూశాను.. నాకు ఇంకేం కావాలి? ● ప్రేక్షకులు చాలా తెలివైనవారు. ట్రైలర్‌ని చూసి సినిమాకి వెళ్లాలా? వద్దా అని నిర్ణయించుకుంటున్నారు. స్టార్ హీరోని బట్టి థియేటర్‌కి వెళతారనుకుంటే.. అప్పుడు పెద్ద స్టార్స్‌కి అపజయాలే రాకూడదు కదా! సినిమాలో ఎమోషన్ ఉంటే ట్రైలర్‌లో కనిపిస్తుంది. ప్రేక్షకులు ఆ ఎమోషన్‌కి కనెక్ట్ అయితే స్టార్ సినిమానా? కొత్తవారిదా అనే తేడా లేకుండా వచ్చేస్తారు. ● ఒక ఫిలాసఫీని బేస్ చేసి తీసిన చిత్రమిది. అహింసని ఎలా ఫాలో అవ్వాలి? అనే కాన్సెప్ట్‌తో మంచి కమర్షియల్ కథతో ఈ సినిమా చేశాం. ఇందులో దాదాపు 14 యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. ఓ నాలుగు ఎపిసోడ్స్‌కి నేనే ఫైట్ మాస్టర్‌గా చేశాను. ● అభిరామ్‌కి సినీ నేపథ్యం ఉంది. తనని పరిచయం చేస్తున్నప్పుడు నాకంటే అభీపైనే ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. సురేశ్‌బాబుగారు ఒకసారి సెట్‌కి వచ్చారు. ‘నాన్నా.. నువ్వుంటే నేను చేయను’ అని అభి అనడంతో మానిటర్ వద్దకెళ్లి కూర్చున్నారాయన. ఇన్ని సినిమాలు చేసిన వెంకటేశ్‌గారు, రానాకి కూడా సురేశ్‌గారు సెట్‌కి వస్తే టెన్షన్ వచ్చేస్తుంది (నవ్వుతూ).. సురేశ్‌గారి దృష్టి వేరుగా ఉంటుంది. కిరణ్‌గారు రాజీ పడకుండా ఈ సినిమా తీశారు. ఈ మూవీకి ఆర్పీ పట్నాయక్ సంగీతం, అనూప్ రూబెన్స్ నేపథ్య సంగీతం ప్లస్ అయ్యాయి. ● ‘అహింస’ విజయం సాధించి డబ్బులు వస్తే ఆ డబ్బుతో మళ్లీ సినిమాలు తీస్తాను. నా చిత్రం మూవీస్ బేనర్‌లో కొత్త దర్శకులని పరిచయం చేస్తాను. నా తర్వాతి సినిమా ‘రాక్షస రాజు’ని రానాతో చేస్తాను. ఆ తర్వాత మా అబ్బాయిని హీరోగా పరిచయం చేసే సినిమా చేస్తాను.

## ఎమోషనల్ కానిస్టేబుల్



● వరుణ్ సందేశ్

వరుణ్ సందేశ్ హీరోగా ‘ది కానిస్టేబుల్’ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ఆరంభమైంది. ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై ‘బలగం’ జగదీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి బి. నిఖితా జగదీష్ కెమెరా స్విచ్చాన్ చేయగా బీజే రిథిక క్లాప్ కొట్టారు. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ – ‘‘ఈ చిత్రంలో ఎమోషనల్ కానిస్టేబుల్‌గా నటిస్తున్నాను. దర్శకుడు చెప్పిన కథ, కథనం నాకు బాగా నచ్చాయి’’ అన్నారు. ‘‘సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం’’ అన్నారు ఆర్యన్ సుభాన్, ‘బలగం’ జగదీష్. దువ్వాసి మోహన్, సూర్య, కల్పలత తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : సుభాష్ ఆనంద్, కెమెరా: హాజరత్ షేక్ (వలి).

## స్టూడెంట్ క్యారెక్టర్ నా కెరీర్‌కి ప్లస్



**“‘స్వాతిముత్యం’లో నా పాత్ర మొదటి నుంచి చివరి వరకు అమాయకంగానే ఉంటుంది. కానీ ‘నేను స్టూడెంట్ సర్’లో డిఫరెంట్ షేడ్స్ ఉన్నాయి. సంతోషం, బాధ, టెన్షన్ ఉంటాయి. చివరికి తన కష్టం నుంచి హీరో ఎలా బయటపడ్డాడు?’ అనేది ఆసక్తిగా ఉంటుంది” అని హీరో బెల్లంకొండ గణేశ్ అన్నారు. రాకేష్ ఉప్పలపాటి దర్శకత్వంలో బెల్లంకొండ గణేశ్, అవంతిక దస్సాని జంటగా నటించిన చిత్రం ‘నేను స్టూడెంట్ సర్’. ‘నాంది’ సతీష్ వర్మ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా బెల్లంకొండ గణేష్ పంచుకున్న విశేషాలు...**

**- బెల్లంకొండ గణేశ్**

● ‘నేను స్టూడెంట్ సర్’ కథని కృష్ణ చైతన్యగారు రాశారు. అయితే ఆయన వేరే సినిమాలతో బిజీగా ఉండటంతో రాకేష్‌గారు దర్శకత్వం వహించారు. న్యూ ఏజ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో నిజ జీవితంలో జరిగే పరిస్థితులు ఎక్కువగా ఉంటాయి. క్లైమాక్స్ వచ్చే వరకూ అసలు విలన్ ఎవరనేది ఊహించలేరు. చాలా మంది పెద్ద హీరోలు వారి రెండో సినిమాలో స్టూడెంట్ పాత్ర చేశారు.. వారిలా నేనూ స్టూడెంట్ పాత్ర చేశాను.. ఇది నా కెరీర్‌కి చాలా ప్లస్ అవుతుంది. ● ఈ సినిమాని నిర్మాత సతీష్‌గారు ప్యాషన్‌తో తీశారు. మహతి స్వరసాగర్ అద్భుతమైన మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చారు. మంచి సినిమా చూశామనే అనుభూతితో పాటు మంచి ఆర్‌ఆర్ విన్నామనే ఫీలింగ్‌తో ప్రేక్షకులు బయటికి వస్తారు. ● చిరంజీవిగారి ‘గాడ్‌ఫాదర్’, నాగార్జునగారి ‘ది ఘోస్ట్’ సినిమాలు విడుదలైన రోజే (2022 అక్టోబర్ 5) నా తొలి చిత్రం ‘స్వాతిముత్యం’ రిలీజ్ అయింది. అప్పుడు బ్యాడ్ రిలీజ్ డేట్ అనే మాట వినిపించింది. థియేటర్లో ఆ మూవీ ఇంకా బాగా ఆడాల్సింది. అయితే ఓటీటీలో అద్భుతమైన స్పందన వచ్చింది. ఎక్కడికి వెళ్లినా చాలా మంచి సినిమా చేశానని ప్రశంసిస్తున్నారు. ఈ విషయంలో నటుడిగా నేను సక్సెస్ అయ్యాను. మొదటి పది సినిమాలు పది డిఫరెంట్ జోనర్స్‌లో చేసి మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకోవాలి.. దర్శక-నిర్మాతల్లో నమ్మకం కలిగించాలని ఉంది. నా తర్వాతి సినిమా కొత్త డైరెక్టర్‌తో క్రైమ్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది.

## హతవిధి.. ఏంటిది...



● నవీన్ పోలిశెట్టి

‘హతవిధి.. ఏంటిది.. ఊహలో లేనిది.. బుల్లిచీమపై బుల్‌డోజరైనది..’ అంటూ నిరాశగా పాడుతున్నాడు మిస్టర్ పోలిశెట్టి. ఇంతకీ విషయం ఏంటంటే... పోలిశెట్టి తన భవిష్యత్తు తెలుసుకోవాలని ఒక చిలక దగ్గరకు వెళితే ఆ చిలక కూడా పారిపోతుంది. తన జీవితంలో ఏదైనా గొప్పగా చేయాలనుకుంటే అది జరగదు... ఆ బాధని ఇలా పాట రూపంలో వెళ్లగక్కాడు. ఆ మిస్టర్ శెట్టి ఎవరంటే.. నవీన్ పోలిశెట్టి. అనుష్కా శెట్టి, నవీన్ పోలిశెట్టి ముఖ్య తారలుగా రూపొందుతున్న ‘మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి’ చిత్రంలోని పాట ఇది. నవీన్ పోలిశెట్టిపై సాగే ఈ పాటను హీరో ధనుష్ పాడారు. రధన్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. మహేశ్ బాబు పి. దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

## పలాసకి మించి ఆపరేషన్ రావణ్

**- రక్షిత్ అట్లూరి**



● వెంకట సత్య, రాధిక, రక్షిత్ అట్లూరి

‘‘‘పలాస’ నచ్చకపోతే నా కాలర్ పట్టుకోండి’ అంటూ గతంలో చెప్పాను. ఇప్పుడు అంతకు మించిన నమ్మకంతో చెబుతున్నాను. ‘పలాస’కి మించి ‘ఆపరేషన్ రావణ్’ నెక్ట్స్ లెవెల్‌లో ఉంటుంది. మా నాన్న వెంకట సత్య వరప్రసాద్‌గారు బాగా డైరెక్ట్ చేశారు’’ అని హీరో రక్షిత్ అట్లూరి అన్నారు. వెంకట సత్య దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్ జంటగా నటించిన చిత్రం ‘ఆపరేషన్ రావణ్’. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటోంది. ఈ మూవీ ఫస్ట్ థ్రిల్‌ను దర్శకులు మారుతి, కల్యాణ్ కృష్ణ విడుదల చేశారు. దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ– ‘‘ప్రసాద్‌గారు డైరెక్షన్ చేస్తా అన్నప్పుడు నవ్వుకున్నా. కానీ ట్రైలర్ చూశాక చాలా బాగుంది’’ అన్నారు. ‘‘ఈ సినిమా బాగా రావడానికి కారణం రాధికగారు’’ అన్నారు వెంకట్ సత్య. ‘‘ఆపరేషన్ రావణ్ మంచి చిత్రం’’ అన్నారు నటి రాధిక. ఈ చిత్రానికి కెమెరా: నాని చమిడిశెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చొల్లేటి.

## జిందగీ షురూ



● రాజా రవీంద్ర, వీవీ వినాయక్

రాజా రవీంద్ర, శ్రీకాంత్ అయ్యంగార్, శివ చందు, నీల ప్రియా, ‘మిర్చి’ కిరణ్, హర్ష వర్ధన్ ప్రధాన పాత్రల్లో ‘డియర్ జిందగి’ అనే సినిమా షురూ అయింది. ఈ చిత్రం ద్వారా పద్మారావ్ అబ్బిశెట్టి (పండు) దర్శకునిగా పరిచయమవుతున్నారు. రాజా రవీంద్ర సమర్పణలో ఉమాదేవి, శరత్ చంద్ర చల్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభం అయింది. తొలి సీన్‌కి దర్శకుడు కల్యాణ్ కృష్ణ కెమెరా స్విచ్చాన్ చేసి, గౌరవ దర్శకత్వం వహించగా, డైరెక్టర్ వీవీ వినాయక్ క్లాప్ కొట్టారు. రాజా రవీంద్ర మాట్లాడుతూ– ‘ఇందులో ముగ్గురు పిల్లల తండ్రి పాత్రలో ఫుల్ లెంగ్త్ క్యారెక్టర్ చేస్తున్నాను’’ అన్నారు. ‘‘ప్రేక్షకులకు మంచి కాన్సెప్ట్ సినిమాలను అందించాలనే ఉద్దేశంతో స్నేహితులతో కలిసి ఈ బ్యానర్‌ని స్థాపించాను’’ అన్నారు శరత్ చంద్ర చల్లపల్లి. ‘‘మధ్య తరగతి వారికి మా సినిమా కచ్చితంగా నచ్చుతుంది’’ అన్నారు పద్మారావ్ అబ్బిశెట్టి (పండు).

## నీలా.. నన్నిలా..



● సాహస్, దీపిక

సాహస్, దీపిక జంటగా చైతు మాదాల దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘7:11’. నరేన్ యనమదల, మాధురి రావిపాటి, వాణి కన్నెగంటి నిర్మించారు. ఈ చిత్రంలోని ‘నీలా.. నన్నిలా...’ అంటూ సాగే తొలి పాటను విడుదల చేశారు. గ్యానీ స్వరపరచిన ఈ మెలోడీ సాంగ్‌కు మణి దీపక్ కడిమిశెట్టి సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి పాడారు. ‘‘ఇది టైమ్ ట్రావెల్ నేపథ్యంలో సాగే సైన్స్ ఫిక్షన్ క్రైమ్ డ్రామా. 1999లో ఒక ముఖ్యమైన రోజున భవిష్యత్తులో 400 సంవత్సరాలలో వేరే గ్రహం నుండి మానవుల మనుగడకు సంబంధించిన కీలకమైన సమాధానాల కోసం ‘హంసలదీవి’ అనే చిన్న ఇండియన్ టౌన్‌కి చేరుకుంటారు. అదే రోజున ఆ టౌన్‌ని నాశనం చేయడానికి కొన్ని ఘటనలు జరుగుతాయి’’ అని యూనిట్ పేర్కొంది.

| స్టాక్ మార్కెట్లు | | |
|---|---|---|
| దేశీ సూచీలు | సెన్సెక్స్ ▽ 347 | 62,622 |
| | నిఫ్టీ ▽ 99 | 18,534 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 ముగింపు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 12,927 | ▽ | 91 |
| డోజోన్స్ | 32,840 | ▽ | 202 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,446 | ▽ | 76 |
| డాక్స్ | 15,664 | ▽ | 245 |
| షాంఘై | 3,205 | ▽ | 20 |
| నికాయ్ | 30,888 | ▽ | 440 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

| బులియన్ రూ.లలో – ముంబై | |
|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 60,390 ▽ 12 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 60,148 ▽ 12 |
| వెండి (కేజీ) | 70,988 △ 127 |



## కార్వీ స్టాక్ బ్రోకింగ్ రిజిస్ట్రేషన్ రద్దు



**న్యూఢిల్లీ:** క్లయింట్ల నిధులు, సెక్యూరిటీలను దుర్వినియోగం చేసినందుకు గాను బ్రోకరేజ్ సంస్థ కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్) రిజిస్ట్రేషన్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రద్దు చేసింది. కేఎస్‌బీఎల్ క్లయింట్ల నిధులను గ్రూప్ కంపెనీల ఖాతాల్లోకి బదిలీ చేసుకుందని, అలాగే రూ. 2,700 కోట్ల విలువ చేసే క్లయింట్ల సెక్యూరిటీలను తనఖా పెట్టి దాదాపు రూ. 2,033 కోట్ల నిధులు సేకరించిందని బుధవారం జారీ చేసిన ఆదేశాల్లో సెబీ పేర్కొంది. ఆయా క్లయింట్లకు నిధులు, సెక్యూరిటీలను తిరిగి ఇవ్వకపోగా.. ఖాతాల మదింపు విషయంలో ఫోరెన్సిక్ ఆడిటర్లకు సరిగ్గా సహకరించలేదని కూడా తెలిపింది. బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలు ఇప్పటికే కేఎస్‌బీఎల్‌ను డిఫాల్టరుగా ప్రకటించి, బహిష్కరించిన నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకున్నట్లు సెబీ పేర్కొంది. క్లయింట్ల నిధులను దుర్వినియోగం చేసినందుకు గాను కార్వీ, దాని ప్రమోటర్ కొమండూర్ పార్థసారథి ఏడేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్ లావాదేవీలు జరపకుండా సెబీ గత నెలలో నిషేధం విధించింది.

# భారత్ జీడీపీ జూమ్!

మార్చి త్రైమాసికంలో 6.1 శాతం వృద్ధి • 2022-23 పూర్తి ఏడాదికి 7.2 శాతం
అంచనాలకు మించిన లెక్కలు • వ్యవసాయం, తయారీ, మైనింగ్, నిర్మాణం భేష్




**న్యూఢిల్లీ:** భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో 6.1 శాతంగా నమోదయ్యింది. దీనితో 2022-23 ఆర్థిక సంవత్సరం మొత్తంగా జీడీపీ వృద్ధి రేటు 7.2 శాతంగా నమోదయ్యింది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) ఫిబ్రవరిలో విడుదల చేసిన రెండవ అడ్వాన్స్ అంచనాలు 7 శాతం కన్నా ఇది అధికం కావడం గమనార్హం. వ్యవసాయం, తయారీ, మైనింగ్, నిర్మాణ రంగాలు చక్కటి పనితీరును ప్రదర్శించినట్లు బుధవారం విడుదలైన గణాంకాలు వెల్లడించాయి. చైనా వృద్ధి రేటు చివరి త్రైమాసికంలో 4.5 శాతంగా నమోదయ్యింది. దీనితోపాటు ప్రపంచంలోని పలు దేశాల ఆర్థిక వ్యవస్థలను పోల్చితే భారత్ ఎకానమీ వేగంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా పురోగమిస్తోంది. తాజా గణాంకాలతో గణనీయమైన పురోగతితో వార్షికంగా 3.3 ట్రిలియన్ డాలర్లకు ఎగసిన ఎకానమీ విలువ వచ్చే కొద్ది సంవత్సరాల్లో 5 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

**జీడీపీ లెక్కలు ఇలా..**

2011-12 స్థిర ధరల వద్ద (ద్రవ్యోల్బణం సర్దుబాటు చేసి) 2021-22 జనవరి-మార్చి త్రైమాసికంలో జీడీపీ విలువ రూ.41.12 లక్షల కోట్లు. తాజా సమీక్షా త్రైమాసికంలో (2022-23 జనవరి-మార్చి) ఈ విలువ రూ.43.62 లక్షల కోట్లు. వెరసి నాల్గవ త్రైమాసికంలో వృద్ధి రేటు 6.1 శాతమన్నమాట. ఇక మొత్తం ఆర్థిక సంవత్సరంలో చూస్తే... ఈ విలువలు 2021-22తో పోల్చి చూస్తే 2022-23లో రూ.149.26 లక్షల కోట్ల నుంచి రూ.160.06 లక్షల కోట్లకు పెరిగాయి. వెరసి ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.2 శాతంగా ఉంది. 2021-22లో వృద్ధి రేటు 9.1 శాతం అయినప్పటికీ, బేస్ తక్కువగా ఉండడం (2020-21లో కరోనా కష్టకాలంలో వృద్ధిరేటు భారీగా పడిపోవడం) దీనికి ప్రధాన కారణం. అయితే 2021-22 చివరి త్రైమాసికం 4 శాతంతో పోల్చితే తాజా లెక్కలు మెరుగ్గా ఉండడం గమనార్హం.

| 2022-23 వృద్ధి (%) | |
|---|---|
| క్యూ1 | 13.1 |
| క్యూ2 | 6.2 |
| క్యూ3 | 4.5 |
| క్యూ4 | 6.1 |

**జీవీఏ లెక్క ఇదీ...**

కేవలం వివిధ రంగాల ఉత్పత్తి విలువకు సంబంధించిన- గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ (జీవీఏ) వృద్ధి రేటు 2022-23లో 7%గా ఉంది. 2021-22లో రేటు 8.8 శాతం. జీవీఏ ప్రకారం మార్చి త్రైమాసికం వృద్ధి రేటు పరిశీలిస్తే...

- తయారీ రంగం పురోగతి 2021-22 మార్చి త్రైమాసికంలో 0.6% ఉంటే, 2022-23 మార్చి త్రైమాసికంలో 4.5%గా నమోదయ్యింది.
- మైనింగ్ ఉత్పత్తి వృద్ధి ఇదే కాలంలో 2.3 శాతం నుంచి 4.3 శాతానికి ఎగసింది.
- నిర్మాణ రంగం విషయంలో భారీగా 4.9 శాతం నుంచి 10.4 శాతానికి చేరింది.
- వ్యవసాయ రంగం పురోగతి 4.1 శాతం నుంచి 5.5 శాతానికి చేరింది.

### సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోంది



ప్రపంచ సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ భారత్ 7.2 శాతం వార్షిక వృద్ధిని నమోదుచేసుకోవడం హర్షణీయ పరిణామం. ఆర్థిక వ్యవస్థ సామర్థ్యాన్ని, సూచీల దృఢమైన పనితీరును, ఆశాజనక పరిస్థితిని గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయి.

– ప్రధాని నరేంద్ర మోదీ

### అంచనాలకు మించి..



తాజా ఆర్థిక పురోగతిని పరిశీలిస్తే, ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ జీడీపీ తొలి 6.5% అంచనాలను మించి వృద్ధి సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. వివిధ అంతర్జాతీయ సంస్థల అంచనాలను మించి 2022-23 ఎకానమీ గణాంకాలు నమోదుకావడం భారత్ సవాళ్లను ఎదుర్కొనగలిగిన పరిస్థితికి అద్దం పడుతోంది.

– వి. అనంత నాగేశ్వరన్, సీఈఏ

## విజయవాడలో లుపిన్ ల్యాబొరేటరీ

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** డయాగ్నోస్టిక్స్ సేవల్లో ఉన్న లుపిన్ తాజాగా విజయవాడలో కేంద్రాన్ని నెలకొల్పింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ల్యాబ్ ఏర్పాటైందని, నిపుణులైన సిబ్బంది ఇక్కడ కొలువుదీరారని కంపెనీ తెలిపింది. దేశవ్యాప్తంగా లుపిన్ డయాగ్నోస్టిక్స్‌కు 27 ల్యాబొరేటరీలు, 410 కలెక్షన్ సెంటర్స్ ఉన్నాయి.

| కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో) | |
|---|---|
| **1-6-2023** | |
| విశాఖ | 510-00 |
| చిత్తూరు | 553-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 510-00 |
| విజయవాడ | 510-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **31-5-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 480-00 |
| వరంగల్ | 482-00 |
| రిటైల్ ధర | 5.40 |

## లాభాల స్వీకరణ.. ర్యాలీకి బ్రేక్

- సెన్సెక్స్ 347 పాయింట్లు పతనం
- నిఫ్టీ 99 పాయింట్ల క్షీణత
- ప్రపంచ మార్కెట్ల ప్రభావం




**ముంబై:** నాలుగు రోజులు ర్యాలీ బాటలో సాగిన దేశీ స్టాక్ మార్కెట్లు ఉన్నట్టుండి కుదుపునకు లోనయ్యాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకే ప్రాధాన్యత ఇవ్వడంతో నష్టాలతో నిలిచాయి. సెన్సెక్స్ 347 పాయింట్లు క్షీణించి 62,622 వద్ద ముగిసింది. నిఫ్టీ 99 పాయింట్లు తక్కువగా 18,534 వద్ద స్థిరపడింది. మార్కెట్లు గత 4 రోజుల్లో 1,200 పాయింట్లు పుంజుకోవడంతో ట్రేడర్లు లాభాల స్వీకరణ చేపట్టినట్లు నిపుణులు పేర్కొన్నారు. దీనికితోడు చైనా ఆర్థిక మందగమనం, యూఎస్ రుణ పరిమితి పెంపు వంటి అంశాలు ఇన్వెస్టర్లలో ఆందోళనకు కారణమైనట్లు తెలియజేశారు. ఫలితంగా విదేశీ మార్కెట్లు సైతం డీలా పడినట్లు ప్రస్తావించారు. దీంతో కొంత మేర సెంటిమెంటు బలహీనపడిందని వివరించారు. ఈ నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లు రోజంతా నేలచూపులతోనే కదిలాయి.

**హెల్త్‌కేర్ ప్లస్:** ఎన్‌ఎస్‌ఈలో ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్, బ్యాంకింగ్ 1.3-0.7% మధ్య నీరసించగా.. కన్జూమర్ డ్యురబుల్స్, ఫార్మా, రియల్టీ 0.7% చొప్పున పుంజుకున్నాయి. ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, యాక్సిస్, ఆర్‌ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, పవర్‌గ్రిడ్, గ్రాసిమ్, హిందాల్కో, కోల్ ఇండియా, సిప్లా, టాటా స్టీల్, బజాజ్ ఫిన్, అల్ట్రాటెక్, ఎంఅండ్‌ఎం, టీసీఎస్, ఐటీసీ 3-1% మధ్య క్షీణించాయి. అయితే టెక్‌ఎం, ఎయిర్‌టెల్, కొటక్ బ్యాంక్, ఎస్‌బీఐ లైఫ్, సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టాటా మోటార్స్, బీపీసీఎల్, బ్రిటానియా, నెస్లే 2-1% మధ్య బలపడ్డాయి. కాగా, డాలరుతో మారకంలో రూపాయి 8 పైసలు తగ్గి 82.75 వద్ద ముగిసింది.

## సీఐటీఐఐఎస్ 2.0కు కేంద్రం ఆమోదముద్ర

**న్యూఢిల్లీ:** సమగ్ర పట్టణాల నిర్వహణను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన సిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ టు ఇన్నోవేట్, ఇంటిగ్రేట్ అండ్ సస్టెయిన్ (సీఐటీఐఐఎస్) 2.0కు కేంద్రం ఆమోదముద్ర వేసింది. ఫ్రెంచ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏఎఫ్‌డీ)తో పాటు కేఎఫ్‌డబ్ల్యూ, యూరోపియన్ యూనియన్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎన్‌ఐయూఏ) భాగస్వామ్యంలో ఇది ఈ ఆర్థిక సంవత్సరంతో ప్రారంభమై నాలుగేళ్ల పాటు అమల్లో ఉంటుంది. నగరాల స్థాయిలో వ్యర్థాల నిర్వహణ, రాష్ట్రాల స్థాయిలో వాతావరణ మార్పులపరమైన సంస్కరణలు, జాతీయ స్థాయిలో సంస్థలను తత్సంబంధ సంస్థలను పటిష్టం చేసే ప్రాజెక్టులకు ఈ ప్రోగ్రాం ద్వారా మద్దతు కల్పించనున్నట్లు ఆయన వివరించారు. సీఐటీఐఐఎస్ 2.0కు 200 మిలియన్ యూరోల మేర (సుమారు రూ. 1,760 కోట్లు) రుణ రూపంలో సమకూర్చనున్నట్లు ఠాకూర్ వివరించారు. 2018లో రూ. 933 కోట్లతో సీఐటీఐఐఎస్ 1.0ను అమలు చేశారు.



## దశాబ్దంలోనే భారత్‌లో ఎంతో మార్పు

- అంతర్జాతీయంగా స్థానం బలోపేతం
- మోర్గాన్ స్టాన్లీ సానుకూల నివేదిక





**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం కింద భారత్ పదేళ్లలోనే ఎంతో మార్పు చెందినట్టు అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది. అంతర్జాతీయంగా భారత్ తన స్థానాన్ని బలోపేతం చేసుకుందని, ఆసియా, ప్రపంచ వృద్ధిని నడిపించే కీలక దేశంగా అవతరించినట్టు తన తాజా నివేదికలో ప్రస్తావించింది. భారత్ తన సామర్థ్యాల మేరకు ఫలితాలను చూపించలేదని, ఈక్విటీ వ్యాల్యూషన్లు గరిష్టాల్లో ఉన్నాయన్న విమర్శలను తోసిపుచ్చింది. ఈ తరహా దృక్పథం గత తొమ్మిదేళ్లలో చేపట్టిన వ్యవస్థీకృత సంస్కరణలను విస్మరించడమేనని పేర్కొంది. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రెండో ఆర్థిక వ్యవస్థకు తోడు, గత 25 ఏళ్లలో గొప్ప పనితీరు చూపిన స్టాక్ మార్కెట్‌ను నిదర్శనాలుగా ప్రస్తావించింది. 2013తో పోలిస్తే ఇప్పుడున్న భారత్ భిన్నమైనదిగా పేర్కొంది.

**ఇవీ మార్పులు..:** 2014లో ప్రధానిగా మోదీ కొలువుదీరిన తర్వాత చోటు చేసుకున్న పది పెద్ద మార్పులను మోర్గాన్ స్టాన్లీ ప్రస్తావించింది. పోటీ దేశాల స్థాయిలో కార్పొరేటు పన్నును తగ్గింపు, మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెంచడం అతిపెద్ద సంస్కరణలుగా పేర్కొంది. జీఎస్‌టీ కింద పన్నుల ఆదాయం క్రమంగా పెరుగుతుండడాన్ని ప్రస్తావించింది. అలాగే, జీడీపీలో డిజిటల్ లావాదేవీలు పెరుగుతుండం ఆర్థిక వ్యవస్థ మరింత క్రమబద్ధీకరణ చెందుతుందనడానికి నిదర్శంగా పేర్కొంది. ఎగుమతుల్లో భారత్ వాటా రెట్టింపై 2031 నాటికి 4.5%కి చేరుకుంటుందని అంచనా వేసింది.

**తలసరి ఆదాయంలో వృద్ధి**

ప్రస్తుతం భారత్‌లో తలసరి ఆదాయం 2,200 డాలర్లుగా (రూ.1,80,400) ఉంటే, 2032 నాటికి 5,200 డాలర్లకు (రూ.4,26,400) పెరుగుతుందని మోర్గాన్ స్టాన్లీ తన నివేదికలో పేర్కొంది. ఇది భారత్‌లో వినియోగ పరంగా పెద్ద మార్పునకు కారణమవుతుందని అంచనా వేసింది.



# విద్య, ఉద్యోగ సమాచారం

### ఇండియన్ నేవీలో 1365 అగ్నివీర్(ఎస్ఎస్ఆర్) పోస్టులు

భారత నౌకాదళంలో అగ్నివీర్(ఎస్ఎస్ఆర్) ఖాళీల భర్తీకి ప్రకటన వెలువడింది. అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో శిక్షణ ఉంటుంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1365(పురుషులు-1120, మహిళలు-273).
- » **అర్హత:** మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా కెమిస్ట్రీ/బయాలజీ/కంప్యూటర్ సైన్స్‌లో ఏదో ఒక సబ్జెక్టుగా ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** అభ్యర్థి 01.11.2002 నుంచి 31.04.2005 మధ్యలో జన్మించి ఉండాలి. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేయాలి.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ పరీక్ష(సీబీఈ), రాతపరీక్ష, శారీరక దారుఢ్యపరీక్ష(పీఎఫ్‌టీ), వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **శిక్షణ:** అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో వచ్చే ఏడాది నవంబర్ 2023లో కోర్సు శిక్షణ ప్రారంభమవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత ఆయా విభాగాల్లో విధులు కేటాయిస్తారు.
- » **వేతనం:** ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.33,000, మూడో ఏడాది రూ.35,550, నాలుగో ఏడాది రూ.40,000 ఉంటుంది.
- » **దరఖాస్తు విధానం:** అభ్యర్థులు నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023.
- » **శిక్షణ ప్రారంభం:** 2023 నవంబర్ నెలలో
- » **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

### సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్‌లో 608 అప్రెంటిస్‌లు

జార్ఖండ్ రాష్ట్రం, రాంచీలోని సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(సీసీఎల్).. ట్రేడ్, ఫ్రెషర్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 608
- » **ఖాళీల వివరాలు:** ట్రేడ్ అప్రెంటిస్‌-536, ఫ్రెషర్ అప్రెంటిస్-72.
- » **ట్రేడులు:** ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, మెషినిస్ట్, టర్నర్, వైర్‌మ్యాన్, సర్వేయర్, వెల్డర్ తదితరాలు.
- » **అర్హత:** ట్రేడును అనుసరించి మెట్రిక్యులేషన్, ఐటీఐ, సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 19.04.2023 నాటికి ట్రేడ్ అప్రెంటిస్‌కు 18 నుంచి 27 ఏళ్లు, ఫ్రెషర్ అప్రెంటిస్‌కు 18 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **స్టైపెండ్:** ట్రేడును అనుసరించి స్టయిపెండ్ నెలకు రూ.6000 నుంచి రూ.9000 వరకు ఉంటుంది.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.06.2023.
- » **వెబ్‌సైట్:** www.centralcoalfields.in

### ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 28 పోస్టులు

ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 28
- » **పోస్టుల వివరాలు:** డిప్యూటీ లైబ్రేరియన్, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, కౌన్సిలర్, లా ఆఫీసర్, సీనియర్ కౌన్సిలర్ తదితరాలు.
- » **అర్హత:** పోస్టును అనుసరించి బ్యాచిలర్స్ డిగ్రీ/బీఈ /బీటెక్/ఎంఈ /ఎంటెక్/మాస్టర్స్ డిగ్రీ/ఎంఎస్సీ/ఎంబీఏ/ఎంఏ/ఎంఫిల్/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 35 నుంచి 50 ఏళ్లు ఉండాలి.
- » **ఎంపిక విధానం:** స్క్రీనింగ్/రాతపరీక్ష/గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.06.2023.
- » **వెబ్‌సైట్:** www.iitkgp.ac.in

### ఈఎస్ఐసీ, హైదరాబాద్‌లో 76 పోస్టులు

హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో ఉన్న ఎంప్లాయిస్ స్టేట్‌ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఈఎస్ఐసీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 76
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, సూపర్ స్పెషలిస్ట్‌లు.
- » **విభాగాలు:** ఐసీయూ, జనరల్ మెడిసిన్, హెమటాలజీ, ఈఎన్‌టీ,ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ, ఆంకాలజీ, డెర్మటాలజీ, ఫిజికల్ మెడిసిన్, టీబీ/చెస్ట్, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, అనాటమీ, రేడియాలజీ తదితరాలు.

**అర్హత**

- » **ఫ్యాకల్టీ/సీనియర్ రెసిడెంట్‌లు:** ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం అర్హత ప్రమాణాలు కలిగి ఉండాలి.
- » **సూపర్ స్పెషలిస్ట్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 45 నుంచి 67 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** పోస్టును అనుసరించి నెలకు రూ.67,700 నుంచి రూ.2,00,000 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **ఇంటర్వ్యూ వేదిక:** అకడమిక్ బ్లాక్, ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్, సనత్‌నగర్, హైదరాబాద్.
- » **ఇంటర్వ్యూ తేది:** 06.06.2023 నుంచి 10.06.2023.
- » **వెబ్‌సైట్:** www.esic.gov.in

# ఉపాధ్యాయ విద్యకు మేటి.. ఆర్ఐఈ

**ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనుకునే వారు బీఈడీ, ఎంఈడీ వంటి కోర్సులను ఎంచుకుంటారు. వీటిని పూర్తి చేస్తే టీచింగ్ రంగంలో చక్కటి ఉపాధి అవకాశాలు సొంతమవుతాయి. ఇలాంటి టీచింగ్ కోర్సులను ప్రముఖ విద్యాసంస్థ రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్ఐఈ) అందిస్తోంది. ఇటీవల ఆర్ఐఈ క్యాంపస్‌ల్లో ప్రవేశాలకు ఎన్‌సీఈఆర్‌టీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఆర్ఐఈ-సీఈఈ-2023 వివరాలు, కోర్సులు, క్యాంపస్‌లు, సీట్లు, పరీక్ష విధానం తదితర వివరాలు..**

- » ఆర్ఐఈ సీఈఈ 2023 నోటిఫికేషన్ విడుదల
- » ఆర్ఐఈ క్యాంపస్‌ల్లో టీచింగ్ కోర్సుల్లో ప్రవేశానికి సీఈఈ
- » ఇంటిగ్రేటెడ్ బీఈడీ, బీఈడీ, ఎంఈడీ, ఇంటిగ్రేటెడ్ ఎంఈడీ
- » తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఆర్ఐఈ-మైసూర్‌కు కేటాయింపు




రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్..సంక్షిప్తంగా ఆర్ఐఈలుగా సుపరిచితం. ఉపాధ్యాయ విద్యకు సంబంధించి ఇంటర్మీడియెట్ అర్హతతోనే అందుబాటులో ఉండే ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సులు మొదలు ఎంఈడీ వరకు పలు కోర్సులను ఆర్ఐఈ క్యాంపస్‌లు అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి ప్రతి ఏటా కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(సీఈఈ)ను నిర్వహిస్తారు. ఇందులో సాధించిన స్కోర్, అకడమిక్ అర్హతల మార్కులకు వెయిటేజీ కల్పించి ప్రవేశాలు ఖరారు చేస్తారు.

**అయిదు క్యాంపస్‌లు**

దేశ వ్యాప్తంగా అయిదు ఆర్ఐఈ క్యాంపస్‌లు( అజ్మీర్, భోపాల్, భువనేశ్వర్, మైసూర్, షిల్లాంగ్) ఉన్నాయి. వీటిలో ఇంటిగ్రేటెడ్ బీఈడీ, బీఏ-బీఈడీ, బీఎస్సీ-బీఈడీ, ఎంఈడీ, ఇంటిగ్రేటెడ్ బీఈడీ-ఎంఈడీ, ఎంఈడీ అందుబాటులో ఉన్నాయి.

**బీఈడీ**

అజ్మీర్, భోపాల్, భువనేశ్వర్, ఆర్ఐఈ మైసూర్, ఎన్ఈఆర్ఐఈ-షిల్లాంగ్ క్యాంపస్‌ల్లో ఒక్కో క్యాంపస్‌లో 110 సీట్లు చొప్పున ఉన్నాయి. వీటిలో ప్రతి క్యాంపస్‌లో సగం సీట్లను సైన్స్, మ్యాథ్స్ గ్రూప్(బీఎస్సీ-బీఈడీ), మిగతా సగం సీట్లను సోషల్ సైన్స్ అండ్ లాంగ్వేజ్ గ్రూప్(బీఏ-బీఈడీ) విద్యార్థులకు కేటాయించారు.

**నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ**

- ఆర్ఐఈలలో ప్రత్యేకంగా గుర్తింపు పొందిన కోర్సు.. నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ. ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఈ కోర్సులో ప్రవేశం పొందొచ్చు.
- ఆర్ఐఈ-భువనేశ్వర్, మైసూర్ క్యాంపస్‌లలో 55 సీట్లు చొప్పున బీఏ-బీఈడీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- బీఎస్సీ-బీఈడీకి సంబంధించి భువనేశ్వర్, మైసూర్ క్యాంపస్‌లలో ఫిజికల్ సైన్స్ గ్రూప్‌లో 55 సీట్లు చొప్పున, బయలాజికల్ సైన్స్ గ్రూప్‌లో 55 సీట్లు చొప్పున ఉన్నాయి.

**మైసూర్‌లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ-ఈడీ**

ఆర్ఐఈ-మైసూర్ ఆరేళ్ల వ్యవధిలోని ఎమ్మెస్సీ-ఈడీ(ఎమ్మెస్సీ-ఎడ్) కోర్సును అందిస్తోంది. ఇంటర్మీడియెట్ అర్హతతో ఈ కోర్సులో ప్రవేశం లభిస్తుంది. ఫిజిక్స్ విభాగంలో 22, కెమిస్ట్రీ విభాగంలో 22, మ్యాథమెటిక్స్ విభాగంలో 22 సీట్లు చొప్పున ఉన్నాయి.

**పీజీ స్థాయిలో.. ఎంఈడీ**

పీజీ స్థాయిలో ఎలిమెంటరీ ఎడ్యుకేషన్/సెకండరీ ఎడ్యుకేషన్/సీనియర్ సెకండరీ ఎడ్యుకేషన్ స్పెషలైజేషన్లలో..ఎంఈడీ కోర్సును ఆర్ఐఈ క్యాంపస్‌లు అందిస్తున్నాయి. అజ్మీర్‌లో 55, భువనేశ్వర్‌లో 36, భోపాల్‌లో 55, మైసూర్‌లో 55 సీట్లు ఉన్నాయి.

**ఇంటిగ్రేటెడ్ బీఈడీ+ఎంఈడీ**

ఇంటిగ్రేటెడ్ బీఈడీ+ఎంఈడీ కోర్సును ఆర్ఐఈ భోపాల్ క్యాంపస్‌లో అందిస్తున్నారు. ఈ కోర్సు వ్యవధి మూడేళ్లు. సైన్స్/సోషల్ సైన్స్/హ్యూమానిటీస్ స్పెషలైజేషన్లలో పీజీ ఉత్తీర్ణత ఉండాలి. మొత్తం 55 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

**తెలుగు రాష్ట్రాలకు ఆర్ఐఈ మైసూర్**

తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఆర్ఐఈ-మైసూర్‌లోని కోర్సులకు పోటీ పడాల్సి ఉంటుంది.ఆర్ఐఈ-మైసూర్‌లోని సీట్లలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు కోర్సుల వారీగా కేటాయించిన సీట్ల వివరాలు..

- బీఎస్సీ-బీఎడ్, బీఏ-బీఎడ్‌ల్లో.. ఒక్కో కోర్సులో ఏపీ విద్యార్థులకు 9 సీట్లు, తెలంగాణ విద్యార్థులకు 6 సీట్లు చొప్పున కేటాయించారు.
- బీఈడీ కోర్సులకు సంబంధించి ఏపీ విద్యార్థులకు సైన్స్ గ్రూప్‌లో 5, ఆర్ట్స్ గ్రూప్‌లో 4, తెలంగాణ విద్యార్థులకు సైన్స్ గ్రూప్‌లో 3, ఆర్ట్స్ గ్రూప్‌లో 3 సీట్లు చొప్పున కేటాయించారు.
- ఎంఈడీ కోర్సుల్లో ఏపీ విద్యార్థులకు 9, తెలంగాణ విద్యార్థులకు ఆరు సీట్లు ఉన్నాయి.
- ఎమ్మెస్సీ-ఈడీ, ఇంటిగ్రేటెడ్ బీఈడీ+ఎంఈడీ కోర్సులకు అన్ని అన్ని రాష్ట్రాల విద్యార్థులకు అర్హత ఉంటుంది.

**అర్హతలు**

- ఇంటిగ్రేటెడ్ బీఏ బీఈడీ: 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఈడీ: ఫిజికల్ సైన్స్ గ్రూప్ అభ్యర్థులు ఎంపీసీ గ్రూప్‌లో 50 శాతం మార్కులు; బయలాజికల్ సైన్స్ గ్రూప్ విద్యార్థులు బైపీసీలో 50 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎంఈడీ:** బీఈడీ లేదా ఇంటిగ్రేటెడ్ బీఈడీ లేదా బీఈఎల్ఈడీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- **ఎమ్మెస్సీ-ఎంఈడీ:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూప్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఇంటిగ్రేటెడ్ బీఈడీ+ఎంఈడీ:** 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులవ్వాలి.

**సీఈఈ స్కోర్‌తో ప్రవేశం**

కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(సీఈఈ)లో స్కోర్ ఆధారంగా ఆర్ఐఈ క్యాంపస్‌ల్లోని కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. సీఈఈ పరీక్ష మూడు విభాగాల్లో(ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ, టీచింగ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ) నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ విభాగంలో 20 ప్రశ్నలు, మిగతా రెండు విభాగాల నుంచి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 80 ప్రశ్నలతో పరీక్ష ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం 160 మార్కులకు సీఈఈ జరుగుతుంది. పరీక్ష సమయం రెండు గంటలు.

**సీఈఈ స్కోర్, అకడమిక్ మార్కులు**

సీట్ల కేటాయింపు తుది జాబితా రూపకల్పనలో సీఈఈలో పొందిన స్కోర్‌తోపాటు అకడమిక్ మార్కులకు వెయిటేజీ కల్పించే విధానాన్ని అనుసరిస్తారు. సీఈఈ స్కోర్‌కు 60 శాతం, అకడమిక్ మార్కులకు 40 శాతం వెయిటేజీని గణిస్తారు.

**కోర్సుకు అనుగుణంగా సీఈఈ క్లిష్టత**

అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న కోర్సుకు అనుగుణంగా సీఈఈ పరీక్ష సిలబస్, ప్రశ్నల సరళి ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ బీఈడీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఈడీ కోర్సుల అభ్యర్థులు ఇంటర్మీడియెట్ స్థాయిలోని అకడమిక్స్‌పై పట్టు సాధించాలి.

బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు బ్యాచిలర్ స్థాయిలో తాము చదివిన గ్రూప్‌లకు సంబంధించిన సబ్జెక్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. టీచింగ్ ఆప్టిట్యూడ్, ఆటిట్యూడ్‌లకు సంబంధించి బోధన పద్ధతులు, పెడగాజి వంటి వాటిపై దృష్టిపెట్టాలి.

**ఉద్యోగాలు**

ఆర్ఐఈల్లో బీఈడీ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు విస్తృతమని చెప్పొచ్చు. ఈ క్యాంపస్‌ల్లో పలు ఇన్‌స్టిట్యూట్‌లు ప్లేస్‌మెంట్ డ్రైవ్స్‌ను సైతం నిర్వహిస్తున్నాయి. వీటి ద్వారా సగటున రూ.30 వేల వేతనం లభిస్తోంది.

**అజ్మీర్, భోపాల్ ఇంటిగ్రేటెడ్ బీఈడీకి ఎన్‌సీఈటీ**

అజ్మీర్, భోపాల్ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ బీఈడీలో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎన్‌సీఈటీ) స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకోనున్నారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఇంటిగ్రేటెడ్ టీచింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ పేరుతో ఎన్‌సీఈటీ నాలుగేళ్ల బీఈడీ కోర్సుల కోసం ప్రత్యేక స్కీమ్‌ను ప్రవేశ పెట్టింది. దేశ వ్యాప్తంగా ఉన్న 57 టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఆర్ఐటీ- భోపాల్, అజ్మీర్ క్యాంపస్‌లను కూడా సదరు ఇన్‌స్టిట్యూట్‌ల జాబితాలో చేర్చారు.

### సీఈఈ-2023 సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జూన్ 6, 2023
- **సీఈఈ పరీక్ష తేదీ:** జూలై 2, 2023
- **తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cee.ncert.gov.in

## క్లుప్తంగా...

### ఉపకార దరఖాస్తులకు మరో అవకాశం



- తెరుచుకున్న వెబ్ ఆప్షన్
- నేటినుంచి 15 వరకు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకార దరఖాస్తులకు రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. 2022–23 విద్యా సంవత్సరంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించిన విద్యార్థులకు మరో అవకాశం ఇచ్చింది. దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీలోపు ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని స్పష్టం చేసింది. ఈమేరకు ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి మార్చి నెలాఖరుతో దరఖాస్తుకు అవకాశాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. కానీ కొందరు విద్యార్థులు సరైన ధ్రువపత్రాలు లేనందున దరఖాస్తు చేసుకోలేకపోయారు. మరికొందరు ఆలస్యంగా కోర్సుల్లో చేరారు. కొన్ని రకాల కోర్సులకు కౌన్సెలింగ్ ప్రక్రియ సైతంచాలా ఆలస్యమైంది. దీనిపై ఆయా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వానికి వినతులు సమర్పించారు.

### తెలుగు వర్సిటీ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు

నాంపల్లి (హైదరాబాద్): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏటా నిర్వహించే వివిధ కోర్సుల ప్రవేశ ప్రకటనను బుధవారం విడుదల చేశారు. 2023-24వ విద్యా సంవత్సరానికి విశ్వవిద్యాలయం నిర్వహించే రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నారు. శిల్పం,చిత్రలేఖనం, డిజైన్స్, లైబ్రరీ సైన్స్, సంగీతం, రంగస్థలం, నృత్యం, జానపదం, తెలుగు చరిత్ర, పర్యాటకం, భాషా శాస్త్రం, జర్నలిజం, జ్యోతిషం, యోగా తదితర అంశాలలో తెలుగు విశ్వవిద్యాలయం పీజీ, యూజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తోంది. ఆయా కోర్సులలో ప్రవేశం పొందగోరే విద్యార్థుల నుండి విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను కోరుతున్నారు.దరఖాస్తులను జూన్ 16లోగా, ఆలస్య రుసుముతో జూన్ 30 లోగా విశ్వవిద్యాలయానికి సమర్పించాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఒక ప్రకటనలో సూచించారు.

**2023-24 పీహెచ్‌డీ ప్రవేశాలు**

భాషా శాస్త్రం, సంగీతం, నృత్యం, రంగస్థలం, జానపదం, జర్నలిజం, చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాస్త్రం, జానపద గిరిజన విజ్ఞానం తదితర అంశాలలో తెలుగు విశ్వవిద్యాలయం 2023-24వ విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను చూడాలని రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో సూచించారు.

### ట్యూషన్ ఫీజు బకాయిలు చెల్లించండి

కళాశాల యాజమాన్య సంఘాల జేఏసీ మొర



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల ట్యూషన్ ఫీజును ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని కేజీ టు పీజీ జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు కళాశాలల సంఘం అధ్యక్షుడు గౌరీ సతీశ్ నేతృత్వంలో హైదరాబాద్‌లో బుధవారం జేఏసీ నేతలు విలేకరులతో మాట్లాడారు. 2021-22, 2022-23 సంవత్సరాలకు కలిపి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు దాదాపు రూ.4200 కోట్ల బకాయిలు చెల్లించాలని వివరించారు. ప్రభుత్వం ఈ మొత్తం ఇవ్వకపోవడం వల్ల ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు అధ్యాపకులకు వేతనాలు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జూన్ 2 లోగా తమ బకాయిలు చెల్లించని పక్షంలో జూన్ మొదటి వారం నుంచి 33 జిల్లాల్లో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కలెక్టర్లకు వినతి పత్రాలు, రోడ్డుపై భిక్షాటన చేస్తామన్నారు.

### ఈఎంఆర్ఎస్ కామన్ ఎంట్రెన్స్ ఫలితాలు విడుదల

మహబూబాబాద్: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో (ఈఎంఆర్ఎస్) 2023–24 విద్యాసంవత్సరం ఆరో తరగతి ప్రవేశానికి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కామన్ ఎంట్రెన్స్ ఫలితాలను రాష్ట్ర గిరిజన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ బుధవారం విడుదల చేశారు. మానుకోట జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రవేశ పరీక్షకు 8,383 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 7,252 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. మానుకోట జిల్లా నుంచి సుమారు 200 మంది సీట్లు సాధించారని, ఇందులో కిరణ్ 90 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఉమేష్ సెకండ్ ర్యాంక్ సాధించినట్లు వివరించారు. మొదటి విడతలో భాగంగా 1,347 మంది విద్యార్థులకు మోటా అడ్మిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం 23 ఏకలవ్య పాఠశాలల్లో సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

# సైబర్ దంగల్ 2.0



- కొత్త పుంతలు తొక్కుతున్న సైబర్ నేరం
- రాజకీయ, మతపరమైన విభేదాలతో హ్యాక్టివిజమ్
- ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేపథ్యంలో రంగంలోకి 190 హ్యాక్టివిస్ట్ గ్రూపులు
- భారత్ లక్ష్యంగా దాడులకు సిద్ధమైన 160 గ్రూపులు
- నుపుర్ వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో రెచ్చిపోయిన వైనం

సాక్షి, హైదరాబాద్

ఆర్థిక లాభం, వ్యక్తిగత కక్ష, ఈర్ష్య.. సైబర్ నేరాలకు, దాడులకు ప్రధానంగా ఇవే కారణాలుగా ఉంటాయి. అయితే ప్రస్తుతం సైబర్ దంగల్ 2.0 తెరపైకి వచ్చింది. రాజకీయ, మతపరమైన విభేదాలతో పాటు తమ ఉనికిని చాటు కోవాలనే ఉద్దేశంతో కూడా సైబర్ నేరగాళ్లు దాడులకు తెగబడుతున్నారు. దీన్ని నిపుణులు సైబర్ హ్యాక్టివిజంగా పేర్కొంటున్నారు. అనానిమస్ సూడాన్, హ్యాక్టివిస్ట్ రష్యా, డ్రాగన్ ఫోర్స్ మలేసియా.. ఇలా అనేక గ్రూపులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి సవాల్ విసురుతున్నాయి. వీటి టార్గెట్‌లో భారత్ సహా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు ఉండటం ఆందోళన కలిగించే అంశం.

**అటో ఎనబై...ఇటో ఎనబై...**

ఉక్రెయిన్-రష్యా మధ్య ప్రారంభమైన యుద్ధం నేపథ్యంలో అనేక సైబర్ నేరగాళ్ల గ్రూపులు క్రియాశీలంగా మారాయి. సైబర్ నో అనే అంతర్జాతీయ సంస్థ అధ్యయనం ప్రకారం దాదాపు 190 గ్రూపులు ప్రపంచ దేశాలకు హెచ్చరికలు జారీ చేశాయి. వీటిలో 160 భారత్ పైనే గురి పెట్టాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో 80 రష్యాకు మద్దతుగా మిగిలిన సగం ఉక్రెయిన్‌కు మద్దతుగా వ్యవహరిస్తున్నాయి. భారత్ ఏ దేశానికి బహిరంగ మద్దతు ప్రకటిస్తే దాని వ్యతిరేక గ్రూపులు సైబర్ దాడులకు సిద్ధమయ్యాయని సైబర్ నో స్పష్టం చేసింది. అయితే భారత్ ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోకపోవడంతో అవి మిన్నకుండిపోయాయని తెలిపింది. అనేక మంది హ్యాక్టివిస్టులు తమ సొంత నమ్మకాలను వ్యతిరేకించే వ్యక్తులను లేదా సంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారని, తెరపైకి రాకుండా, పెద్ద స్థాయిలో నష్టాలు కలిగించకుండా రెచ్చిపోతున్న హ్యాక్టివిస్టులు అనేక మంది ఉంటున్నారని నిపుణులు చెబుతున్నారు.

**నుపుర్ వ్యాఖ్యలతో దండయాత్ర..**

బీజేపీ ఎంపీ నుపుర్ శర్మ గతడాది చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో హ్యాక్టివిస్టులు ఒక్కసారిగా దేశంపై దండెత్తారు. కేంద్ర ప్రభుత్వ సైట్‌లను లక్ష్యంగా చేసుకుని రెచ్చిపోయారు. వీరికి చెక్ చెప్పడానికి దర్యాప్తు సంస్థలు ఇంటర్‌పోల్ సాయం కోరాల్సి వచ్చిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో భారత్‌కు వ్యతిరేకంగా 'డ్రాగన్ ఫోర్స్ మలేసియా', 'హ్యాక్టివిస్ట్ ఇండోనేసియా' అనే రెండు హ్యాకర్ గ్రూపులు రంగంలోకి దిగాయి. నుపుర్ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా జరిగే ఈ దాడిలో పాల్గొనాలని ఆ గ్రూపుల నిర్వాహకులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఓ వర్గం హ్యాకర్లకు విజ్ఞప్తి చేశారు. దాదాపు 2 వేల వెబ్‌సైట్లపై ఈ రెండు గ్రూపులూ పంజా విసిరాయి. ప్రపంచంలో ఉన్న ఇతర హ్యాకర్లు, గ్రూపులు సైతం దాడులకు దిగేలా ప్రేరేపిస్తూ అందుకు అవసరమైన డార్క్‌వెబ్ యూజర్ నేమ్, పాస్‌వర్డ్స్‌ను తమ సోషల్ మీడియాల్లో షేర్ చేశాయి.

**ముందే ప్రకటించి మరీ..**

ఈ హ్యాక్టివిస్ట్ గ్యాంగ్‌లు తాము ఏ దేశాన్ని, ఏ కారణంగా టార్గెట్ చేస్తున్నామో ముందే ప్రకటిస్తుండటం గమనార్హం. దీనికోసం ట్విట్టర్‌లో ఖాతాలు, టెలిగ్రామ్‌లో గ్రూపులు ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ ఎటాకర్స్ ఎలాంటి డిమాండ్లు చేయకుండా కేవలం తమ ఉనికి చాటుకోవడం, సైబర్ ప్రపంచాన్ని సవాల్ చేయడం, భావజాలాన్ని వ్యాప్తి చేయడం కోసమే వరుసపెట్టి ఎటాక్స్ చేస్తుంటారు. వీళ్లు ప్రధానంగా డీ డాస్‌గా పిలిచే డిస్ట్రిబ్యూటెడ్ డినైల్ ఆఫ్ సర్వీసెస్ విధానంలో దాడి చేస్తున్నారు. ప్రత్యేక ప్రోగ్రామింగ్ ద్వారా ఒకేసారి కొన్ని లక్షల హిట్స్ ఆయా వెబ్‌సైట్స్‌కు వచ్చేలా చేస్తారు. ఆ ఒత్తిడి తట్టుకోలేక సర్వర్ కుప్పకూలిపోతుంది. డినైల్ ఆఫ్ సర్వీస్ (డీఓఎస్) తరహా ఎటాక్స్ సైతం దాదాపు ఇవే తరహా నష్టాన్ని కల్పిస్తాయి. విమానాశ్రయాలు, ఓడ రేవులతో పాటు ఆస్పత్రులకు సంబంధించిన సర్వర్లు వారి టార్గెట్‌గా మారుతున్నాయి.

**భవిష్యత్తులో మరింతగా..**

ఈ తరహా సైబర్ దాడులు భవిష్యత్తులో మరింత పెరిగే ప్రమాదం ఉంది. ఈ హ్యాకర్లు తన ఆర్థిక అవసరాల కోసం మరోచోట ఎటాక్ చేస్తారు. అక్కడ ఆర్జించిన అక్రమ సొమ్మును వినియోగించి డార్క్ నెట్ నుంచి కొత్త కొత్త సాఫ్ట్‌వేర్స్ సృష్టిస్తారు. వీటినే మాల్ వేర్స్‌గా మారుస్తూ సైబర్ దాడులకు దిగుతారు. వీటిని ఎదుర్కోవాలంటే ప్రతి వ్యవస్థ, సంస్థ సైబర్ సెక్యూరిటీకి ఇచ్చే ప్రాధాన్యం, బడ్జెట్ తదితరాలు పెరగాలి. పటిష్టమైన ఫైర్ వాల్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి.



మావులూరి విజయ్‌కుమార్, సైబర్ నిపుణుడు

## 'లీకేజీ' వ్యవహారంలో 50 మంది డిబార్

### వెబ్‌నోట్ ద్వారా పేర్లు వెల్లడించిన టీఎస్‌పీఎస్సీ



సాక్షి, హైదరాబాద్: ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన పలువురిని సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం) అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇలా అరెస్టయి కస్టడీలో ఉన్న అభ్యర్థులను టీఎస్‌పీఎస్సీ పరీక్షల నుంచి డిబార్ చేసింది. ఆయా అభ్యర్థులను ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో అనర్హులుగా ప్రకటించగా... భవిష్యత్తులోనూ వారిని పరీక్షలకు అనుమతించబోమని తేల్చింది. ఇలా 50మందిని పరీక్షల నుంచి డిబార్ చేస్తూ టీఎస్‌పీఎస్సీ ఉత్తర్వులు జారీ చేసింది. డిబార్ చేసిన అభ్యర్థులు వివరణ సమర్పించాలని భావిస్తే రెండ్రోజుల్లోగా కమిషన్‌కు సమర్పించాల్సి ఉంటుందని వెబ్‌నోట్ ద్వారా వెల్లడించింది.

**డిబార్ అయిన అభ్యర్థులు వీరే..**

పులిదిండి ప్రవీణ్‌కుమార్, అట్ల రాజశేఖర్‌రెడ్డి, రేణుక రాథోడ్, లవడ్యావత్ దాఖ్య, కే.రాజేశ్వర్, కే.నీలేశ్ నాయక్, పి.గోపాల్‌నాయక్, కే.శ్రీనివాస్, కే.రాజేందర్ నాయక్, షమీమ్, ఎన్.సురేశ్, డి.రమేశ్‌కుమార్, ఏ.ప్రశాంత్‌రెడ్డి, టి.రాజేంద్రకుమార్, డి.తిరుపతయ్య, సాన ప్రశాంత్, వై.సాయిలౌకిక్, ఎం.సాయి సుశ్మిత, కోస్గి వెంకట జనార్దన్, కోస్గి మైబయ్య, కోస్గి రవి, కోస్గి భగవంత్ కుమార్, కొంతం మురళీధర్ రెడ్డి, ఆకుల మనోజ్ కుమార్, ఆది సాయిబాబు, పొన్నం వరున్‌కుమార్, రమావత్ మహేశ్, ముదావత్ శివకుమార్, దానంనేని రవితేజ, గున్‌రెడ్డి క్రాంతికుమార్ రెడ్డి, కొంతం శశిధర్‌రెడ్డి, అట్ల సుచరితారెడ్డి, జీపీ పురేందర్, నూతన్ రాహుల్ కుమార్, లవ్‌డ్యా శాంతి, రమావత్ దత్తు, అజ్మీరా పృథ్వీరాజ్, జాదవ్ రాజేశ్వర్, పూల రవికిశోర్, రాయపూర విక్రమ్, రాయపురం దివ్య, ధనావత్ భరత్ నాయక్, పాశికంటి రోహిత్‌కుమార్, గాదె సాయిమధు, లోకిని సతీశ్‌కుమార్, బొడ్డుపల్లి నర్సింగ్‌రావు, గుగులోత్ శ్రీనునాయక్, భుక్య మహేశ్, ముదావత్ ప్రశాంత్, వడిత్య నరేశ్, పూల రమేశ్‌కుమార్.

## సున్నా స్థాయికి కర్బన ఉద్గారాలు

- క్వాంట్రాన్, జీటీఎల్ సంయుక్త భాగస్వామ్యం
- సమీకృత డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు లక్ష్యం
- తగినంత మార్కెట్ సాధనే లక్ష్యం: జీటీఎల్ ఎండీ పవన్ చావలి

సాక్షి, హైదరాబాద్: రవాణా రంగం సామర్థ్యాన్ని గణనీయంగా పెంచడంతోపాటు కర్బన ఉద్గారాలను సున్నా స్థాయికి తీసుకొచ్చేందుకు జర్మనీ కంపెనీ క్వాంట్రాన్‌తో సంయుక్త భాగస్వామ్యం ఏర్పాటు చేసుకున్నట్లు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ కంపెనీ గోల్డ్‌స్టోన్ టెక్నాలజీస్ లిమిటెడ్ (జీటీఎల్) ప్రకటించింది. విద్యుత్తు, హైడ్రోజన్ ఇంధనాలతో పాటు పెట్రోలు, డీజిల్ వాహనాలకూ ఉపయోగపడేలా సమీకృత డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు ఈ భాగస్వామ్యం లక్ష్యమని జీటీఎల్ బుధవారం విలేకరులకు తెలిపింది. 2032 నాటికి రూ.5.8 లక్షల కోట్లకు చేరనుందని, ప్రపంచవ్యాప్తంగా ఫ్లీట్ మేనేజ్‌మెంట్ మార్కెట్‌లో తగినంత వాటా సాధించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని జీటీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పవన్ చావలి తెలిపారు. రవాణా రంగానికి సమీకృత ప్లాట్‌ఫామ్ ఒకదాన్ని ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారని ఆయన తెలిపారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా విద్యుత్తు/హైడ్రోజన్ వాహనాల తయారీ మొదలుకొని, కార్బన్ క్రెడిట్స్ మార్కెటింగ్, డిజిటల్ డేటా అనాలసిస్, బీమా ఏర్పాట్లు, హైడ్రోజన్ ఉత్పత్తి, రవాణా, నిర్వహణ వంటి అన్ని అంశాలనూ అత్యంత సమర్థంగా నిర్వహించగలమని ఆయన వివరించారు. హైడ్రోజన్ ఉత్పత్తి, వాహనాల తయారీ వంటి హార్డ్‌వేర్ అంశాలన్నింటినీ క్వాంట్రాన్ నిర్వహిస్తుందని, జీటీఎల్ సాఫ్ట్‌వేర్, అప్లికేషన్ల తయారీ చేపడుతుందని చెప్పారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రపంచదేశాలన్ని తమ కర్బన ఉద్గారాలను తగ్గించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయని, మొత్తం ఉద్గారాల్లో వాణిజ్య వాహనాల వాటా సుమారు 20 శాతం వరకూ ఉన్న నేపథ్యంలో జీటీఎల్, క్వాంట్రాన్ సమీకృత డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కు ప్రాధాన్యత ఏర్పడిందని క్వాంట్రాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మైకేల్ పెర్ష్కే తెలిపారు. భవిష్యత్తులో తాము సొంతంగా హైడ్రోజన్ వాహనాలను తయారు చేయకపోయినా.. భారత్ లాంటి దేశాల్లో ఆసక్తి కనబరిచే ఏ సంస్థకైనా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని 'సాక్షి బిజినెస్' అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.


# మాస్ కాపీయింగ్‌తో రూ.కోటి

సంపాదించిన ఇరిగేషన్ ఏఈ పూల రమేష్ ● ఇంటర్‌నెట్‌లో ఆర్డర్ ఇచ్చి పరికరాలు ఖరీదు ● రిమాండ్ రిపోర్ట్‌లో వెల్లడించిన సిట్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజ్‌తోపాటు హైటెక్ మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన నీటిపారుదల శాఖ పెద్దపల్లి ఏఈ పూల రమేష్ విచారణలో కీలకాంశాలు వెలుగులోకి వచ్చాయి. సిట్ అధికారులు ఇతడిని బుధవారం కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో కీలకాంశాలు ప్రస్తావించారు. హైటెక్ మాస్ కాపీయింగ్ ద్వారా ఇతడు రూ.1.1 కోటి వరకు ఆర్జించినట్లు తేల్చారు. ఒక్కో అభ్యర్థితో రూ.20-30 లక్షల వరకు ఒప్పందం కుదుర్చుకుని, ఏడుగురితో ఏఈఈ, డీఏఓ పరీక్షలు రాయించినట్లు పేర్కొన్నారు. కొంత మొత్తం అడ్వాన్సుగా తీసుకున్న ఇతడు మిగిలింది ఫలితాల తర్వాత తీసుకోవాల్సి ఉందని అందులో చెప్పారు. కాగా, భార్యను హత్య చేసినట్లు రమేష్‌పై ఆరోపణ లున్నాయి.

**ఆస్పత్రిలో డాక్టర్ ద్వారా పరిచయం**

పెద్దపల్లిలో ఇరిగేషన్ ఏఈగా పనిచేస్తున్న రమేష్‌కు గతంలో నార్కట్‌పల్లి వద్ద ప్రమాదం జరిగింది. అప్పట్లో అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా... డాక్టర్ ద్వారా టీఎస్‌పీఎస్సీ ఉద్యోగి సురేష్ పరిచయం అయ్యాడు. ఆపై ఇద్దరూ స్నేహితులుగా మారడంతో నగరంలోని రమేష్ ఇంట్లో సురేష్ అద్దెకు దిగాడు. ఆపై ఇద్దరి మధ్యా స్నేహం బలపడింది. టీఎస్‌పీఎస్సీలో ఉద్యోగం మానేసిన సురేష్ పేపర్ల లీకేజ్‌లో కీలకంగా మారాడు. ఇతడి ద్వారా ఏఈ పరీక్షలకు సంబంధించిన పేపర్లు రమేష్‌కు అందాయి. వీటిని ఇతడు 30 మందికి విక్రయించాడు. ఇలా వచ్చిన సొమ్ములో సగం సగం తీసుకుందామని సురేష్ ప్రతిపాదించాడు. దీనికి అంగీకరించని రమేష్... తనకు 70 శాతం ఇచ్చేలా సురేష్‌ను ఒప్పించాడు. అభ్యర్థులను వెతికి పట్టుకోవడం, విక్రయించడం లాంటి రిస్కులు తనవే అని, అందుకే ఎక్కువ వాటా కావాలన్నాడు. దీంతో సురేష్ ఏఈఈ, డీఏఓ పేపర్ల లీకేజ్ విషయం ఇతడికి చెప్పలేదు. దీంతో ఏడుగురితో ఒప్పందం చేసుకుని హైటెక్ మాస్ కాపీయింగ్‌కు పథకం వేశాడు. ఇతడు అనుసరించిన హైటెక్ కాపీయింగ్‌కు ఓ సినిమానే స్ఫూర్తిగా నిలిచింది. 'మున్నాభాయ్ ఎంబీబీఎస్' చిత్రం చూసిన రమేష్ అందులోని కాపీయింగ్ పంథాను కాస్త హైటెక్‌గా మార్చి టీఎస్‌పీఎస్సీ పరీక్షలకు వినియోగించాడు. కాపీయింగ్‌కు రమేష్ భారీ స్కెచ్ వేశాడు. ఇంటర్‌నెట్ నుంచి అత్యాధునికమైన చెవిలో ఇమిడిపోయే బ్లూటూత్, సిమ్‌కార్డు ఆధారంగా పని చేసే చిన్న రిసీవర్, ట్రాన్స్‌మీటర్ తదితరాలు ఖరీదు చేశాడు. బ్లూటూత్ డివైజ్ ఎవరికీ కనిపించకుండా చెవిలో పెట్టించాడు. వారి చొక్కా కింది భాగంగా ప్రత్యేకంగా కుట్టించిన జేబులో రిసీవర్ ఉంచాడు. ఏడుగురు అభ్యర్థులు కచ్చితంగా ఇన్‌షర్ట్ చేసుకునేలా సూచించి తనిఖీల్లో దొరక్కుండా చేశాడు. ఓ పరీక్ష కేంద్రం నిర్వాహకుడితో ఒప్పందం చేసుకున్న రమేష్ పరీక్ష పత్రం బయటకు పంపేలా ప్రేరేపించాడు. ఆయా పరీక్షలకు గైర్హాజరైన వారి ప్రశ్నపత్రాలు అన్ని సిరీస్‌లవి ఫొటోలు తీసి ఈ నిర్వాహకుడు వాట్సాప్ ద్వారా రమేష్‌కు పంపాడు. అప్పటికే ఇతడు సిద్ధం చేసుకున్న బృందానికి వీటిని పంపాడు. వాళ్లు చాట్‌జీపీటీ యాప్ ద్వారా ఆయా ప్రశ్నలకు సమాధానాలు గుర్తించి.. వాటిని తమ వద్ద ఉన్న ట్రాన్స్‌మీటర్ ద్వారా ఏడుగురు అభ్యర్థులకు చెప్పారు. ఒక సిరీస్ తర్వాత మరో సిరీస్‌లోని ప్రశ్నల జవాబులను వీళ్లు చెప్పారు. రమేష్ తోపాటు ముగ్గురు అభ్యర్థులను అరెస్టు చేసిన సిట్ మిగిలిన నిందితుల కోసం గాలిస్తోంది. అరెస్టయిన ఇతర నిందితులను కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకోవాలని సిట్ నిర్ణయించింది.



## దేశంలో సమర్థమైన వ్యవస్థలు లేవు



నార్కోటిక్స్, సైబర్ బ్యూరోలను ప్రారంభిస్తున్న మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ. చిత్రంలో సీపీ ఆనంద్, డీజీపీ అంజనీకుమార్

- అవే ఉంటే విదేశాల నుంచి డ్రగ్స్ ఎలా వస్తాయి?
- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- నార్కోటిక్స్, సైబర్ బ్యూరోల ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: దేశంలో సమర్థమైన వ్యవస్థలు లేని కారణంగానే మాదక ద్రవ్యాలు విదేశాల నుంచి అక్రమ రవాణా ద్వారా వస్తున్నాయని ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు. సరైన వ్యవస్థలే ఉంటే విమానాల ద్వారా, సముద్రాల మీదుగా డ్రగ్స్ ఎలా వస్తాయని ప్రశ్నించారు. సమర్థమైన వ్యవస్థల్ని ఏర్పాటు చేయడంతో పాటు చట్టాలను మార్చాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సరిహద్దుల్ని మూసేయడం, ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడం ద్వారా డ్రగ్స్ మహమ్మారికి చెక్ చెప్పవచ్చని సూచించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (ఐసీసీసీ) ఏర్పాటు చేసిన తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్-నాబ్), తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలను హోం మంత్రి మహమూద్ అలీతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. నార్కోటిక్స్ బ్యూరోకు హైదరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్, సైబర్ బ్యూరోకు సైబరాబాద్ సీపీ ఎం.స్టీఫెన్ రవీంద్ర డైరెక్టర్లుగా వ్యవహరించనున్నారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... 'ఒకప్పుడు పాతబస్తీకి వెళ్లాలంటే అనేక విధాలుగా ఆలోచించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. మాదకద్రవ్యాలకు చెక్ చెప్పడమనేది ఒక్క ఎక్సైజ్ శాఖ వల్ల కాదు. సమన్వయంతో పని చేయడానికి, నేరగాళ్ల ఎత్తులకు పై ఎత్తులు వేసి చెక్ చెప్పడానికి ఈ రెండు బ్యూరోలు ఏర్పాటయ్యాయి' అని అన్నారు.

హోం శాఖ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. 'మాదకద్రవ్యాల వినియోగంతో పాటే అక్రమ రవాణా కూడా పెరిగింది. ప్రస్తుతం ఈ మహమ్మారి గ్రామాల్లోని స్కూళ్లకు పాకింది. రాష్ట్రంలో నానాటికీ నార్కోటిక్స్ కేసులు పెరుగుతున్నాయి. ఇక స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ వినియోగంతో పాటు సైబర్ నేరాలూ పెరుగుతున్నాయి.. అని చెప్పారు.

**సైకిల్ పెట్రోలింగ్ టు సైబర్ పెట్రోలింగ్**

1910లో నిజాం నవాబు నగరంలో పెట్రోలింగ్ కోసం 10 సైకిళ్లు అందించడం అప్పట్లో వినూత్న చర్య.. ఇప్పుడు సైబర్ ప్రపంచంలో పెట్రోలింగ్, నేరాల నిరోధం కోసం రాష్ట్ర స్థాయి బ్యూరో ఏర్పాటు కూడా ఆ కోవలోకే వస్తుంది. వ్యవస్థీకృత నేరంగా మారిన మాదకద్రవ్యాలను చెక్ చెప్పడానికి, యువత భవిష్యత్తు భద్రత కోసం నార్కోటిక్స్ బ్యూరో అనివార్యం. – అంజనీకుమార్, డీజీపీ

## మిసైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డీజీగా రాజబాబు



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక రక్షణ సంస్థ మిసైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్‌గా డీఆర్‌డీఓ శాస్త్రవేత్త ఉమ్మలనేని రాజబాబు నియమితులయ్యారు. డాక్టర్ బీవీహెచ్‌ఎస్ నారాయణమూర్తి మే నెల 31వ తేదీన పదవీ విరమణ చేయనుండటంతో ఆయన స్థానంలో కొత్త డీజీగా రాజబాబును నియమించారు. జూన్ ఒకటవ తేదీ నుంచి ఆయన డీజీగా విధులు నిర్వర్తించనున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యనభ్యసించి, ఐఐటీ (ఖరగ్‌పూర్) నుంచి పీహెచ్‌డీ, జేఎన్‌టీయూ నుంచి ఎంబీఏ పట్టాలు పొందిన రాజబాబు 1988లో భారతీయ వాయుసేనలో తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. 1995లో డీఆర్‌డీఓలో చేరారు. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తగా సుమారు 35 ఏళ్లపాటు సేవలందించిన ఆయన, భారత రక్షణ రంగానికి కీలకమైన అనేక క్షిపణి వ్యవస్థల అభివృద్ధికి తోడ్పడ్డారు. రీసెర్చ్ సెంటర్ ఇమారత్‌లోని ఎయిర్ డిఫెన్స్ విభాగం ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా ఈయన బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థల డిజైన్, డెవలప్‌మెంట్‌లకు అవసరమైన ప్రోత్సాహం అందించారు. 'మిషన్ శక్తి'లో భాగంగా అభివృద్ధి చేసిన తొలి యాంటీ శాటిలైట్ క్షిపణి పరీక్షలు కూడా రాజబాబు నేతృత్వంలోనే జరగడం గమనార్హం. రీసెర్చ్ సెంటర్ ఇమారత్ డైరెక్టర్‌గానూ క్షిపణుల వైమానిక వ్యవస్థలు, వ్యూహాత్మక యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్స్, క్రూయిజ్ మిస్సైల్స్, ఇతర ఆయుధ వ్యవస్థల అభివృద్ధి వేగంగా జరిగేందుకు కృషి చేశారు. ఆత్మనిర్భరత సాధనలో అత్యున్నత ప్రతిభ కనబరిచినందుకు డాక్టర్ రాజబాబుకు ప్రతిష్టాత్మక 'అగ్ని'అవార్డు లభించింది. అంతేకాకుండా డీఆర్‌డీఓ సైంటిస్ట్ ఆఫ్ ద ఇయర్, విజ్ఞాన్ ప్రతిభ సమ్మాన్ అవార్డులు కూడా అందుకున్న రాజబాబు, ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ వంటి వృత్తి నిపుణుల సంస్థల్లో సభ్యులుగానూ ఉన్నారు.

## ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ విడుదల

**5 నుంచి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం**

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీలో 2023–24 ఏడాది ప్రవేశాలకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ట్రిపుల్‌ఐటీ వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్‌కుమార్, ఇతర అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 5 నుంచి ఆన్‌లైన్‌లో రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 1,404 జనరల్ సీట్లు, 96 స్పోర్ట్స్ కోటా, 105 గ్లోబల్ కోటాలో సీట్లు కేటాయించారు. మొత్తంగా 1,605 సీట్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. విద్యార్థుల సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ నంబర్లు 7416002245, 7416058245, 7416122245 కాల్ చేయవచ్చని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు www. rgukt. ac.in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

## 2 వేల ఏళ్ల క్రితమే ఇనుము పరిశ్రమలు



- వనపర్తి జిల్లా చిట్యాలలో వెలుగుచూసిన ఆధారాలు
- ఇనుము తయారీ తర్వాత మిగిలిన వ్యర్థం వెలుగులోకి..

సాక్షి, హైదరాబాద్: ఇనుము తయారు చేసిన తర్వాత మిగిలిన వ్యర్థమిది.. దీన్ని చిట్టెంగా పేర్కొంటారు. ఈ చిట్టెం రాళ్ల వయసు దాదాపు 2 వేల ఏళ్లు. శాతవాహనుల కాలంలోనే మన వద్ద ఇనుము పరిశ్రమ విలసిల్లిందనటానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. తాజాగా వనపర్తి జిల్లా చిట్యాల గ్రామ శివారులో ఇలాంటి చిట్టెం నిల్వలను గుర్తించారు. ఈ ప్రాంతం ఒకప్పుడు ఇనుము పరిశ్రమలకు నిలయంగా ఉండేదని, నాటి పరిశ్రమ తాలూకు అవశేషాలుగా ఇప్పుడు ఈ చిట్టెం రాళ్లు వెలుగుచూస్తున్నాయని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ వెల్లడించారు. చిట్యాలలో తమ బృందం సభ్యులు బైరోజు చంద్రశేఖర్, డాక్టర్ శ్యాంసుందర్‌లు స్థానిక మూలోని గుట్ట సమీపంలోని తాళ్లగడ్డలో వ్యవసాయ క్షేత్రంలో చిట్టెం రాళ్లను గుర్తించినట్టు ఆయన పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాంతంలో భూమిని వ్యవసాయయోగ్యంగా మార్చే పనులు చేస్తున్నప్పుడు 20 అడుగుల చుట్టు కొలతగల ఇటుకల కట్టడం ఆనవాళ్లు వెలుగుచూసినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. ఇనుము కరిగించేందుకు వాడే మూసలు, పెద్ద గొట్టాలు, భారీ గాగుల పెంకులు లభించినట్టు పేర్కొన్నారు.

### బయటపడిన భారీ ఇటుకలు



నాటి ఇటుకలను చూపుతున్న పరిశోధకులు

16 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పు ఉన్న భారీ ఇటుకలు కూడా బయటపడినట్టు వెల్లడిస్తున్నారు. ఇనుము కరిగించగా మిగిలిన బొగ్గు బూడిద కూడా వెలుగు చూస్తోందని పేర్కొంటున్నారు. యుద్ధానికి అవసరమైన ఆయుధాలు, వ్యవసాయ పనిముట్లు, ఇతర పరికరాలకు ఈ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఇనుము పరిశ్రమలు ఉండేవనటానికి ఈ ఆధారాలు, ఇనుము దేవతగా పేర్కొనే మమ్మాయి దేవతారాధన ఆనవాళ్లు స్థానికంగా ఉన్నాయని హరగోపాల్ పేర్కొన్నారు. చిట్టెం పతం నుంచే చిట్యాల ఊరి పేరు వచ్చిందని ఆయన వెల్లడించారు. సమీపంలోని పెద్ద మందడి, చిన్న మందడి, అమ్మాయిపల్లి, గణపురం, మానాజీపేటల్లో నాటి చారిత్రక ఆధారాలున్నాయని తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. 